V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శనివారం
02-05-2026
RNI No : TGTEL/25/A1676
సంపుటి : 01 | సంచిక : 290 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






# సమగ్ర కార్యాచరణతో రండి

## ఆర్టీసీ గుర్తింపు ఎన్నికలు... విలీనంపై సీఎం సూచన

## పీఆర్సీ అంశాన్ని మేం పరిష్కరిస్తాం

- గాజులరామారంలో 100, బహదూర్‌గూడలో 150 ఎకరాల్లో బస్ టెర్మినళ్లు
- ఒక డ్రైవర్‌నూ ఉద్యోగం నుంచి తొలగించం
- ఉద్యోగులు, మేనేజ్‌మెంట్ మధ్య స్నేహపూర్వక వాతావరణం ఉండాలి
- ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి
- సమ్మె కాలంలో వేతనాల చెల్లింపు, కేసుల ఎత్తివేతకు ఆదేశం

**విశ్వంభర, హైదరాబాద్:** ఆర్టీసీ మనుగడ, గౌరవాన్ని పెంపొందించి ప్రయాణికులకు మెరుగైన సేవలందించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు రావాలని కార్మిక సంఘాల ప్రతినిధులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై అన్ని సంఘాల నాయకులు సమావేశమై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. పీఆర్సీ అంశాన్ని తాము పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర ఉన్నతాధికారులతో ఆర్టీసీ కార్మిక సంఘాల ప్రతినిధులు ముఖ్యమంత్రి నివాసంలో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గుర్తింపు సంఘం ఎన్నికలు, విలీనంపై ఏవిధంగా ముందుకు పోవాలనే దానిపై సంఘాల నాయకులు సమావేశమై ప్రభుత్వం ఎదుట ఆప్షన్లు ఉంచాలని సూచించారు. ఒకవేళ యూనియన్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోతే ఏ యూనియన్‌కు ఆ యూనియన్ తమ ఆప్షన్లు ఇస్తే కామన్‌గా ఉన్న వాటికి ఆమోదం తెలిపి.. భిన్నాభిప్రాయాలు ఉన్న వాటిపై చర్చిద్దామని సీఎం అన్నారు. ఆర్టీసీ బకాయిలు తమ హయాంలోని కావని.. కానీ వాటిని చెల్లించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం ఆర్టీసీ.. మిగతా2లో...

# సిలిండర్ల ధరలు పెరుగుతాయని ముందే చెప్పాను

- ఈ పెంపును నేను ముందే ఊహించా
- ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు రూ. 1,380 పెరిగాయి
- కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగింది
- కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ



**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరల పెంపు నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఈ పెంపును తాను ముందే ఊహించానని అన్నారు. ఎన్నికల తర్వాత దేశీయ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు గురయ్యే అవకాశం ఉందని ఆరోపించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు రూ. 1,380 పెరిగాయని, ఇది కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ ధరల పెంపు ప్రభావం టీ స్టాల్స్, దాబాలు, హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపుల వంటి చిన్న వ్యాపారాలపై పడుతుందని అన్నారు. అలాగే గృహ ఖర్చులు కూడా ప్రభావితం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ఎన్నికల బిల్లు అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించిన ఆయన, గ్యాస్ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని రాహుల్ గాంధీ హెచ్చరించారు. కాగా, త్వరలోనే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెరుగుతాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. బంగాల్‌లో పోలింగ్ బుధవారంతో ముగుస్తుండటం, అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో ఇప్పటికే పోలింగ్ పూర్తయిపోవడంతో మోదీ ప్రభుత్వం త్వరలోనే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచుతుందన్నారు. ప్రజలు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. "ఎన్నికల ఉపశమనం ముగిసింది. ద్రవ్యోల్బణ తాపం వచ్చేస్తోంది! ఏప్రిల్ 29 తర్వాత జాగ్రత్త పెట్రోల్, డీజిల్, అన్నీ ఖరీదవుతాయి. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు, మోడీ ప్రభుత్వం లాభాలను తన జేబులో వేసుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి, ఆ భారాన్ని మీపై మోపుతుంది. ధరలు తక్కువగా ఉన్నప్పుడు దోచుకునే ప్రభుత్వం, ద్రవ్యోల్బణ తీవ్రతను మాత్రం ప్రజలే భరించేలా వదిలేస్తుంది." అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

- జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుంది
- అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలి
- అనుమానాలకు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2

# రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తా

- ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తా
- నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పనితీరు కనబరిచారు
- ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుంది: సీవీ ఆనంద్
- తెలంగాణ నూతన డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు



2

## ఎన్నికల తర్వాత గ్యాస్ ధర పెంపు

# ప్రజలను మోసగించడమే

- పెంచిన ధరలతో 19 కేజీల గ్యాస్ ధర మూడువేలకు మించి పోయింది
- ఈ పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ
- కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

2




# ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఎంకు వినతి

**విశ్వంభర, హైదరాబాద్ :** ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన నివాసంలో తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు కాచం సత్యనారాయణ, అధ్యక్షుడు అక్బర్ అలీ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. సమ్మె సందర్భంగా ఆత్మహత్యకు పాల్పడ్డ శంకర్ గౌడ్ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. సమ్మె సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వము వెంటనే నెరవేర్చాలని అన్నారు. మహిళా కార్మికులకు పని గంటలను కుదించాలని అన్నారు. ఎలక్ట్రికల్ బస్సులకు కూడా ఆర్టీసీ డ్రైవర్లని నియమించాలని డిమాండ్ చేశారు.



# హామీలు అమలు చేయకుంటే ఆందోళన చేస్తాం

- రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం
- ధాన్యం, మొక్కజొన్న, శనగ కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది
- తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటానన్న హామీని సమాధి చేశారు
- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

2



## శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై

# ఘోర రోడ్డు ప్రమాదం

- ఆరుగురి మృతి.. మృతుల్లో ఇద్దరు చిన్నారులు
- మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికితీత
- అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది
- మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తింపు
- మాజీ మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి

2





# సమగ్ర కార్యాచరణతో రండి

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల నిధులను వాడుకుందని సీఎం గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామన్నారు. సమస్యల శాశ్వత పరిష్కారానికి అంతా కలిసిరావాలని, భావోద్వేగాలు, రాజకీయాల ప్రభావాలకు లోనైతే సంస్థకు నష్టం వాటిల్లుతుందని సీఎం అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ప్రభుత్వం వేర్వేరనే భావన తమకెప్పుడూ లేదన్నారు. 2006లో జడ్పీటీసీ సభ్యునిగా గెలిచిన్పటి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, అధ్యక్షునిగా ఉన్న సమయలో ఆర్టీసీ కార్మికులు చేసిన పోరాటాల్లో పాలుపంచుకున్నానని సీఎం గుర్తు చేశారు. సింగరేణి, విద్యుత్ కార్మికులతో పాటు ఆర్టీసీ కార్మికులు బలంగా కోరుకున్నందునే తాము అధికారంలోకి వచ్చామని సీఎం తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీలో నియామకాలు చేపట్టడంతో పాటు బస్సుల సంఖ్యను పెంచామని, కారుణ్య నియామకాలు చేపట్టామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరిగిందని.. నెలా నెలా చెల్లింపులతో ఆర్టీసీ ఆదాయం పెరిగిందని సీఎం అన్నారు. పని భారం పెరిగినా క్షేత్ర స్థాయి సిబ్బంది సహనంతో పని చేస్తుండడంతో తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే అగ్రగామి సంస్థగా నిలిచిందని సీఎం పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలు, దూర ప్రాంత ప్రయాణికుల సౌకర్యం కోసం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బస్ టెర్మినళ్లు నిర్మించడానికి ఆర్టీసీకి గాజులరామారంలో వంద ఎకరాలు కేటాయించామని, బహదూర్‌గూడ (శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో)లో 150 ఎకరాలు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆర్టీసీని సమున్నత స్థానంలో నిలపాలనే లక్ష్యంతోనే ఈ టెర్మినళ్ల నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల నుంచి డిమాండ్ లేకపోయినా



తామే స్వయంగా ఈ నిర్ణయం తీసుకున్నామని సీఎం తెలిపారు. ఆర్టీసీలో డీజిల్‌కు ఏటా రూ.2 వేల కోట్లు వ్యయం చేస్తున్నారని.. ఆ వ్యయం తగ్గింపునకే తాము ఈవీల వైపు మొగ్గుచూపుతున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఆదాయం పెరగాలంటే ఖర్చు తగ్గించుకోవాలని, దీనికి పక్కా ప్రణాళిక అవసరమని సీఎం అన్నారు. 1000 ఈవీ బస్సులు కొనుగోలు చేసి మెట్రో, ఎంఎంటీఎస్‌తో అనుసంధానం చేసి లాస్ట్ మైల్ కనెక్టివిటీకి కృషి చేస్తామని సీఎం తెలిపారు. అధిక వడ్డీలకు తెచ్చిన అప్పులను రీకన్‌స్ట్రక్షన్ చేయడానికి ప్రయత్నిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సంస్థను బలోపేతం చేసుకుని నిలబెట్టుకోవడానికి కార్మికులు సహకరించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. ఆర్టీసీలో ఒక్క డ్రైవర్‌ను తొలగించమని ముఖ్యమంత్రి తెలిపారు. ఆర్టీసీ కార్మికులు, మేనేజ్‌మెంట్ మధ్య గ్యాప్ రాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. డిపో మేనేజర్లు, ఈడీ, ఎండీ స్థాయి అధికారులు తరచూ కార్మిక సంఘాల నాయకులతో సమావేశమై సుహృద్భావ వాతావరణంలో మాట్లాడుకుంటే సగం సమస్యలు పరిష్కారమవుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులతో మూడు నెలలకోసారి సమావేశం కావాలని మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ నాగిరెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అనేక ఇబ్బందులున్నా ఉద్యోగులు, కార్మికులు సమస్యల పరిష్కారానికి తాము పెద్దపీట వేస్తున్నామని సీఎం తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల చెల్లింపులను రూ.700 కోట్ల నుంచి రూ.1000 కోట్లకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆర్టీసీ సమస్యలను 100 శాతం పరిష్కరిస్తామని.. కార్మికులకు అండగా ప్రభుత్వం ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. చిన్న చిన్న స్పర్ధలతో సంస్థకు నష్టం వాటిల్లే పనులు చేయకూడదని.. సంస్థ మనుగడ సాగిస్తేనే అందరికీ మేలు జరుగుతుందని సీఎం అన్నారు. ఈ సందర్భంగా 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధుల విజ్ఞప్తికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, సీఎం ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి, ఎమ్మెల్యే లు మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, కేఆర్ నాగరాజు, వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులు ఏ.ఆర్. రెడ్డి, థామస్ రెడ్డి (తెలంగాణ మజ్దూర్ యూనియన్), అశ్వత్థామ రెడ్డి, శంకర్ (తెలంగాణ మజ్దూర్ యూనియన్ (రి)), వీరాంజనేయులు, వి.ఎస్.రావు (స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్), ఎస్.బాబు, ఈ.వెంకన్న (ఎంప్లాయీస్ యూనియన్), పి.కమల్ రెడ్డి, ఎండీ మౌలానా (నేషనల్ మజ్దూర్ యూనియన్), ఎంకే బోస్, బి.యాదగిరి (కార్మిక పరిషత్), జి.అబ్రహం, మొగుళ్ల రాజిరెడ్డి (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్), రాజిరెడ్డి, బి.యాదయ్య (స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (రి)), బి.మునిరాములు, కె.యాదయ్య (బహుజన కార్మిక యూనియన్), కాచం సత్యనారాయణ, ఎండీ అక్బర్ అలీ (ఆర్టీసీ వర్కర్స్ యూనియన్), కె.మనోహర్‌రావు, ఈ.స్వామి కుమార్ (కార్మిక సంఘ్), పున్న హరికిషన్, గోవింద్ (సామాజిక తెలంగాణ మజ్దూర్ యూనియన్), డి.వి.కె.రావు, కె.హనుమంతు ముదిరాజ్ (తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్), దువ్వాసీ యాదయ్య, సుద్దాల సురేష్ (బహుజన్ వర్కర్స్ యూనియన్) తదితరులు పాల్గొన్నారు.





రాష్ట్ర భద్రతా వ్యవహారాల సలహాదారుగా నియమితులైన బి శివధర్ రెడ్డి , రాష్ట్ర నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవలే బదిలీపై వివిధ పదవీ బాధ్యతలు చేపట్టిన పలువురు సీనియర్ ఐపీఎస్ అధికారులు కూడా ముఖ్యమంత్రిని కలిశారు. ఎంసీ-హెచ్‌ఆర్డీలో ముఖ్యమంత్రిని కలిసిన అధికారుల్లో శిఖా గోయల్, డీఎస్ చౌహన్, షానవాజ్ ఖాసీం, శ్రీ తరుణ్ జోషి, బి సుమతి ఉన్నారు.



బీసీ సంక్షేమం, అభివృద్ధి వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వి హనుమంతరావు శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంసీహెచ్‌ఆర్డీలో జరిగిన సమావేశంలో ఎంపీలు వేం నరేందర్ రెడ్డి,అ-నిల్ కుమార్ యాదవ్ , పలువురు నేతలు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయకుంటే ఆందోళన చేస్తాం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** కాంగ్రెస్‌ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల అమలులో వైఫల్యం చెందడంతో అన్నదాతలు అనేక ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్‌పేర్కొన్నారు. ధాన్యం, మొక్కజొన్న శనగ కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. ఈసందర్భంగా వివరిస్తూ రబీ సీజన్‌లో క్వింటాల్‌కు రూ. 500 బోనస్‌చెల్లించాలని తాలు, తరుగు, తేమ పేరు చెప్పి దోచుకుంటున్న దళారుల నుంచి రైతు ఆదుకుని ప్రతి గింజను మద్దతు దరకే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తాలు, తరుగు, తేమ లేకుండా వడ్లు కొంటానన్న హామీని సమాధి చేశారని, కళ్లముందే తేమ పేరుతో రైతులను నిలువునా ముంచుతున్నా ఎందుకు పట్టించుకోరని నిలదీశారు. మండుటెండల్లో కొనుగోలు కేంద్రాలవద్ద రైతులు పడుతున్న ఇబ్బందులు మీకు పట్టవా, వడ్లకు బోనస్ హామీ అంతా ఉత్తిదే అంటూ ఎద్దేవా చేశారు. గత రబీ సీజన్ కూ బోనస్ ఎగ్గొట్టి ఈ సీజన్ లోనూ బోనస్ కు పాతరేసినట్లేనా అంటూ ప్రశ్నించారు. పత్తి పంటకు మద్దతు ధర ఎగానామం పెట్టి రైతులను ముంచారని, మొక్కజొన్నకు కేంద్రం ఎమ్మెస్పీ ఇస్తున్నా కొనుగోలు బాధ్యతను విస్మరించి దళారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. అకాల వర్షాలతో రెండున్నరేళ్లలో 5 లక్షలకుపైగా ఎకరాల్లో పంట నష్టపోతే జరిగితే ఏం చర్యలు తీసుకున్నారని చెప్పాలని, ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.5 వేల కోట్లు చెల్లించాలని కానీ రూ.260 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారని మండిపడ్డారు. దళారులకు దోచిపెట్టి రైతులను రోడ్డున పడేయడమే కాంగ్రెస్‌విధానామా, పౌరసరఫరాల సంస్థను అప్పుల ఊబిలోకి నెట్టారని, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సివిల్ సప్లయిస్ కార్పోరేషన్ రూ.56 వేల కోట్ల అప్పులతో దివాళా తీయించిందన్నారు. కాంగ్రెస్ రెండున్నరేళ్ల పాలనలో సంస్థను రూ.లక్ష కోట్ల అప్పుల పాలు చేశారని, వరంగల్ డిక్లరేషన్ ను పాతిపెట్టి రాయపూర్ ఏఐసీసీ రైతు తీర్మానాలకు తిలోదకాలిచ్చారా అని పేర్కొన్నారు. రబీ సీజన్ లో రైతుల బాధలపై ఏనాడైనా సమీక్షించారా, వడగాల్పులతో జనం అల్లాడుతుంటే డిజాస్టర్ మంత్రి నిద్రపోతున్నారని నిలదీశారు.ఎన్నడూ లేనంతగా ఎండలు మండిపోతుంటే సమ్మర్ యాక్షన్ ప్లాన్ ఎందుకు చేయలేదన్నారు.కరప్షన్, కలెక్షన్, ల్యాండ్ సెటిల్ మెంట్లు తప్ప రైతుల కన్నీటి వెతలతో మీకు పనిలేదని, నమ్మి ఓటేసిన పాపానికి అన్నదాతలను నట్టేట ముంచుతారా అని విరుచుక పడ్డారు. రైతు వ్యతిరేక ప్రభుత్వంగా ముద్ర పడినా మీకు చలనం లేదని, తక్షణమే రైతులను ఆదుకోవాలని, అన్నదాతలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయకుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

## శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం



**విశ్వంభర, హైదరాబాద్ :** శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకంది. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16 వద్ద ఆగివున్న లారీని వెనక నుంచి కారు ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోవడంతో.. మృతదేహాలు అందులోనే చిక్కుకుపోయాయి. ప్రమాదంలో మరో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఘటనాస్థలికి పోలీసులు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.

### కేటీఆర్ దిగ్భ్రాంతి..

రోడ్డు ప్రమాదంలో ఆరుగురు సిరిసిల్ల వాసులు మృతి చెందడం పట్ల మాజీ మంత్రి కేటీఆర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిరిసిల్ల బీఆర్ఎస్ నేత బొల్లి రామ్మోహన్ సోదరుడు బొల్లి రాజు కుటుంబ సభ్యులు ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన సంతాపం ప్రకటించారు.



## రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తాం

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో శాంతి భద్రతల కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ నూతన డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తామని చెప్పారు. నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతల్లో సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండటం మంచిదని అన్నారు.నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పనితీరు కనబరిచారని ఆయన తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లానే నేరాలు జరిగే తీరులోనూ మార్పులు వస్తున్నాయన్నారు. నేరగాళ్లు కొత్త కొత్త టెక్నాలజీని వాడుతూ, మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వారు అనుసరిస్తున్న టెక్నాలజీ పోలీసులకు కూడా సవాలు విసురుతుందని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశ కు చేరుకుందని డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఆ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తుందన్నారు. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే ఆ కేసు గురించి తనకు తెలుసని ఆయన వివరించారు. త్వరలో ఫోన్ ట్యాపింగ్ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని సీవీ ఆనంద్ తెలిపారు. అంతకు ముందు కుటుంబ సభ్యులతో కలిసి డీజీపీ కార్యాలయంలో సీవీ ఆనంద్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. డీజీపీగా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సీవీ ఆనంద్‌కు పోలీసుశాఖ ఉన్నతాధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

### కీలక విభాగాల్లో సేవలు..

1991 ఐపీఎస్ బ్యాచ్ నకు చెందిన సీవీ ఆనంద్ హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పదవి నుంచి ఇటీవలే పదోన్నతి పొందారు. హెడ్ ఆఫ్ పోలీస్ ఫోర్స్‌గా (డీజీపీగా) ఇవాళ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన పోలీస్ శాఖలోని పలు కీలక విభాగాల్లో సేవలందించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా రెండు విడతల్లో పనిచేశారు. ఇంతవరకు డీజీపీగా ఉన్న శివధర్ రెడ్డి పదవీకాలం గురువారంతో ముగియడంతో సీవీ ఆనంద్‌ను ప్రభుత్వం నూతన పోలీస్ బాస్‌గా నియమించింది.

ఇటీవలే యూపీఎస్సీ (యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) డీజీపీ పోస్టుకు అర్హులైన ఐపీఎస్ అధికారుల జాబితాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి పంపించిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో సీవీ ఆనంద్‌తో పాటు 1994 బ్యాచ్‌కు చెందిన వినాయక్ ప్రభాకర్ ఆప్టే, సౌమ్యమిశ్రా ఉన్నారు. ఈ ముగ్గురిలో అత్యంత సీనియర్ అయిన సీవీ ఆనంద్‌ను డీజీపీగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

### చిన్ననాటి నుంచే క్రమశిక్షణకు మారుపేరుగా..

నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ రంగారెడ్డి జిల్లాలోని హయత్‌నగర్ సమీపంలోని కుంట్లూరు గ్రామంలో ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. ఆయన బాల్యం నుంచే ఎంతో క్రమశిక్షణగా పెరిగారు. తండ్రి దామోదర్ రెడ్డి ప్రభుత్వ అధికారి కావడంతో పరిపాలనపై చిన్ననాటి నుంచే అవగాహన ఏర్పడింది. ప్రముఖ స్కూళ్లలో ఒకటైన హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్నారు. నిజాం కాలేజీలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ విద్యను పూర్తి చేశారు. అనంతరం 1991లో సివిల్స్ పరీక్ష రాసి ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యారు.

**పోలీసింగ్‌లో ఎన్నో మార్పులకు ఆద్యుడు..**

సీవీ ఆనంద్ తన కెరీర్ ప్రారంభంలోనే 10 సంవత్సరాల పాటు వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్ లాంటి మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించడం ఆయనలోని పోరాట పటిమను చాటింది. ప్రాణాలకు తెగించి మరీ కీలక ఆపరేషన్లను లీడ్ చేసినందుకుగాను ఆయనకు 2002లోనే ప్రెసిడెంట్ గ్యాలెంటరీ మెడల్ అందుకున్నారు. హైదరాబాద్ ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాల్లో ఆయన ప్రవేశపెట్టిన పలు కీలక మార్పులు నేటికీ ఆదర్శంగా ఉన్నాయి.నగరంలోని రోడ్లపై ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలను పెంచి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకున్నారు. అందుబాటులో ఉన్న సాంకేతికతను వాడుకుంటూ ఈచలాన్, స్పీడ్ గన్ వ్యవస్థలను ప్రాచుర్యంలోకి తెచ్చారు. సైబరాబాద్ కమిషనర్‌గా పనిచేస్తున్న సమయంలో షీటీమ్స్, షీషటిల్స్ తదితర వినూత్న కార్యక్రమాలతో ఐటీ కారిడార్‌లో మహిళలకు భరోసానిచ్చారు. ఎండలో విధులు నిర్వహించే కానిస్టేబుళ్లకు సన్ గ్లాసెస్ పంపిణీ చేయడమే కాకుండా అనేక కీలక సంస్కరణలకు ఆద్యుడిగా నిలిచారు.

## జూన్2 నాటికి జర్నలిస్ట్‌ల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

**విశ్వంభర, హైదరాబాద్ :** అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్స్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్స్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు.హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రి సొసైటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాలకు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్‌ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమీషనర్ జి. ముకుంద రెడ్డి, సిపీఆర్‌వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల తర్వాత గ్యాస్ ధర పెంపు ప్రజలను మోసగించడమే

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధర పెంచడంపై రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఇది సామాన్యుడిపై పెనుభారం మోపే నిర్ణయం అని ఆయన దుయ్యబట్టారు. 19 కేజీల గ్యాస్ ధరను 993 రూపాయలకు అంటే సుమారు 1000 రూపాయలకు పెంచడంపై శుక్రవారం రోజు ఆయన తీవ్ర స్థాయిలో స్పందించారు. ఒక్కసారిగా 30 నుండి 35 శాతం పెంచడంతో హోటళ్లు, కేఫ్‌లు రెస్టారెంట్లతో సహా చిన్న తరహా వీధి వ్యాపారులపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన ఎద్దేవా చేశారు. ముమ్మాటికీ ఇది ప్రజలను మోసం చేసేందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని పశ్చిమ బెంగాల్ ఎన్నికలు పూర్తి కాంగానే కమర్షియల్ గ్యాస్ ధర పెంచడం అంటే సామాన్యులను మోసం చేయడమే నని ఆయన విమర్శించారు. కేంద్రం పెంచిన ధరలతో 19 కేజీల గ్యాస్ ధర మూడువేలకు మించి పోయిందన్నారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడుతుందని ఆయన చెప్పారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు.

## తెలంగాణ రక్షణ సేనలోకి మాజీ మంత్రి బోడ జనార్దన్

**టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితతో భేటీ**

**త్వరలోనే అనుచరులతో కలిసి పార్టీలో చేరనున్న మాజీ మంత్రి**



**విశ్వంభర, హైదరాబాద్ :** మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు బోడ జనార్దన్ తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) లో చేరనున్నారు. శుక్రవారం బంజారాహిల్స్ లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలోనే తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్ లో చేరుతానని తెలిపారు. సింగరేణి బొగ్గు గనుల ప్రాంతంలో టీఆర్ఎస్ ను బలోపేతం చేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని పేర్కొన్నారు. బోడ జనార్దన్ ప్రస్తుత మంచిర్యాల జిల్లా చెన్నూరు శాసన సభ నియోజకవర్గం నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా వరుసగా నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ఎన్ టీ రామారావు ప్రభుత్వంలో కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ జీవో ఉపసంహరించుకోవాలి : ఆర్ కృష్ణయ్య



**విశ్వంభర, కాచిగూడ :** విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే జీవో నం-7ను తక్షణమే ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాదు కాచిగూడలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పోరాటంతో సాధించుకున్నామని, ఇప్పుడు దానిని ఎత్తివేయాలన్న ప్రయత్నాలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కోర్టుల పేరుతో విద్యార్థులకు నష్టం కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదన్నారు.ప్రస్తుతం ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో నం-7ను ఉపసంహరించుకోవాలని కోరారు. సమావేశంలో పగిళ్ల సతీష్, నీల వెంకటేష్, చెరుకుల రాజేందర్, జీ అనంతయ్య, చందు గౌడ్, శివకుమార్ యాదవ్, మల్లేష్ యాదవ్, అర్జున్, వినోద్ గౌడ్, అంజి గౌడ్, అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మేడే వేడుకలు



**విశ్వంభర, చైతన్యపురి :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా చైతన్యపురి డివిజన్ లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ ఆధ్వర్యంలో పారిశుద్ధ కార్మికులకి శాలువాతో సన్మానించి స్వీట్ బాక్స్ , వాటర్ బాటిల్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా శివప్రకాష్ మాట్లాడుతూ కార్మికుల సేవ వెలకట్టలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్,గౌరీ గారు,శ్రీహరి, శ్రీనివాస్,కనకరాజు,సాయినాథ్ రాజ్ , రమేష్,గణేష్, నాగరాజ,గానీ,పవన్,మహేష్,అసిఫ్, టోనీ, ప్రవీణ్,పాల్గొన్నారు.

## లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శివ ప్రకాష్ ప్రత్యేక పూజలు



**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురి డివిజన్ పరిధిలో కోసగుండ్ల ఫణిగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించిన లక్ష్మీ నరసింహ స్వామి వారి జయంతి కళ్యాణ మహోత్సవానికి బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శివ ప్రకాష్ అతిథిగా పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవాలయ చైర్మన్ కృష్ణారెడ్డి శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అజయ్ కుమార్,తోట శీను యాదవ్,నరేందర్ రెడ్డి,శ్రీహరి, గన్ మన శ్రీనివాస్,కనకరాజు,సాయినాథ్ రాజ్, రమేష్,గణేష్, నాగరాజ,గానీ,పవన్,మహేష్,అసిఫ్, టోనీ, ప్రవీణ్, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నాగోల్ లో మేడే వేడుకలు



**విశ్వంభర, నాగోల్ :** నాగోల్ శాఖ జైపూర్ కాలనీ అంబేద్కర్ చౌరస్తాలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాఖ కార్యదర్శి చెన్నారం మల్లేష్, కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గంధం మనోహర్, హయత్ నగర్ సిఐటియు సర్కిల్ కార్యదర్శి కృష్ణయ్య, భాస్కర్ రజక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేష్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గాజుల ఆంజనేయులు ,రజక సంఘం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మల్లేష్, క్షవర వృత్తి దారుల సంఘం నాయకులు ఎన్నారం యాదగిరి, జిహెచ్ఎంసి కార్మికులు తదితరులు హాజరైనారు.



చైతన్యపురి లోని కొసగుండ్ల లక్ష్మి నరసింహ స్వామి వారి జయంతి కళ్యాణ మహోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ , ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మధు యాష్కీగౌడ్ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొగ్గారపు శరత్ చంద్ర, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

(విశ్వంభర, ఎల్బీనగర్)

# సేవాదళ్ కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీకి పునాది

- బీజేపీ, ఆర్ఎస్ఎస్ ల మతపరమైన విభజన రాజకీయాలను తిప్పికొట్టే శక్తి సేవాదళ్ కు ఉంది
- నామినేటెడ్ పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పించాల్సిన అవసరం ఉంది
- టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్



**విశ్వంభర, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ పునాది లాంటిదని, 140 ఏళ్ల కాంగ్రెస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తూ నేటికీ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు పేర్కొన్నారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ లో కొనసాగుతున్న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ 'సమర్థ్ శిక్షణ శిబిరం' కార్యక్రమానికి శుక్రవారం మధుయాష్కి గారు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి.. సేవాదళ్ కార్యకర్తల గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా మధుయాష్కి గారు మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర పోరాటంలో సేవాదళ్ పాత్ర మరువలేనిది అన్నారు. దేశ ప్రజల్లో స్వాతంత్ర కాంక్షను బలంగా తీసుకెళ్లి స్వాతంత్రం కోసం సైనికుల్లా సేవాదళ్ కార్యకర్తలు పని చేశారన్నారు. సేవాదళ్ లో పని చేసిన జవహర్ లాల్ నెహ్రూ ప్రధానిగా దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా లేకున్నా సేవాదళ్ కార్యకర్తలు తమ సొంత డబ్బులు వెచ్చించి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, పార్టీ విధానాలను ప్రజల్లో తీసుకెళుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో రావడానికి సేవాదళ్ కార్యకర్తల కృషి మరువలేనిలేన్నారు. అలాంటి సేవాదళ్ కార్యకర్తలకు ప్రభుత్వంలో భాగస్వామ్యం కల్పించాల్సిన అవసరం ఉందని, నామినేటెడ్ పదవులను కేటాయించి వారికి సముచిత గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం, పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ లు చేపడుతున్న మతపరమైన విభజన రాజకీయాలకు చెక్ పెట్టే శక్తి సేవాదళ్ కార్యకర్తలకు ఉందన్నారు. ఆ దిశగా సేవాదళ్ కార్యకర్తలు మరింత కృషి చేయాలని సూచించారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ సేవాదళ్ బలోపేతానికి, కాంగ్రెస్ పార్టీ పటిష్టానికి చేస్తున్న కృషిని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ , క్యాంపు కోఆర్డినేటర్ దేవేందర్ శర్మ , ఏఐసీసీ కోఆర్డినేటర్ సమాద్ జీ , సేవాదళ్ రాష్ట కార్యదర్శి కొదుమూరి దయాకర్, ప్రతినిధులు శ్రావణ్ కుమార్ , అప్సర్ యూసఫ్ , గోవింద్ రావు వాజీద్ మెహక్ , మంకాల దాస్ , అంజిరెడ్డి , బండి సురేందర్ , రేణు కుమార్ , గుర్రం శ్రీనివాస్ రెడ్డి , సుంకరి శ్రీనివాస్ రెడ్డి గారు, వాజీద్ బాషా , నీలకంఠేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## శాలివాహన నగర్‌లో మే డే సంబురాలు



విశ్వంభర, మలక్ పేట్ : మలక్పేట నియోజకవర్గం మూసారంబాగ్ శాలివాహన నగర్ లో మలక్ పేట్ టి ఎఫ్ టి యు నియోజకవర్గ అధ్యక్షుడు పోలె పాక వెంకన్న ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే వేడుకలకు టి ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. సందర్భంగా కాచం సత్యనారాయణ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ .26,000 అమలు చేయాలని అన్నారు. ఉపాధి రహిత కాలుష్యకారక పరిశ్రమలను నిషేధించాలని, మల్టీ నేషనల్ షాపింగ్ మాల్స్, హాస్పిటల్స్, ప్రాజెక్టు లో పనిచేసే కార్మిక హక్కులు రక్షించబడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గంట సుదర్శన్, మహమ్మద్ జాహిద్, కూర రమేష్, సూరారం జలేందర్ ,కళకుంట్ల రమేష్, జగదీష్, వెంకన్న, ఇరుగు శ్రీధర్ , రాచకొండ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## చైతన్యపురి లో ఘనంగా మే డే వేడుకలు



**విశ్వంభర, చైతన్యపురి :** చైతన్యపురి డివిజన్ పెయింటర్ అడ్డా దగ్గర పి పుల్లయ్య అధ్యక్షతన జరిగిన మేడే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సరూర్నగర్ సర్కిల్ సిఐటియు మల్లెపాక వీరయ్య హాజరై కార్మికులతో కలిసి మేడే జెండాను ఆవిష్కరించారు. దేశంలో కార్మికులు ఏండ్ల తరబడి పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు హానికరమైన లేబర్ కోడ్లను మోడీ ప్రభుత్వం తీసుకురావడానికి సిఐటియు తీవ్రంగా ఖండించింది. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పెంచి కార్మికులను వెట్టిచాకిలోకి నెట్టేస్తున్నారు. భవన నిర్మాణ కార్మికులకు 60 సంవత్సరాలు నిండిన కార్మికులకు అందరికీ పెన్షన్ రూపంలో ఇవ్వాలని వివిధ అడ్డాల మీద మంచినీటి సౌకర్యాలు రేకుల షెడ్ నిర్మించాలని మేడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం జరిగింది. సరూర్నగర్ సర్కిల్ సిపిఎం పార్టీ కార్యదర్శి సిహెచ్ వెంకన్న, పెయింటర్స్ అడ్డా అధ్యక్షులు డి మల్లేష్ , వీరయ్య ,వెంకన్న, సత్యనారాయణ, సిహెచ్ మల్లేష్, సి మల్లేష్, అంజన్న, పాల్గొన్నారు.

## ఘనంగా మేడే వేడుకలు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** చైతన్యపురి లో మేడే వేడుకలు టి ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు, ఎల్బీనగర్ ఇంచార్జ్ ఇరుగు శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టి ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు. సందర్భంగా అధ్యక్షుడు కాచం సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ లను రద్దు చేయాలన్నారు. వలస కార్మికులకు శ్రమ దోపిడి నుండి రక్షణ కల్పించుటకు మండలం యూనిట్ గా తాసిల్దార్ పర్యవేక్షణ డేటా సేకరణ చేయాలి. వేతనం వసతి సామాజిక భద్రతకు ప్రణాళిక రూపొందించాలి. 26 వేల కనీస వేతనాన్ని అమలు చేయాలి. ఈ కార్యక్రమంలో పల్లె వినయ్ కుమార్ , కూర రమేష్ ,మహమూద్ జాహీద్, పోలే పాక వెంకన్న, జగదీష్, దేవులపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.











# అడకత్తెరలో పోక చెక్కలా పెన్ను కార్మికుల బతుకులు

సత్యం అసత్యంగా, అబద్ధం నిజంగా ప్రచారంలోకి వస్తున్నది. సమాచారాన్ని సేకరించే జర్నలిస్టు విధి అడ కత్తెరలో పోక చెక్కలా నిత్యం అభద్రతలో కొనసాగుతున్నది.అలాంటి పరిస్థితుల్లో పత్రికా స్వేచ్ఛలో ఇండియా తాజా ర్యాంకు 157. ఈ ర్యాంకు వింటే గొంతులో పచ్చి వెలక్కాయ చిక్కుకొని నోట మాట పెగలడం లేదు. నిజాలు వెలుగులోకి చూడడం మానేశాయి. పత్రికా స్వేచ్ఛపై "రిపోర్టర్స్ వితవుట్ బార్డర్స్" అనే అంతర్జాతీయ సంస్థ విడుదల చేసిన తాజా జాబితాలో ఇండియా అత్యంత ఘనమైన 157వ స్థానం పొందింది.

గత సంవత్సరంతో పోల్చితే ఈ యేడాది ఆరు ర్యాంకులు ఎగబాకి 157 స్థానానికి ఎదిగి పోయిందన్నమాట. ఈసంస్థ 25 సంవత్సరాలగా క్రమం తప్పకుండా ఈ పనిని నిబద్ధతతోనే చేస్తూ వస్తున్నది. ర్యాంకులు ఇవ్వడంలో ఆ సంస్థ కు ఏవో ప్రయోజనాలు ఉన్నాయని అనుకోలేము. పత్రికా స్వేచ్ఛస్థాయిని లెక్కగట్టిన మొత్తం 180 దేశాల్లో ఈ దేశ ప్రస్తుత స్థానం దిగువ నుంచి చూస్తే కేవలం 23 దేశాలు మాత్రమే ఇండియా కంటే ముందు ర్యాంకులను కొట్టివేశాయి. ఈ ర్యాంకు దినదిన ప్రవర్ధమానమై పోతూ కొన్నేళ్లలో ఆఖరి నుంచి మొదటి స్థానం అదే చివరి స్థానం180 కి చేరుకునే అవకాశాలను కూడా కొట్టి పారేయలేము. కణతపై తుపాకీ,మెడపై కత్తిమోపి బెదిరించే చోట సత్యం వెలుగు చూసే అవకాశాలు చాలా పరిమితంగా ఉండడంలో ఆశ్చర్యం ఏముంటుంది? అందుకే ఈ దేశ మీడియా ఘనమైన ర్యాంకును పొందింది. ఒకనాడు సామాజిక సేవగా ఉన్న జర్నలిజం అతి ఖరీదైన వ్యాపారంగా మారిపోవడం,అది కార్పొరేట్ వ్యాపారుల గుప్పిట్లోకి వెళ్లిపోవడంతో సమాచారం రూపు, రంగు, రుచి, స్వభావం పూర్తిగా మారిపోయిసత్యం మరుగున పడి పోయింది. ఉన్నది లేనట్లు, లేనిది ఉన్నట్లుగా సమాచార స్వభావం పూర్తిగా మారిపోయింది. ఫలితంగా సత్యం అసత్యంగా, అబద్ధం నిజంగా ప్రచారంలోకి వస్తున్నది. అధికారానికి అప్రియమైన కొన్ని సంఘటనలైతే అసలు ప్రచారం, ప్రసారమే కావడం లేదు. రాజకీయాలు పూర్తిగా వ్యాపార రూపును సంతరించుకోవడం వల్లజరిగిన ఘటన లు,పరిణామాలు కొత్తగా చూపడం మొదలైంది. కార్పొరేట్ వ్యాపారానికి అధికారానికి మధ్య ఇచ్చి పుచ్చుకున్ననే అనేక ఆర్థిక, వ్యాపార సంబంధాలు ఈ స్థితికి మూల కారణం. అధికార వ్యవస్థకు వ్యాపారుల మధ్య కొనసాగుతున్న అవసరాల బంధాలు మీడియా రాజకీయ వైఖరులను శాసించే స్థితికి పతనమై పోయాయి.అంటే మీడియా వైఖరుల (ఎడిటోరియల్ పాలసీ)ను మీడియా యాజమాన్యాలు, అధికార వ్యవస్థలు నిర్ణయించే స్థితికి వచ్చేసాయి. మీడియా చెబుతున్న అబద్ధాలు,అర్థసత్యాలకు గాను జర్నలిస్టులనే జనం నిందిస్తున్నారు. కానీ అసలు కారణాలు వేరు. మీడియా యాజమాన్యాల వైఖరికి అనుగుణంగా మాత్రమే పనిచేయక తప్పని పరిస్థితుల్లోకి ప్రస్తుత జర్నలిస్టులు నెట్టివేయబడ్డారు. అంటే ఏమిటి అర్థం? సమాచార ప్రచార, ప్రసారాల్లో జర్నలిస్టులు సేకరించిన సమాచారం యథాతథంగా వివరించే అవకాశాలు చాలా వరకు ఉండడం లేదు. అలాంటప్పుడు మీడియాలో వచ్చే వార్తలు, కథనాలకు బాధ్యులు జర్నలిస్టులు ఎంత మాత్రం కారు కదా. ఇలాంటి క్రమంలో ఈ గొప్ప ర్యాంకును పొందడంలో వింత ఏమీ లేదు. "సత్యమునే పలుకవలెను, అబద్ధం ఆడరాదు"అని చిన్ననాడు మనం బడిలో చదువుకున్న నీతి సూత్రం అపహాస్యం పాలై పోతున్నది. సత్యం యథాతథంగా చెప్పే కనీస అవకాశాలు కూడా లేని చోట అలాంటి బడి పాఠాలు చెప్పడం వ్యర్థ ప్రయాస మాత్రమే అనిపిస్తున్నది. సత్యమేవ జయతే అనే సూక్తి వెక్కిరింతకు లోనై పోతున్నది. అతి పరిమిత సంఖ్యలో మీడియా సంస్థలు ఉన్న స్థితి కాదిది.ప్రభుత్వ లెక్కల ప్రకారమే ప్రకారం దేశంలో ఇప్పుడు పత్రికల సంఖ్య లక్షకు పైగానే ఉంది. ఉపగ్రహం (సాటిలైట్)ద్వారా వార్తలను అందించే టెలివిజన్ చానెళ్లు సుమారు 500 వరకూ ఉన్నాయి. మీడి యా ఇంతగా విస్తరించి పోయిన సమాజం లో సత్యం అనాథగా మారిపోవటం ఒక వింత పరిణామమే. లక్ష పత్రికలు, 500 ల అత్యాధునిక వార్తా టీవీలు ఉన్న ఈ దేశం పోటీ పడి నిజాలను సమాజానికి అందించవలసిన పరిస్థితులు ఉండాలి కదా. అయితే వీటిలో 95 శాతం నలుగురు భారతీయ కుబేరుల యాజమాన్యంలోనే ఉన్నాయి. నిజమే అవి అన్నీ పోటీ పడి వార్తలను ప్రచారం ప్రసారం చేస్తున్నాయి. కానీ నిజాలు చెప్పడంలో మాత్రం పోటీ కాదు. అధికార వ్యవస్థ ప్రాపకం పొందే ప్రయత్నంలో దానితో అవసరాలు తీర్చుకునే ప్రయత్నాల్లో విపరీతంగా పోటీ పడుతున్నాయి. ఇదిగో పులి అంటే,అదిగో తోక అన్న చందంగా సత్యానికి అనేక ముసుగులు వేసి, రంగులు అద్ది,కల్పనలు,కథలను వాటికి చేర్చి, మేలి ముసుగు వేసిన అబద్దాన్ని జనంలోకి తీసుకు వెళ్లే రీతిలో పోటీ పడిపోతున్నాయి. అందువల్ల ఎన్ని పత్రికలు చదివినా,ఎన్ని వార్తా టీవీలు చూసినా సత్యం తెలుసుకునే అవకాశాలు కనీస మాత్రానికి దిగజారిపోయాయి. అలాగని చెప్పి పత్రికలు చదివే వారు, టీవీలు చూసే వారి సంఖ్య ఏమీ తగ్గిపోలేదు. పత్రికలు చదువుతూనే ఉన్నారు,టీవీల్లో వచ్చే వార్తలు కథనాలు చూస్తూనే ఉన్నారు. కానీ వాటిని



జనం విశ్వసించడం లేదు. జనం ఏమీ అమాయకులు కారు కదా. ఆ సమాచారాన్ని ఏ మాత్రం విశ్వసించడం లేదు. చదువుతూ, వింటూ, చూస్తూ నిజం ఏమై ఉంటుందా అనే లెక్కలు, అంచనాలను ఎవరికి వారే వేసుకుంటున్నారు. అయితే ఇక్కడ ఒక విషయం తప్పని సరిగా ప్రస్తావించాలి. మీడియాకు ప్రధాన ముడి సరుకు అయిన సమాచార సేకరణ పాత్ర విలేకరి, జర్నలిస్టుది కదా. అబద్ధపు ప్రచారంలో ఆయన,ఆమె పాత్ర చాలా పరిమితం. వాళ్లు సేకరించిన సమాచారాన్ని పని చేసే మీడియా సంస్థ వైఖరికి అనుగుణంగా తీర్చిదిద్దాలి. అది ప్రస్తుత జర్నలిస్టు ఉద్యోగ ధర్మం.ఆ ఉద్యోగ ధర్మ నిర్వహణలో ఏ మాత్రం దారి తప్పినా మరుసటి రోజు ఆ జర్నలిస్టు నిరుద్యోగిగా మారిపోయి వీధిన పడే అవకాశాలు చాలా ఎక్కువ. ఇలాంటి స్థితిలో జనానికి నిజం చెప్పే అవకాశాలు అత్యంత కనిష్ఠ స్థాయిలో మాత్రమే ఉంటాయి. అంటే జర్నలిస్టు ఉద్యోగం అనేది ఇప్పుడు ఈ దేశంలో నిత్యం అభద్రతతో కూడుకున్న తుమ్మితే ఊడిపోయే ముక్కు లాంటి ఒక ఉద్యోగం అన్నట్లు. ఒకప్పుడు అత్యంత గౌరవనీయ వృత్తిగా ఉన్న విలేకరి ఉద్యోగం ఇప్పుడు ఆ మర్యాదను పూర్తిగా కోల్పోయింది. ఈ క్రమంలో జర్నలిస్టు ఉద్యోగం అనేది ఈ దేశంలో కత్తి మీద సాము లాంటి యుద్ధంగా మారి పోయింది.జర్నలిస్టులు పొందే వేతనం ఏమంత ఆకర్షణీయమైనది కూడా కాదు. అలాంటి

జర్నలిస్టు నిత్యం అనేక బెదిరింపులు ఎదుర్కొంటున్నాడు.భౌతిక దాడులను కూడా ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇటీవలి కాలంలో అనేక మంది హత్య గావించ బడ్డారు కూడా. న్యాయమైన వేతనం, ఉద్యోగ భద్రత ,సామాజిక భద్రత లాంటివి ఏమీ లేని జర్నలిస్టు ఉద్యోగంలో కొనసాగడం ఇప్పుడు ఈ దేశంలో ఒక సాహసమే అని చెప్పాలి. ఇలాంటి అన్ని పరిస్థితుల స్థూల సారమే 157 వ ర్యాంకు అని అర్థం చేసుకోవాలి. ఈ పరిస్థితుల్లో కూడా జనానికి నిజాలు చెప్పే వేదికలు కొన్ని కూడా ఉన్నాయి.వాటి సంఖ్య అత్యంత పరిమితమైనది. వాటి విస్తృతి కూడా పరిమితం. కేవలం నిజాలను మాత్రమే చెప్పే ప్రయత్నం చేస్తున్న కొన్నిపత్రికలు,కొన్ని టీవీలు,డిజిటల్ పత్రికలు, వెబ్ మీడియా సంస్థలు కొన్ని ఉన్నాయి. ఇలాంటి స్థితిలో నిజాలు చెప్పే ప్రయత్నం చేస్తున్న ఈ మైనారిటీ మీడియాకు ఆర్థిక వనరులు చాలా పరిమితం.ఆ పరిమితులు, పరిధుల్లోనే పనిచేస్తూ నిజాన్ని సమాజానికి చెప్పే జర్నలిజం బాధ్యతను నిర్వర్తిస్తూ అభినందనీయమైన పాత్రను ఆ వార్తా వేదికలు పోషిస్తున్నాయి. సాంకేతికత విస్తృతంగా అందుబాటులోకి వచ్చిన క్రమంలో సామాజిక మాధ్యమా (సోషల్ మీడియా)ల విస్తృతి విపరీతంగా పెరిగి పోయింది. ఎవరు ఏ విషయమైనా తమకు నచ్చిన రీతిలో మొత్తం ప్రపంచానికి చెప్పుకోగల అవకాశాలు ఇప్పుడు అపారంగా ఏర్పడ్డాయి. ఇలాంటి సామాజిక బాధ్యత గల వేదికల ద్వారా మీడియా చెప్పని కొన్ని నిజాలు లోకానికి తెలిసి పోతున్నాయి.ఈ అబద్ధాల ప్రపంచంలో నిజాలు తెలిసే అవకాశాలున్న వేదికలు అందుబాటులో ఉండడం సంతోషించే పరిణామమే అని చెప్పాలి.



గోవర్ధన్ గందె,
9347056621.

## సినీ వినీలాకాశంలో ధ్రువ తార సత్యజిత్ రాయ్

### మే 2.. సత్యజిత్ రాయ్ జయంతి



సత్యజిత్ రాయ్... సినిమాల గురించి ఏ కొంచెం అవగాహన ఉన్నా, ఈ పేరు సుపరిచితమే. ప్రపంచం లోని సినీ దర్శకులలో అగ్రశ్రేణికి చెందిన ప్రతిభాశాలి సత్యజిత్ రాయ్. దర్శకత్వం మటుకే కాక, కథారచన, స్క్రీన్ ప్లే, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ, సంగీత దర్శకత్వం, కళా దర్శకత్వం ఇలా సినిమాలకు సంబంధించిన శాఖలలోనే కాకుండా చిత్రకళ లోనూ, సాహిత్యం లోనూ సాటి లేని మేటిగా తనదైన ప్రత్యేకత చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.సత్యజిత్ రాయ్ (మే 2 1921– –ఏప్రిల్ 23 1992) భారత దేశంలోని బెంగాల్ రాష్ట్రానికి చెందిన సినీ దర్శకుడు, రచయిత. అయన ప్రపంచ సినిమాలో 20వ శతాబ్దపు ఉత్తమ దర్శకుల్లో ఒకడుగా పేరు గడించారు. కలకతాలో బెంగాలీ కళాకారుల కుటుంబములో జన్మించి ప్రెసిడెన్సీ కాలేజ్‌లో ఎకనామిక్స్ చదువుకున్న సత్యజిత్ 1940–41లో తమ కుటుంబానికి మిత్రుడైన రవీంద్ర నాథ ఠాకూర్ బతికుండగానే శాంతినికేతన్ వెళ్ళి చిత్రకళ అభ్యసించారు. సినిమాలూ, గ్రామఫోన్ రికార్డ్ల మోజుతో 1942లో కలకత్తాకు తిరిగి వచ్చారు. 1943 నుంచి సుమారు పన్నెండేళ్ళపాటు ఒక బ్రిటిష్ అడ్వర్టైజింగ్ కంపెనీలో పని చేశాక సినీ రంగంలో కాలు మోపారు. 1955లో పథేర్ పాంచాలీ సినిమాకు దర్శకత్వం వహించిన తరవాత దర్శకుడుగా దేశవిదేశాల్లో పేరు సంపాదించు కున్నారు. అంతకు ముందే కలకత్తా ఫిల్మ్ సొసైటీని స్థాపించడంలో ప్రముఖ పాత్ర నిర్వహించారు. 1949లో కలకత్తాకు వచ్చిన ప్రసిద్ధ ఫ్రెంచ్ దర్శకుడు ఝ్యూం రెన్వార్ వెంట తిరిగి సమకాలీన సినిమా గురించి అవగాహన చేసుకున్నారు. సంవత్సరానికి ఒక సినిమా చొప్పున అతను దర్శకత్వం వహించిన సినిమాలన్నీ ప్రపంచ ప్రసిద్ధిని పొందాయి. కొన్ని బెంగాలీ సాహిత్యం నుంచి తీసుకున్న కథలైతే కొన్ని స్వయంగా రాసుకున్నవి. సీరియస్ కళాఖండాలే కాక పిల్లల కోసం సాహసాలూ, హాస్యంతో కూడిన సినిమాలూ తీశారు. సున్నితమైన హాస్యం, వ్యంగ్యం, వాస్తవిక జీవిత చిత్రణ, అపూర్వం అనిపించే సినీ పరిభాషా, కళా నైపుణ్యం అడుగడుగునా ఆయన సినిమాల్లో కనిపిస్తాయి. ప్రపంచంలోని ఫిల్మ్ ఇన్స్టిట్యూట్‌లన్నీ ప్రత్యేకంగా అధ్యయనం చేసే దర్శకుల్లో రాయ్ ఒకరు. రవీంద్రుడి 'చారులతా' మొదలుకొని పిల్లల సినిమా 'గోపీ గాయేన్' వంటి జానపద చిత్రాలూ, హిందీలో ప్రేంచంద్ కథ ఆధారంగా 'శత్‌రంజ్ కే ఖిలాడీ', రవీంద్రనాథ ఠాకూర్ మీద అద్భుతమైన డాక్యుమెంటరీ ఒకటీ ఇలా ప్రతీ ఒక్కటీ కళాఖండం అనిపించేట్టుగా నిర్మించారు. ఆయనకు దర్శకత్వమే కాక, సినిమా తీయడంలోని ఇతర విభాగాల పట్ల కూడా మంచి పట్టు ఉండేది. తమ సినిమాలో చాలా వాటికి స్క్రీన్ ప్లే, కేస్టింగ్, సంగీతము, సినిమాటోగ్రఫీ, కళా దర్శకత్వము, కూర్పు, పబ్లిసిటీ డిజైన్ చేసుకోవడము – వంటివి కూడా ఆయనే చూసుకునేవారు. రాయ్ సినిమాలు, లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు కలిపి మొత్తము ముప్పై ఏడు చిత్రాలకు దర్శకత్వము వహించాడు. ఆయన మొదటి సినిమా పథేర్ పాంచాలీ, కేన్స్ చలనచిత్రోత్సవములో 11 అంతర్జాతీయ బహుమతులు గెలుచుకుంది. కంప్యూ టర్ ఫాంట్‌లు వ్యాప్తిలోకి రాకముందే రాయ్ బెంగాలీ అక్షరమాలలో కొత్త శైలులని ప్రవేశ పెట్టారు. బెంగాలీలో అనేక కథలూ, వ్యాసాలూ, నవలలూ కూడా రాశారు. సైన్స్ ఫిక్షన్, డిటెక్టివ్ సాహిత్యం మొదలైన ప్రత్యేక విషయాల గురించి కథలు రాసి, ఫేలూ దా మొదలైన పాత్రలతో జైసల్మేర్ కోట నేపథ్యంతో 'షోనార్ కెల్లా' వగైరా సినిమాలు కూడా తీశారు. బెంగాలీ సంస్కారాన్నీ, భారతీయతనూ ఒంట పట్టించుకుని ప్రపంచ స్థాయికి ఎదిగిన సత్యజిత్ రాయ్ ఏ ప్రక్రియను చేపట్టినా ప్రతిభావంతంగా నిర్వహించ గలిగారు. తన చిన్నతనంలోనే ఆర్థర్ కోనన్ డాయిల్ డిటెక్టివ్ కథలనూ, ఎచ్.జి.వెల్స్ తదితరుల సైన్స్ ఫిక్షన్ సాహిత్యాన్నీ అభిమానించే వారు. సత్యజిత్ రాయ్ పిల్లల కోసం "ఫెలూదా" అన్న డిటెక్టివ్ ని సృష్టించారు. 1965 మొదలుకుని 1994 దాకా 35 ఫెలూ దా నవలలు రాసారు. ఇందులో – ఫెలూదా, అతని కజిన్ తపేష్, జటాయు అని పిలువబడు లాల్ మోహన్ గంగూలీ ప్రధాన పాత్రలు. వీరు ముగ్గురు కలిసి పరిష్కరించే సమస్యల సంకలనమే ఫెలూదా కథలు. ఇది కాక సత్యజిత్ రాయ్ ప్రొఫెసర్ శొంకు అన్న మరో పాత్రని కూడా సృష్టించి నవ లలు రాసారు. బెంగాలీ పిల్లల సాహిత్యంలో ఈ రెండు పాత్రలకి ఓ విశిష్ట స్థానం ఉంది. సినిమాలు తీయడమే కాక రాయ్ ఎన్నో పుస్తకాలు, వ్యాసాలు కూడా రాసాడు. అలాగే, ఆయన ప్రచురణ కర్త కూడా. బెంగాలీ పిల్లల పత్రిక "సందేశ్"ను చాలా ఏళ్ళు నిర్వహించాడు. అనేక అవార్డులు పుచ్చుకున్న రాయ్ 1992 లో ఆస్కార్ కూడా అందుకున్నారు.40 ఏళ్ళు సినీరంగంలో ఓ వెలుగు వెలిగి, మరణించేందుకు 23 రోజుల ముందు ఆ పురస్కారాన్ని స్వీకరించి, ఆస్కార్ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయునిగా, ఆపైన భారతరత్న పురస్కారం పొందిన తొలి చలనచిత్ర రంగ ప్రముఖునిగా నిలిచారు. సత్యజిత్ రాయ్ మరణానంతరం భారత ప్రభుత్వ తపాలా శాఖ ఆయన పై ఓ స్టాంపును విడుదల చేసింది.

# ప్రైవేట్ ప్రయాణం నుంచి ప్రభుత్వ సారథ్యం వైపు

### మెట్రో విస్తరణ - ప్రభుత్వ నియంత్రణ
### హైదరాబాద్ రవాణా రంగంలో చారిత్రాత్మక మలుపు
### భాగ్యనగర జీవనరేఖలో నూతన అధ్యాయం

హైదరాబాద్ మహానగర చరిత్రలో మెట్రో రైలు కేవలం ఒక రవాణా సౌకర్యం మాత్రమే కాదు, అది ఒక సామాజిక, ఆర్థిక విప్లవం. భాగ్యనగర జీవన రేఖగా మారిన ఈ ప్రాజెక్టు, ఇప్పుడు ఒక కీలకమైన పరివర్తన దశలో ఉంది. దశాబ్ద కాలం పాటు ప్రైవేటు భాగస్వామ్యంతో నడిచిన ఈ ప్రయాణం, ఇప్పుడు ప్రభుత్వ సారథ్యం వైపు మళ్లుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం ఎల్ అండ్ టి మెట్రో రైల్ హైదరాబాద్ లిమిటెడ్‌లో ఈక్విటీ వాటాను కొనుగోలు చేయాలని భావించడం వెనుక కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే లేదు, దాని వెనుక నగర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకున్న ఒక వ్యూహాత్మక దార్శనికత ఉంది.



హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు బీజాలు 2008లోనే పడ్డాయి. అప్పట్లో ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్ – ప్రైవేట్ భాగస్వామ్య మెట్రో ప్రాజెక్టుగా ఇది ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మొదట మేటాస్ సంస్థకు అప్పగించినా, ఆ తర్వాత తలెత్తిన సంక్షోభాల వల్ల 2010లో ఎల్ అండ్ టి సంస్థ ఈ బృహత్తర బాధ్యతను స్వీకరించింది. సుమారు 22 వేల కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మితమైన ఈ వ్యవస్థ, మూడు ప్రధాన కారిడార్ల ద్వారా 69 కిలో మీటర్ల మేర విస్తరించి ఉంది. 2017 నవంబర్ 28న అప్పటి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా మియాపూర్ నుండి నాగోల్ వరకు ప్రారంభమైన ఈ ప్రయాణం, అనతి కాలంలోనే నగరవాసుల దైనందిన జీవితంలో అంతర్భాగమైంది. ప్రస్తుత గణాంకాల ప్రకారం, నిత్యం ఐదు లక్షల నుండి ఆరు లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించు కుంటున్నారు. ఐటీ హబ్‌లకు ప్రయాణించే ఉద్యోగులు, వాణిజ్య ప్రాంతాలకు వెళ్లే వ్యాపారులు, విద్యార్థులు ఇలా ప్రతి ఒక్కరికీ మెట్రో ఒక సురక్షితమైన, వేగవంతమైన మార్గంగా నిలిచింది. అయితే, ఈ వెలుగుల వెనుక ఆర్థికపరమైన సవాళ్లు కూడా ఉన్నాయి. మెట్రో ప్రాజెక్టు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని సమకూర్చుకోలేకపోయింది. ముఖ్యంగా కోవిడ్–19 మహమ్మారి విధించిన లాక్‌డౌన్ సమయం ఈ సంస్థపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రయాణికుల సంఖ్య తగ్గడం, నిర్వహణ ఖర్చులు పెరగడం, బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలకు వడ్డీలు చెల్లించాల్సి రావడం వంటి కారణాలతో ఎల్ అండ్ టి సంస్థ ఆర్థిక ఒత్తిడికి గురైంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం ఈ ప్రాజెక్టులో భాగస్వామి కావాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ప్రభుత్వం ఈక్విటీని కొనుగోలు చేయడం వల్ల మెట్రో కేవలం ఒక వ్యాపార వస్తువుగా కాకుండా, ప్రజా సేవా దృక్పథంతో నడిచే అవకాశం ఉంటుంది. దీనివల్ల చార్జీల నియంత్రణ, భద్రత, మరియు విస్తరణ నిర్ణయాల్లో ప్రభుత్వానికి పూర్తి స్వేచ్ఛ లభిస్తుంది.మరోవైపు, హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న కొద్దీ పాత మెట్రో మార్గాలు సరిపోవడం లేదు. నగరంలోని నలుమూలలను అనుసంధానం చేయడానికి 'మెట్రో ఫేజ్–2' విస్తరణ అనివార్యమైంది. ప్రభుత్వం సుమారు 76 కిలోమీటర్ల మేర కొత్త మార్గాలను ప్రతిపాదించింది. ఇందులో అత్యంత కీలకమైనది రాయదుర్గం నుండి శంషాబాద్ విమానాశ్రయం వరకు సాగే 31 కిలోమీటర్ల ఎయిర్‌పోర్టు కారిడార్. సుమారు 6,000 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఈ మార్గం వల్ల అంతర్జాతీయ ప్రయాణికులకు ట్రాఫిక్ చిక్కులు తప్పుతాయి. అలాగే నాగోల్ నుండి ఎల్బీనగర్ వరకు అనుసంధానం చేయడం, మియాపూర్ నుండి పటాన్‌చెరు వరకు పొడిగించడం వంటి ప్రణాళికలు నగర పరిధిని మరింతగా పెంచుతాయి.వీటన్నిటికంటే ముఖ్యంగా, దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న పాతబస్తీ మెట్రో అంశం ఇప్పుడు ఒక కొలిక్కి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఎంజీబీఎస్ నుండి చాంద్రాయణ గుట్ట వరకు పాతబస్తీ గుండా మెట్రోను నిర్మించడం సామాజికంగా, రాజకీయంగా సవాలుతో కూడుకున్నది. భూసేకరణ సమస్యలు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, ఇరుకైన రహదారులు అడ్డంకులుగా నిలిచినప్పటికీ, పాతనగర ప్రజలకు కూడా ఆధునిక రవాణా ఫలాలను అందించాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది. ఇది నగరంలోని రెండు విభాగాల మధ్య ఉన్న రవాణా అంతరాన్ని తొలగించి, సమగ్ర నగర అభివృద్ధికి బాటలు వేస్తుంది.?మెట్రోను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడం వల్ల లభించే మరో గొప్ప ప్రయోజనం 'ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్'. అంటే మెట్రో రైలును టీజీఎస్ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ రైళ్లు మరియు త్వరలో రానున్న రీజినల్ రింగ్ రోడ్ తో అనుసంధానించడం. దీనివల్ల ప్రయాణికులు ఒకే టికెట్ లేదా కార్డ్ ద్వారా వివిధ రకాల రవాణా మార్గాల్లో ప్రయాణించవచ్చు. ఇది నగరంలో వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని గణనీయంగా తగ్గించి, కాలుష్య నివారణకు తోడ్పడుతుంది. అలాగే 'ట్రాన్సిట్ ఓరియెంటెడ్ డెవలప్‌మెంట్' పద్ధతిలో మెట్రో స్టేషన్ల చుట్టూ వాణిజ్య సముదాయాలను నిర్మించడం ద్వారా ప్రభుత్వం అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చు.కానీ ఈ ప్రస్థానంలో ఆర్థిక సవాళ్లు ప్రధానమైనవి. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాలు మరియు ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం భారీగా నిధులను వెచ్చిస్తోంది. ఈ క్రమంలో మెట్రో ఈక్విటీని కొనుగోలు చేయడం, కొత్త ఫేజ్ నిర్మాణానికి వేల కోట్ల రూపాయలను సమీకరించడం ప్రభుత్వానికి ఒక కత్తిమీదసాము వంటిదే.కేంద్ర ప్రభుత్వం నుండి రావాల్సిన వాటా, రుణాలు, మరియు అంతరాజతీయ ఆర్థిక సంస్థల నుండి సహాయం పొందే విషయంలో రాజకీయ చతురత అవసరం. ప్రభుత్వం నియంత్రణలోకి వెళ్ళినప్పుడు ప్రైవేటు రంగంలోని చురుకుదనం, నాణ్యత తగ్గకుండా చూసుకోవడం కూడా ఒకపెద్ద బాధ్యత. బ్యూరోక్రసీ వల్ల నిర్ణయాల్లో జాప్యం జరగకుండా ఒక స్వయంప్రతిపత్తి కలిగిన వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మాత్రమే ఈ లక్ష్యాలను సాధించవచ్చు.హైదరాబాద్‌ను కేవలం ఒక ప్రాంతీయ నగరంగా కాకుండా, గ్లోబల్ సిటీగా తీర్చిదిద్దాలనే రేవంత్ రెడ్డి ప్రభుత్వ ఆలోచనలో మెట్రో విస్తరణ ఒక ముఖ్యమైన పిల్లర్. ఐటీ, ఫార్మా రంగాలు ఇప్పటికే ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందాయి. ఈ రంగాల్లో పెట్టుబడులు పెరగాలంటే మౌలిక సదుపాయాలు అంతర్జాతీయ స్థాయిలో ఉండాలి. ఒక సమర్థవంతమైన మెట్రో వ్యవస్థ కార్బన్ ఫుట్‌ప్రింట్‌ను తగ్గించి, నగరాన్ని పర్యావరణ హితంగా మారుస్తుంది. అభివృద్ధి చెందుతున్న నగరాల్లో సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థే ఆ నగరం యొక్క ఆర్థిక శక్తిని నిర్ణయిస్తుంది.? హైదరాబాద్ మెట్రో పరిణామ క్రమం ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతోంది. పబ్లిక్ – ప్రైవేట్ పార్టనర్‌షిప్ నుండి ప్రభుత్వ భాగస్వామ్యం వైపు సాగుతున్న ఈ ప్రయాణం కేవలం యాజమాన్య మార్పు మాత్రమే కాదు, అది నగర ప్రణాళికలో ఒక నూతన విప్లవం. పారదర్శకత, జవాబుదారీతనం,ప్రజల అవసరాలకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చేలా ప్రభుత్వం అడుగులు వేయగలిగితే, హైదరాబాద్ మెట్రో దేశంలోని ఇతర నగరాలకు ఆదర్శంగా నిలుస్తుంది. భవిష్యత్తు తరాలకు ట్రాఫిక్ రహిత, కాలుష్య రహిత , అత్యాధునిక హైదరాబాద్‌ను అందిం చడంలో మెట్రో ఫేజ్–2,పభుత్వ నియంత్రణ నిర్ణయాలు ఒక మైలురాయిగా నిలిచి పోతాయి. ఒక మహా నగర అభివృద్ధి దాని రవాణా వ్యవస్థ వేగంపై ఆధారపడి ఉంటుంది; ఆ వేగాన్ని అందుదకోవడానికి హైదరాబాద్ ఇప్పుడు సిద్ధమవుతోంది.



రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



## దళిత రత్న అవార్డు అందుకున్న ఎస్. యాదగిరి

**విశ్వంభర, జూబ్లీహిల్స్ :** దళితుల అభ్యున్నతి కోసం చేసిన కృషికి గాను తెలంగాణ ప్రభుత్వం షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గము యూసఫ్ గూడ కు డివిజన్ చెందిన సామాజిక కార్యకర్త ఎస్ .యాదగిరి " దళిత రత్న" అవార్డును రవీంద్ర భారతి లో జరిగిన కార్యక్రమంలో అందుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరిని శాలువాతో సత్కరించి అవార్డును ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డు రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు. అవార్డు రావడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె నాగరాజు, రాజు వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### కేంద్రం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ ను

## వెంటనే రద్దు చేయాలి: సిఐటియు



**విశ్వంభర, వనస్థలిపురం :** కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కొడ్స్ ను వెంటనే రద్దు చేయాలి అని మే డే స్ఫూర్తితో ఎనిమిది గంటల పని దినానికై ఉద్యమిద్దాం అని సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అన్నారు. వనస్థలిపురం రైతు బజార్ చిరు వ్యాపారస్తుల తోపుడు బండ్ల కార్మిక యూనినార్ ఆధ్వర్యం లో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి రామస్వామి, వనస్థలిపురం లేబర్ ఆడ్డ అధ్యక్షులు ఐక రాజు అంజయ్య, పోలే రమేష్, అంజి నాయక్, అబ్బోల భారతమ్మ, వరలక్ష్మి, జయమ్మ, లక్ష్మమ్మ, కాశమ్మ. సహాయ కార్యదర్శులు మహేష్ ధనరాజ్, సాయి చరణ్, సచిన్ టెండూల్కర్, మల్లయ్య కొద్దివద్దిన్, నగేష్, కుటుంబ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మే డే ఉత్సవ వేడుకలు



**విశ్వంభర, మూసాపేట్ :** మూసాపేట్ డివిజన్‌లో మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్మికుల ఐక్యతను ప్రతిబింబిస్తూ నిర్వహించిన ఈ వేడుకలకు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్, సీనియర్ నేత గొట్టిముక్కుల దేశాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ, మూసాపేట్ డివిజన్ కార్మికుల సంఘం అధ్యక్షులు కరికి పెంటయ్య, నాగరాజు ఆధ్వర్యంలో మే డే వేడుకలను విజయవంతంగా నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు. ప్రపంచం కార్మికుల కృషిపైనే ఆధారపడి ఉందని, కార్మికులు లేనిదే ప్రపంచం కొనసాగదని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బాలాజీ, పుష్ప రెడ్డి, సంతోష్, నాగేష్, నాగిరెడ్డి, దినేష్, రాజు, మోహన్ తదితరులు, కార్మిక సంఘ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇంటి వద్దకే పెన్షన్ అందిస్తున్న కూటమి ప్రభుత్వం



**విశ్వంభర, రాప్తాడు :** రాప్తాడు మండలం పాలచర్ల గ్రామంలో రాప్తాడు శాసనసభ్యురాలు పరిటాల సునీతమ్మ మరియు టిడిపి రాప్తాడు ఇంచార్జ్ ధర్మవరపు మురళి ఆదేశాల మేరకు అర్హతలు కలిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పాలచర్ల ముత్యాలప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హత కలిగిన ప్రతి ఒక్క వృద్ధునికి ఇంటి వద్దకే పించన్ అందిస్తోందని మరియు ఎవరైనా అనారోగ్యముతో బాధపడుతున్న వారికి హాస్పిటల్ లో ఖర్చు చేసిన డబ్బును కూడా సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితులకు కూటమి ప్రభుత్వం అందిస్తోందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నరేష్ ఫీల్డ్ అసిస్టెంట్ పవన్ వద్దే గోవిందు సీనియర్ నాయకులు రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## టూరిజం కార్మికుల హక్కుల కోసం పోరాటం

**విశ్వంభర, హిమాయత్ నగర్ :** మేడే సందర్భంగా హైదరాబాదు హిమాయత్ నగర్ లోని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అరుణ పతాకాన్ని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి ఎగరవేశారు. చికాగో కార్మికుల స్ఫూర్తితో హక్కులు సాధించుకుంటున్నామని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం పోరాట ఫలితమని పేర్కొన్నారు. అవుట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జీతాల పెంపు, క్రమబద్ధీకరణ, 61 ఏళ్ల వయోపరిమితి, గ్రాచ్యుటీ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నాజర్ వల్లి, హాజ్ మియా, శంకర్రావు, రెడ్డి, రామచంద్రయ్య, దేవి సింగ్, కృష్ణ, చారి, శ్రీనివాస్ రెడ్డి, మౌలాలి, కృష్ణారెడ్డి, కిరణ్, సుదర్శన్ రెడ్డి, శేఖర్, శ్రీను పాల్గొన్నారు.



### బాలికల కళాశాల అభివృద్ధికి

# మరోసారి ముందుకు వచ్చిన అరబిందో ఫార్మా

- 1000 మంది విద్యార్థులకు సరిపడా నూతన భవనం ఏర్పాటు
- అదనపు తరగతి గదులు కావాలని అరబిందో చైర్మెన్ నిత్యానంద రెడ్డిని కోరిన జగ్గారెడ్డి
- మరో 17 అదనపు తరగతి గదులు, ఆడిటోరియం షెడ్ నిర్మాణానికి ముందుకు వచ్చిన అరబిందో ఫార్మా
- జగ్గారెడ్డి, నిర్మల తో కలిసి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ను సందర్శించిన అరబిందో డైరెక్టర్ సదానంద రెడ్డి



**విశ్వంభర, సంగారెడ్డి:** టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జగ్గారెడ్డి వినతి మేరకు సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ను అభివృద్ధి చేసేందుకు అరబిందో ఫార్మా మరోసారి ముందుకు వచ్చింది.గతం లో ఆరు కోట్ల తో 1000 మంది విద్యార్థులకు సరిపడా జి ప్లస్ వన్ భవనాన్ని అరబిందో ఫార్మా నిర్మించింది. సంగారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేవలం సంగారెడ్డి నియోజకవర్గ విద్యార్థులే కాకుండా నారాయణ్ ఖేడ్, వికారాబాద్, బాన్స్ వాడ, పరిగి, జహీరాబాద్ ల నుండి విద్యార్థులు వచ్చి చదువుకుంటున్నారు. ఇంకా డిమాండ్ ఉన్నప్పటికీ పూర్తి స్థాయి లో సౌకర్యాలు లేకపోవడంతో అడ్మిషన్ లు ఇవ్వలేకపోతున్నారు. ఇదే విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ జగ్గారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జగ్గారెడ్డి వెంటనే అరబిందో చైర్మెన్ నిత్యానంద రెడ్డి ని సంప్రదించారు. అవసరమైన సిఎస్సార్ నిధులు ఇవ్వాల్సిందిగా కోరారు. జగ్గారెడ్డి వినతి మేరకు అదనపు తరగతి గదుల తో పాటు ఆడిటోరియం ఏర్పాటు చేసేందుకు అరబిందో ఫార్మా ముందుకు వచ్చింది. అందులో భాగంగా జగ్గారెడ్డి, నిర్మల తో కలిసి అరబిందో డైరెక్టర్ సదానంద రెడ్డి బాలికల జూనియర్ కళాశాల ను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ సునీత తో సమావేశమయ్యారు. కళాశాల ఆవరణ లో ఉన్న ఖాళీ స్థలం లో మూడు అంతస్తుల్లో అదనపు తరగతి గదులు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తామని, త్వరలో బిల్డింగ్ ప్లాన్, కావాల్సిన అనుమతులు తీసుకుంటామని అరబిందో ప్రతినిధులు వివరించారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ 17 తరగతి గదులు అందుబాటులోకి వస్తే మరో వెయ్యి మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వగలమని కళాశాల ప్రిన్సిపాల్ సునీత సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్న జగ్గారెడ్డి, నిర్మల కు, అరబిందో యాజమాన్యానికి ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, నాయకులు, సంతోష్, కిరణ్ గౌడ్, కౌన్సిలర్ లు మహేష్, శ్రీకాంత్ గౌడ్ లు పాల్గొన్నారు.

# పసిబిడ్డలను పారేయకండి

- వద్దనుకుంటే ఊయలలో వేసి వెళ్ళండి
- మహబూబాబాద్ కలెక్టర్ స్నేహశబరీష్



**విశ్వంభర, మహబూబాబాద్:** కన్నపిల్లలను పెంచి పోషించలేని వారు, కన్న తర్వాత వద్దనుకునే వారు చెత్తకుప్పల్లోనో..ముళ్ళపొదల్లోనే విసిరివేయకండి..., మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఊయల ఏర్పాటు చేసాం..., అందులో వేసి వెళ్ళండి..., మీ..వివరాలు ఎక్కడ బయటకు రావని మహబూబాబాద్ జిల్లాకలెక్టర్ స్నేహశబరీష్ కోరారు. ప్రజాపాలనప్రగతిప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఐసిడిఎస్ ఆద్వర్యంలో ఊయల ను ప్రారంభించారు. ఈ..కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి శిరీష, జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్, జిల్లా ఇంచార్జ్ సంక్షేమ అధికారి శిరీష ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆర్ఎంఓ డాక్టర్ జగదీష్ , బాల రక్షభవన్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, డీసీపీఓ కమలాకర్ ,బాలల సంరక్షణ అధికారులు నరేష్, వీరన్న, చైల్డ్ కోఆర్డినేటర్ వెంకటేష్ ,రమేష్,వెంకన్న , సరోజ,ఆమని కళ్యాణి,అనిల్,సాయి, ఉపేందర్, హాజరయ్యారు.



**సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. పట్టణంలోని పోచమ్మ తల్లి దేవాలయ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో సతీ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక రేణుక ఎల్లమ్మ కళ్యాణంలో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడే ఉన్న బైండ్ల పంబాల కళాకారులతో కలిసి నృత్యం చేసి అందరిలో ఉత్సాహం నింపారు. శ్రీ రేణుక ఎల్లమ్మ జమదాగ్ని మహర్షి ల కళ్యాణంతో నేటి నుండి నెల రోజుల పాటు ఎల్లమ్మ జాతర ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఈ ఉత్సవాలకు తెలంగాణ జిల్లాల నుండి లక్షలాదిగా భక్తులు తరలివస్తారు.**

## వస్తా కొండూరులో ఘనంగా మే డే ఉత్సవాలు



**విశ్వంభర, గుండాల :** వస్తా కొండూరు గ్రామంలో మే డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. కార్మికుల ఐక్యతను ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగాల అనిల్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ శెట్టిపల్లి పరుశరాములు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ప్రముఖులు పిట్టల పూర్ణచందర్, పోతరబోయిన సత్యనారాయణ, రిటైర్డ్ హెడ్ మాస్టర్ శ్రీరంగం నరసయ్యతో పాటు కార్మిక కర్షకులు, రైతు కూలీ సంఘం, అమాలి సంఘం, మేస్త్రీ సంఘం సభ్యులు మరియు మైబెల్లి, శ్రీను, యాదగిరి, రమేష్, బాలయ్య, భాష తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోతరబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ మే డే ప్రాముఖ్యతను వివరించారు. అమెరికాలోని చికాగో నగరంలో జరిగిన కార్మిక ఉద్యమం మరియు దాని చారిత్రక నేపథ్యాన్ని సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు.అలాగే సర్పంచ్ లింగాల అనిల్ కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ పరుశరాములు, పిట్టల పూర్ణచందర్, శ్రీరంగం నరసయ్యలు కార్మికుల హక్కులు, సమాన వేతనం, శ్రమకు గౌరవం వంటి అంశాలపై ప్రసంగించారు.గ్రామంలో మే డే వేడుకలు ఉత్సాహభరితంగా సాగి, కార్మికుల ఐక్యతను స్పష్టంగా ప్రతిబింబించాయి.

## ఘనంగా మే డే ఉత్సవాలకు హాజరైన జగదీశ్వర్ గౌడ్



**విశ్వంభర, చందానగర్ :** మే డే సందర్భంగా చందానగర్‌లో ఘనంగా ఉత్సవాలు నిర్వహించబడ్డాయి. స్థానిక నాయకుడు కట్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, శేర్లింగంపల్లి అసెంబ్లీ ఇన్చార్జ్ జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారుఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రపంచం మొత్తం కార్మికుల శ్రమపైనే నడుస్తోందని, కార్మికులు లేకుండా సమాజం ముందుకు సాగలేదని పేర్కొన్నారు. కార్మికుల కష్టంతోనే మన జీవనం కొనసాగుతోందని, వారికి ఎటువంటి ఆపద వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రఘునందన్ రావు, రవీందర్ రెడ్డి, రవీందర్రావు, శేఖర్, ప్రభాకర్ రెడ్డి, హుస్సేన్, హయాజ్ ఖాన్, నరసింహ, ఇస్మాయిల్, కిషన్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు. కార్మికుల ఐక్యతను ప్రతిబింబిస్తూ కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.



## పాశమైలారంలో మిన్నంటిన 'మే డే' ఉత్సాహం

### కార్మిక జెండాను ఆవిష్కరించిన నేత నర్రా బిక్షపతి

### హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని పిలుపు

**విశ్వంభర, సంగారెడ్డి :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే)ను పురస్కరించుకొని సంగారెడ్డి జిల్లా పాశమైలారంలో వేడుకలు అత్యంత ఘనంగా నిర్వహించారు. స్థానిక కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ కార్మిక నాయకులు నర్రా బిక్షపతి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్మిక జెండాను ఆవిష్కరించి, అమరవీరులకు నివాళులర్పించారు.ఈ సందర్భంగా జరిగిన సభలో నర్రా బిక్షపతి మాట్లాడుతూ, ప్రపంచ గతిని మార్చే శక్తి కేవలం కార్మికులకే ఉందన్నారు. సమాజ అభివృద్ధిలో కార్మికుల పాత్ర లకట్టలేనిదని కొనియాడారు.కార్మికుల సంక్షేమం, భద్రత మరియు న్యాయమైన వేతనాల కోసం మన పోరాటం ఆగదు.

## కార్మిక వర్గం హక్కుల సాధనకు నిరంతర పోరాటం




**విశ్వంభర, నారాయణగూడ :** చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వర్గం హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతోందని సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షులు డాక్టర్ కే హేమలత తెలిపారు. మేడే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాదు వైఎంసిఏ నారాయణగూడ చౌరస్తా నుంచి ముషీరాబాద్ గోల్కొండ ఎక్స్ రోడ్ వరకు నిర్వహించిన ర్యాలీని ప్రారంభిస్తూ మాట్లాడారు. పెట్టుబడిదారుల లాభాపేక్షతో వేతనాలు పెరగకపోవడం, నిత్యావసరాల ధరలు పెరగడం కార్మిక కుటుంబాలపై భారం పెంచుతున్నదని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా వేతనాల పెంపు కోసం కార్మికులు పోరాటాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. చికాగో పోరాట ఫలితంగా కార్మికులకు హక్కులు లభించాయని గుర్తుచేసి, అదే స్ఫూర్తితో పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. జే వెంకటేష్, ఎం పద్మశ్రీ, ఎం వెంకటేష్, ఎం దశరథ్, జె కుమారస్వామి, కే అజయ్ బాబు, జి రాములు, టి మహేందర్, వి కామేష్ బాబు, జి నరేష్, పి శ్రీనివాస్, ఎస్ శ్యామలీల, ఆర్ అశోక్, ఎం సత్యనారాయణ, డిఎల్ మోహన్, టీవీకే ప్రసాద్, దామోదర్ పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల కత్తిరింపే లేబర్ కోడ్స్ : వినయ్ కుమార్

**విశ్వంభర, బాగ్ లింగంపల్లి :** మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ సంస్కరణలు కావు, కార్మిక హక్కుల కత్తిరింపేనని సుందరయ్య విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎస్ వినయ్ కుమార్ అన్నారు. మేడే సందర్భంగా హైదరాబాదు బాగ్ లింగంపల్లి లో నిర్వహించిన సభలో మాట్లాడారు. దశాబ్దాలుగా అమల్లో ఉన్న 29 కార్మిక చట్టాలను నాలుగు కోడ్స్‌గా మార్చడం ద్వారా హక్కులను పరిమితం చేస్తున్నారని తెలిపారు. ప్రైవేటైజేషన్, లిబరలైజేషన్ ప్రభావంతో కార్మిక చట్టాల అమలు బలహీనపడిందని, పనిగంటలు పెరిగి శ్రమ దోపిడి అధికమైందని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం మళ్లీ పోరాటం అవసరమని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మేడే జెండా ఎగురవేత, చలివేంద్రం ప్రారంభం నిర్వహించారు. కార్యక్రమంలో సాంబిరెడ్డి, మల్లు విరాట్, జి బుచ్చిరెడ్డి, భూపతి వెంకటేశ్వర్లు, పి సైదులు, పావన్ తదితరులు పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలు అవినీతి ఆరోపణలతో కుదేలు

- కమీషన్ కోసం కక్కుర్తి
- హమాలీ పేరట అధికారుల పైసా వసూల్



**విశ్వంభర, నిజామాబాద్ :** మాక్లూర్ మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అవినీతి ఆరోపణలతో కుదేలవుతున్నాయి. హమాలీ పేరిట అదనపు డబ్బులు వసూలు చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సంచికి రూ.16 నుంచి రూ.18 వరకు వసూలు చేయాలని అధికారులు ఒత్తిడి తెస్తుండగా, లేదంటే ధాన్యం కొనుగోళ్లు నిలిపివేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో రైతులు అయోమయంలో పడిపోతే, అధికారులు క్యాష్ చేసుకుంటున్నారనే ఆరోపణలు మరింత బలపడుతున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పరిస్థితి ప్రస్తుతం సందిగ్ధంగా మారింది. గత ఐదు నెలలుగా పూర్తి స్థాయి పాలకవర్గాలు లేకపోవడంతో ఈ సంఘాలు అధికారుల ఆధీనంలోనే నడుస్తున్నాయి. పర్సన్‌ఇన్చార్జ్లుగా వ్యవహరిస్తున్న అధికారులు ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని కమిషన్ల రూపంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మోర్తాడ్ కమ్మర్పల్లి మండలాల్లో లారీల కొరతతో తీవ్ర ఇబ్బంది. రైతులు అయోమయ స్థితిలో ఉన్నారు. ఆరుకాలం పండించిన పంట సకాలంలో కొనుగోలు చేయకుంటే రైతులు నష్టం వాటిల్లుతుందని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అటు ఐకెపి సెంటర్లు నామ మతరంగా ఓపెన్ చేసి, లేబర్ కొరత ఎక్కువగా ఉందని అధికారులు చేతులెత్తిస్తున్నారు. సిరికొండ మండలాల్లో పలు గ్రామాల్లో ఐకెపి సెంటర్లలో కలెక్టర్ వచ్చినప్పుడు మాత్రమే హడావిడి చేస్తూ, వరి కొనుగోలు కేంద్రాలు వరి తీసుకెళ్లలేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐకెపి సెంటర్లు వెంటనే ప్రారంభించి వారిని కొనుగోలు చేయకుంటే రాస్తారోకో చేస్తామని హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ, వాటి నిర్వహణ పూర్తిగా అధికారుల చేతుల్లో ఉండటం సమస్యలకు దారితీసింది. ధాన్యం కాంటా, లోడింగ్ పనులకు కూలీలు ఎప్పటిలాగే సంచికి 5.15 తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నా, కొందరు అధికారులు మాత్రం రూ. 16 నుంచి రూ.18 వరకు వసూలు చేయాలని ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. అంతేకాక, సంచికి రూ.2 నుంచి రూ.3 తమకు ఇవ్వాలని షరతు పెట్టి, అప్పుడే కాంటా చేయిస్తామని చెబుతున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులతో కూలీలు కొనుగోలు కేంద్రాలకు రావడానికే వెనుకాడుతున్నారు. "మేము ఎక్కువ తీసుకుంటే మా వాటా ఎందుకు ఇవ్వాలి అంటూ హమాలీలు కూడా నిరాకరిస్తుండడంతో కొనుగోళ్లు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. మరోవైపు రైతులు కూడా ఎప్పటిలాగే రూ.15 మాత్రమే చెల్లిస్తామని చెబుతుండడంతో ధాన్యం కాంటా నిలిచిపోయింది. మాక్లూర్ సొసైటీ పరిధిలో సుమారు 15 రోజుల క్రితం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ, ఇప్పటివరకు ఒక్క గుంజి కేంద్రంలో మాత్రమే కాంటా జరుగుతోంది. అక్కడ రైతులు రూ.17 వరకు చెల్లిస్తుండటంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం తరలింపులు కొనసాగుతున్నాయి. నవీపేట్, నందిపేట్,మోపాల్ ఆర్మూర్, బోధన్ మండలాల్లో మిగతా కేంద్రాల్లో మాక్లూర్ రూ.17, ముల్లంగి రూ.17, డికంపల్లి రూ.16, కల్లడి రూ.16, రామచంద్రపల్లి 5.17 వసూళ్లు జరుగుతున్నాయి. మొత్తంగా మాక్లూర్, పరిధిలోని గ్రామాల్లో దాదాపుగా సంచికి రూ.16 నుంచి రూ.18 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కొన్ని గ్రామాలకు ఒక అధికారి తన సొంత లారీల ద్వారానే ధాన్యాన్ని తరలించాలని ఒత్తిడి తెస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో ఇతర రవాణా మార్గాలు నిలిచిపోవడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది. మొత్తంగా కమిషన్ దందా, అధికారుల తీరుతో మండలంలోని ధాన్యం కొనుగోలు వ్యవస్థ సంక్షోభంలోకి వెళ్లింది. వెంటనే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## ఇనుగుర్తి లో ఘనంగా మే డే వేడుకలు



**విశ్వంభర, ఇనుగుర్తి :** మండల కేంద్రం ఇనుగుర్తి లో సిపిఎం,సిఐటియు ఆధ్వర్యంలో పలు రంగాల కార్మికులు డప్పు చప్పుళ్ల మధ్య భారీ ర్యాలీ నిర్వహించి శుక్రవారం ఘనంగా మేడే వేడుకలు జరుపుకున్నారు.సిపిఎం పార్టీ జెండా కా.బండి సత్యం,సిఐటియు జెండా దుంపల రాజయ్య, హమాలి యూనియన్ మాలి జంపయ్య ఎగురవేశారు.కా.స్వర్గీయ ఆవుల వెంకన్న స్మారక స్తూపం వద్ద నివాళులర్పించారు.సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు పాల్గొని మాట్లాడుతూ 140వ,మేడే దినోత్సవ, వేడుకల్లో పాల్గొన్న వారికి విప్లవాభివందనాలు తెలిపారు.1886సం.లో 8 గం.ల పని దినాల కోసం చికాగో నగరంలో కార్మికుల సమ్మె సందర్భంగా కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంలో నుంచి ఎర్ర జెండా ఆవిర్భవించిందన్నారు.కార్యక్రమంలో సిపిఎం నాయకులతో పాటు వివిధ కార్మిక సంఘాల నాయకులు గంజి సంజీవరెడ్డి, ఆవుల ఉప్పలయ్య,చిట్టబోయిన యాకయ్య, యాకమ్మ,హరీష్,ఉప్పలయ్య సుంకరి జన్నయ్య,యాకయ్య, రాజు,రాద, బి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర జెండానే కార్మికులకు దారి : కూనంనేని




**విశ్వంభర, హిమాయత్‌నగర్ :** ప్రపంచం కారు మబ్బుల్లో ఉన్నా కార్మికులకు మార్గం చూపేది ఎర్ర జెండానేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మేడే సందర్భంగా శుక్రవారం ఏఐటియుసి ఆధ్వర్యంలో హైదరాబాదు హిమాయత్‌నగర్‌లోని రాష్ట్ర కార్యాలయం నుంచి మగ్దూంభవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం సభ చేపట్టారు. కార్మిక వర్గమే కమ్యూనిజానికి మూలస్థంభమని, ఎనిమిది గంటల పని హక్కు వంటి సాధనలు పోరాటాల ఫలితమని పేర్కొన్నారు. దేశంలో అసమానతలు పెరుగుతున్నాయని, కార్పొరేట్ ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులు దెబ్బతింటున్నాయని విమర్శించారు. కాంట్రాక్టు విధానాలు, తక్కువ వేతనాలతో శ్రమ దోపిడి పెరుగుతోందని తెలిపారు. లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సూచించారు. సభలో ఇ.టి.నరసింహా, ఎస్ బాల్‌రాజ్, పల్లె నర్సింహా, పశ్య పద్మ, ప్రేం పావని, బి వెంకటేశం, స్టాలిన్, పి వెంకటయ్య, బొడ్డుపెల్లి కిషన్, లక్ష్మి, షేక్ హసీనా, బిక్షపతి యాదవ్, కొమురెల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ చిలుకు స్వామికి శ్రమశక్తి అవార్డు

### రవీంద్ర భారతిలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా అవార్డును ప్రధానం

**విశ్వంభర, హైదరాబాద్ :** మే డే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం శ్రమశక్తి అవార్డులలో భాగంగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షునిగా సేవలు అందజేస్తున్న చిలుకు స్వామి కి రాష్ట్ర ప్రభుత్వం అవార్డు ప్రధానం చేసింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఈ అవార్డును ప్రధానం చేశారు. ఆలేరు మండలం షారాజిపేట గ్రామ నివాసి అయిన స్వామి ఒకవైపు రైల్వే ఉద్యోగిగా పనిచేస్తూనే గ్రామంలో ఎయిడ్స్ పట్ల అవగాహన రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ గ్రామ యువకులను చైతన్య పరుస్తున్నారు. వీరిసేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వ కార్మిక శాఖ మేడే సందర్భంగా శ్రమశక్తి అవార్డుకును అందజేశారు. చిలుక స్వామికి ఈ గౌరవము లభించడం పట్ల పలువురు రైల్వే ఉద్యోగులు, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ కోఆపరేటివ్ సొసైటీ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## బేగంపేటలో మేడే ర్యాలీ




**విశ్వంభర, బేగంపేట :** అమన్ వేదిక, శ్రీ ఎడ్యుకేషనల్ సొసైటీ, సి4సిఎస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మేడే ర్యాలీ బేగంపేటలోని అమన్ నివాస్ షెల్టర్ హోమ్ నుంచి నేచర్ క్యూర్ హాస్పిటల్ వరకు నిర్వహించి తిరిగి షెల్టర్ హోమ్ వద్ద ముగించారు. ఈ సందర్భంగా సి 4 సి ఎస్ కన్వీనర్ అంబికా మాట్లాడుతూ, కార్మికులు దేశ అభివృద్ధికి మూలస్తంభమని, పనిగంటలు తగ్గించి వేతనాలు పెంచాలని కోరారు. షెల్టర్ హోమ్‌లలో ఉన్న నిరాశ్రయులకు ఓటు హక్కు, సమాన హక్కులు కల్పించి పౌరులుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫెరోజ్, ఇందిర, రాము, రేణుక, నివాసితులు పాల్గొన్నారు.

## అమరుల స్ఫూర్తితో పోరాడాలి



**విశ్వంభర, రామన్నపేట :** చికాగో అమరుల స్ఫూర్తితో కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంఘటిత పోరాటాలు నిర్మించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం నాయకుడు జల్లెల పెంటయ్య పిలుపునిచ్చారు. మే డే సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల వ్యాప్తంగా జెండా ఆవిష్కరణలు, ర్యాలీలు నిర్వహించి ఉత్సాహంగా వేడుకలు జరిపారు. కార్మికుల శ్రమ లేకుండా ప్రగతి సాధ్యం కాదని, వారి హక్కులను కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలని నాయకులు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నాయని విమర్శిస్తూ, పోరాటాల ద్వారానే దోపిడీకి ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం, సిఐటియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఐటీయు ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ గొరిగే సొమ్ములు మాట్లాడుతూ, మే డే స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా కార్మికులు ఉద్యమించాలని, శ్రమకు తగ్గ వేతనాలు అందించాలని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా, అంగన్వాడి, హమాలి, ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ తదితర యూనియన్ నాయకులు గ్రామ గ్రామాన సిఐటియు జెండాలను ఆవిష్కరించి మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటేశం, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరేకంటి రాము, నాయకులు అప్పం సురేందర్, గాదెకృష్ణ, వంగాల మారయ్య, పల్లె సత్యం, జంపాల రమేష్, రాసాల రమేష్, గోల్లూరి నాగరాజు, బుద్ద ప్రసాద్, గొరిగే మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 140 వ మేడే ఉత్సవాలు



**విశ్వంభర, చింతపల్లి :** మండల వ్యాప్తంగా 140వ మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మేడే సందర్భంగా ఘడియగౌరారం, హరిజనాపురం, గోడుకొండ్ల చింతపల్లి సెంటర్, మార్కెట్ సివిల్ సప్లై హమాలీ సంఘం, ఎలక్ట్రిషన్ సంఘం, భవన నిర్మాణ తాపీ కలర్ మేస్త్రిల అడ్డ, వివిధ హమాలీ సంఘాల అడ్డల వద్ద సిపిఐ ఏఐటియుసి జెండాలను ఆవిష్కరించి అనంతరం కమ్యూనిస్టు మండల పార్టీ రైతు భవన్ కార్యాలయంలో పార్టీ జెండా ఆవిష్కరించిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మరియు మాజీ ఎక్స్ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు అనంతరం ఆయన మాట్లాడారు. హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్ బి కార్మికుల సమస్యలు గురించి మండల కార్యదర్శి పోలే వెంకటయ్య మాట్లాడారు. మండల సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్రావు మండల కార్యవర్గ సభ్యులు కోడిదల వెంకటయ్య, పల్లపు లక్ష్మయ్య, వేముల బుచ్చయ్య, ఎస్.కె షంషుద్దీన్,వివిధ గ్రామాల శాఖ కార్యదర్శిలు బాద మల్లేష్, గుండ్లపల్లి ఇద్దిరాములు, గ్యర పరిశరాములు, మల్లం నరసింహ, జోగు శ్రీరాములు మంజుల (ఉపసర్పంచ్ ), కలకొండ వెంకటయ్య గ్రామ శాఖ సభ్యులు,సోమయ్య, ముస్కు వెంకటయ్య, సత్తయ్య,ఎన్ సోమయ్య, కె మారయ్య, జె నరసింహ, ఎం రాజు, పి కాశయ్య, జి రాములు, జె వెంకటేష్,ఎస్ ఎల్లయ్య, జె సత్తయ్య,ఏ జగన్నాథం, బి శ్రీను, ఎన్ సుందరయ్య, ఎన్ రత్నయ్య, ఎస్ పెద్దయ్య, ఎస్ ప్రభుదాసు, జయశంకర్, జె సురేష్,ఎస్ ఈదయ్య,ఏ జంగయ్య, డి యాదయ్య, ఏ దావలయ్య, వి దావలయ్య, జె క్రాంతి, జె పద్మ, కె లలిత, ఏ కృష్ణమ్మ, డి సైదమ్మ, ఏ శశికళ, సిహెచ్ మైబు, సాలయ్య, సుభాని, రాణి, మల్లమ్మ, శ్రీనివాస్ రెడ్డి, కే సైదులు, జి పెదయ్య, ముత్యాలు, వెంకటయ్య, తదిఇతరులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో ఘనంగా కార్మిక దినోత్సవ వేడుకలు



**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని తహసిల్దార్ ఆఫీస్ ముందు సిపిఐ పట్టణ కమిటీ జెండాను సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ, సివిల్ సప్లై హమాలీ యూనియన్ జెండాను గొరిగ శంకరయ్య, శివరాత్రి సమ్మయ్య, తాపీ మేస్త్రి వర్కర్స్ యూనియన్ జెండాను దుర్యోధన్, తెలంగాణ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రామన్నపేట బ్రాంచ్ నందు జె.రాణి, కొమ్మాయిగూడెం గ్రామంలో లారీ డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ జెండాను బత్తుల సత్తయ్య, గోపగోని అశోక్ గౌడ్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి ఊట్కూరు నరసింహ మాట్లాడుతూ, చికాగో నగరంలో పుట్టిన కార్మిక సంఘం ఏఐటీయూసీ అని, కార్మికుల హక్కుల కోసం అవసరాల కోసం ఎన్నో ఉద్యమాలు చేసి సాధించిన యూనియన్ ఎఐటియుసి అని, సమాజాభివృద్ధికి కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమని, కార్మికుల హక్కులను కాపాడాలని వారికి తగిన గౌరవం ఇవ్వాలని పిలుపునిచ్చారు. దేశంలో వివిధ సంఘాలను నిర్మించి వారి హక్కుల కోసం పోరాడి, కార్మికుల 16 గంటల పని దినాన్ని ఎనిమిది గంటల పనిదినానికి ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాన్ని చేసిన సంఘం ఏఐటీయూసీ అని, అనేక మంది కార్మికుల రక్తంలో తడిసిన జెండా ఎర్రజెండా అని అన్నారు. దేశ అభివృద్ధికి కార్మికుల శ్రమ బలమని ప్రతి నిర్మాణంలో కార్మికుల చెమట దాగి ఉంటుందని కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని కాంక్షిస్తూ బాల కార్మికత్వాన్ని పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గంగాపురం యాదయ్య, ఎర్ర రమేష్ గౌడ్, సిపిఐ పట్టణ కార్యదర్శి రచ్చ యాదగిరి, బాలగోని మల్లయ్య, భగవంతు, జగన్నాథ పంతులు, వీరమల్ల ముత్తయ్య, సంగిశెట్టి పాండు, రచ్చ దయాకర్, నంగునూరు యాదయ్య, దండుగుల రాములు, కళ్లెం యాదయ్య, సుదర్శన్, ఊట్కూరి కృష్ణ, కొమ్ము రామ లింగయ్య, సతీష్, శ్రీనివాస్, షాజియా, సుశీల, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడలో వాలీబాల్, హ్యాండ్ బాల్ శిక్షణా శిబిరం



**విశ్వంభర, మిర్యాలగూడ :** మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ (గౌట్) జూనియర్ కళాశాల మైదానంలో నూకల చారిటబుల్ ట్రస్ట్ మరియు బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "ఉచిత వాలీబాల్ మరియు హ్యాండ్ బాల్ సమ్మర్ కోచింగ్ క్యాంప్" శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. మిర్యాలగూడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూకల వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ఈ శిక్షణా శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. వేసవి సెలవుల్లో సమయాన్ని వృథా చేయకుండా ఇటువంటి ఉచిత శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకొని శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించుకోవాలని కోరారు. క్రీడలు క్రమశిక్షణకు మరియు నాయకత్వ లక్షణాలకుదోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. వేదిక ( గౌట్ ) జూనియర్ కళాశాల మైదానం మిర్యాలగూడ శిక్షణ సమయం: ప్రతిరోజు ఉదయం 6:00 గంటల నుండి 8:00 గంటల వరకు, మే 01, 2026 నుండి మే 31,2026 వరకు కోచ్ లు నాగరాజు గడగోజు అశోక్ చారి మనోహర్ లక్ష్మణ్ వారి నిర్వహణలో ఉంటుందని తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు వెంకటేశ్వర్లు, వాకర్స్ అధ్యక్షుడు లక్ష్మణ్, పిడి వెంకటేశ్వర్లు ,వెంకటరత్నం, సైదులు ,స్థానిక కాంగ్రెస్ నాయకులు, క్రీడాకారులు, శిక్షకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. నూకల వేణుగోపాల్ రెడ్డి క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. చివరగా, యువతకు ఇటువంటి వేదికను కల్పించిన నిర్వాహకులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## నెల్లికుదురు మండలంలో ఘనంగా మేడే




**విశ్వంభర, నెల్లికుదురు:** మండల కేంద్రం నెల్లికుదురు తో పాటు వివిధ గ్రామాలలో మేడే కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ కార్మికులు భారీ ర్యాలీ ప్రదర్శన చేశారు.జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సిపిఎం మండల అధ్యక్షులు ఇసంపల్లి సైదులు మాట్లాడుతూ.. ఎనిమిది గంటల పని కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించి సాధించుకున్నారన్నారు. కొన్ని కార్పొరేట్ శక్తులు 10 నుంచి 12 గంటలకు పైన కార్మికులను బానిసలుగా పని చేయించాలని ప్రయత్నిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులే దేశ పరిశ్రమ ఆర్థిక రంగానికి వెన్నెముకలన్నారు.కార్మికులు ఏకమైతే ఏ శక్తి ఏమి చేయలేదన్నారు.ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల బాబుగౌడ్, తొట్ల వెంకటలక్ష్మి, ఎల్లయ్య,వీరలక్ష్మి విజయ,సత్యనారాయణ, బోడ మంగ్య,భూక్య బిక్షపతి,బండ వెంకన్న,జనార్దన్,వెంకన్న,ఉప్పలయ్య,పరుశురాం,బుచ్చి రాములు,నారాయణ,కుమారు తదితరులు పాల్గొన్నారు. మునిగలవీడు లోకా.సుందరయ్య జయంతి మండలంలోని మునిగలవీడు గ్రామంలో కా. పుచ్చలపల్లి సుందరయ్య జయంతి వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైదులు మాట్లాడుతూ వెట్టి చాకిరి విముక్తి కోసం వివక్షతను ఎదిరిస్తూ పేదరిక నిర్మూలన చేయాలని, దున్నేవారికి భూమి కావాలని నిరంతరం పేద ప్రజల సమస్యలపై పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు సుందరయ్య అని కొనియాడారు.

## విభజన రాజకీయాలను తిప్పికొట్టాలి : రాఘవులు



**విశ్వంభర, ముషీరాబాదు :** మేడే సందర్భంగా హైదరాబాదు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ నిర్వహించారు. ఈ సందర్భంగా పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ శ్రమకు కుల, మత భేదాలు లేవని, విభజన రాజకీయాలను కార్మిక లోకం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాద విధానాల వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చర్యల ప్రభావం ప్రజలపై పడుతోందని తెలిపారు. యుద్ధం ఆగి శాంతి నెలకొనాలని, అదే సమయంలో కార్మిక హక్కుల సాధనకు పోరాటాలు కొనసాగాలని సూచించారు. లేబర్ కోడ్స్ కార్మిక పోరాటాలను ఆపలేవని, అన్యాయానికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా నిలబడతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో టి జ్యోతి, టి సాగర్, జి నాగయ్య, బి వెంకట్, సారంపల్లి మల్లారెడ్డి, జి రాములు, డీజీ నర్సింహారావు, వెంకట్రాములు, బాబూరావు, అరుణజ్యోతి, శ్రీరామ్ నాయక్, ఎమ్‌వీ రమణ, అరిబండి ప్రసాదరావు,ఎ వెంకటేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ సేవకుల సేవలు వెల కట్టలేనివి



**విశ్వంభర, రామన్నపేట:** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, బోగారం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సిబ్బందిని ఘనంగా సన్మానించారు. గ్రామ సర్పంచ్ కునూర్ సాయికుమార్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు, పారిశుధ్య సిబ్బంది, కార్యాలయ సిబ్బందికి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామ అభివృద్ధిలో, పరిశుభ్రతలో పంచాయతీ సిబ్బంది పాత్ర అత్యంత కీలకమైంది. ఎండనక, వాననక గ్రామ ప్రజల సౌకర్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికుల సేవలను గుర్తించడం మన అందరి బాధ్యత. వారి సంక్షేమానికి మా పంచాయతీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది" అని పేర్కొన్నారు. అనంతరం సిబ్బందికి మిఠాయిలు పంపిణీ చేసి, వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బైకానీ ఉమామహేష్ యాదవ్, వార్డు సభ్యులు, గోగు ప్రమీల రమేష్ యాదవ్, నేరటి మానస సురేష్ యాదవ్, వనం అండాలు యాదగిరి, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, కరెంటు లైన్ మెన్ కునూరు మహేష్ గౌడ్, గ్రామపంచాయతీ కారోబార్ గోగు మహేష్ యాదవ్, వాటర్ మెన్ తెలుసూరి సైదమ్మ, సిబ్బంది మేడి నర్సింహ, ఏర్పుల శంకరయ్య, గ్రామ ప్రముఖులు అంతటి మల్లేష్, బైకాని శ్రీరాములు, రాపోలు లక్ష్మీ నారాయణ, మేడి కృష్ణ, రాపోలు రాజు, మేడి సుమన్, బొడ్డుపల్లి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటీ ప్రాంగణంలో మే డే వేడుకలు

**విశ్వంభర, రామన్నపేట :** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రాంగణం కేంద్రంలో రామన్నపేట మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి కం రామన్నపేట మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.సబిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కార్మికుల హక్కులు, ఉచిత న్యాయ సహాయం ప్రాముఖ్యత, ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూలీలు, రోజువారీ వేతన కార్మికుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకొని, వాటిపై సంబంధిత వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు తగిన సూచనలు చేయడమైనది. కార్మికులు తెలియజేసిన సమస్యలను పరిశీలించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్యానెల్ అడ్వకేట్ లు కునూరు శ్రీనివాస్, యదాసు యాదయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ సూపర్వైజర్ ఎం.రమేష్, మార్కెట్ డైరెక్టర్ జి.నాగేందర్, పెద్ద సంఖ్యలో కూలీలు, రోజువారీ వేతన కార్మికులు పాల్గొన్నారు.



# గంజాయి విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు

- గంజాయి వినియోగిస్తున్న వారికి మూత్ర పరీక్షలు
- గంజాయి రవాణా వినియోగం కేసుల్లో ఉంటే 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష .. హిస్టరీ షీట్స్ నమోదు..
- పిడి యాక్ట్ నమోదు చేసి రెండు సంవత్సరాలు జైలుకు పంపుతాం
- సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ



విశ్వంభర, సూర్యాపేట: గంజాయి రవాణా, సరఫరా కేసుల్లో నిందితులుగా ఉన్నవారికి, వినియోగిస్తున్న వారికి తల్లిదండ్రుల సమీక్షలో ఈరోజు సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ నందు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. ఈ కౌన్సిలింగ్ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ నర్సింహా హాజరై నిందితులను ఉద్దేశించి మాట్లాడి, గంజాయి వినియోగం వల్ల జరుగుతున్న అనర్థాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి వినియోగిస్తున్న వారికి పోలీస్ స్టేషన్ నందు డాక్టర్ల సహాయంతో మూత్ర పరీక్షలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ నర్సింహ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బాలల రక్షణ డ్రగ్స్ నిర్మూలనపై పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే గంజాయి రవాణా వినియోగం కేసుల్లో ఉన్న వారికి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందని డాక్టర్ల సహాయంతో మూత్ర పరీక్షలు చేయడం జరిగిందని తెలిపారు. డ్రగ్స్ గంజాయి వినియోగించడం వల్ల మత్తులో ఆలోచన విధానం కోల్పోయి నేరాలకు, అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని, అనారోగ్యం బారిన పడుతూ భవిష్యత్తును కోల్పోతున్నారని అన్నారు. కావున ఈ గంజాయిని మన సమాజం నుండి లేకుండా చేయాలి మన పిల్లలను మన సమాజాన్ని ఈ గాంజాయి మత్తు నుండి కాపాడుకోవాలని తెలిపారు. గంజాయి వినియోగించిన సరఫరా చేసిన అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి సంబంధ కేసుల్లో ఉన్న వ్యక్తులపై పోలీస్ శాఖ పటిష్టంగా నిఘా ఉంచిందని, కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని అన్నారు. ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం వీరుపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. డ్రగ్స్ గంజాయి వినియోగం, రవాణా కేసుల్లో చిక్కుకుంటే గరిష్టంగా 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష జరిమానా పడుతుందని తెలిపారు, ఇలాంటి వారిపై పోలీస్ స్టేషన్ల నందు హిస్టరీ సీట్స్ నమోదు చేస్తామని ఐదు లక్షల వరకు బైండోవర్ చేస్తామని పిడి ఆక్ట్ నమోదు చేసి రెండు సంవత్సరాలు జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు. మార్పు రావాలని గంజాయి సంబంధించిన సమాచారాన్ని పోలీసువారికి అందించాలని ఈ సందర్భంగా ఎస్పీ కోరారు. దీనికి అలవాటుపడి వారిలో మార్పు తేవడానికి పునరావాసం, సత్ప్రవర్తన డి అడిక్షన్ కేంద్రాలకు పంపడం జరుగుతుంది అన్నారు. డ్రగ్స్ గంజా లాంటి వాటిని ఇకముందు వినియోగించాలని, రవాణా చేయమని, నిర్మూలనలో భాగస్వామ్యం అవుతా మని, సత్ప్రవర్తనతో ఉంటానని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం నందు సూర్యాపేట డివిజన్ డిఎస్పి ప్రసన్నకుమార్, సూర్యాపేట పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య, సూర్యాపేట రూరల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్, సి సి ఎస్ ఇన్స్పెక్టర్ శివకుమార్ పట్టణ ఎస్ఐలు ఏడుకొండలు, శివతేజ, మహేందర్ నాథ్, సాయిరాం, వెంకన్న, సూర్యాపేట రూరల్ సర్కిల్ ఎస్సైలు శ్రీకాంత్ గోపికృష్ణ పోలీసు సిబ్బంది ఉన్నారు.

# జర్నలిస్టుల ఊపిరి తీస్తారా? నిజం రాస్తే హత్యలా?

**హైదరాబాద్ ఆర్ట్స్ కాలేజీ వద్ద జర్నలిస్టుల క్యాండిల్ ర్యాలీ**
**హంతకులను ఎన్‌కౌంటర్ చేయాలి: పాశం యాదగిరి**
**బాధిత కుటుంబానికి రూ. కోటి సాయం ప్రకటించాలి: కోటేశ్వరరావు**



విశ్వంభర, మేడ్చల్ : తెలుగు రాష్ట్రాల్లో జర్నలిస్టుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జర్నలిస్టు జగన్మోహన్ రెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ సాక్షిగా జర్నలిస్టులు ఆగ్రహజ్వాలలు వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, కె. కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా "జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి", "నిజం రాస్తే నరహత్యలా?" అంటూ చేసిన నినాదాలతో క్యాంపస్ దద్దరిల్లింది. ర్యాలీని ఉద్దేశించి సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాపై దాడులు పెరగడం ఆందోళన కరమన్నారు. నిజాలను వెలికితీస్తున్న జర్నలిస్టులను టార్గెట్ చేస్తున్నారని, ఇలాంటి హంతకులను ఎన్కౌంటర్ చేయాల్సిందేనని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు జర్నలిస్టులకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. మరో ముఖ్య అతిథి కె. కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అవినీతిని ప్రశ్నించే గొంతును నొక్కేయడం అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. హత్యకు గురైన జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి ప్రభుత్వం వెంటనే రూ. కోటి ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ నాయకులు, అధికారులు మాఫియాలకు అండగా నిలవడం వల్లే ఇలాంటి ఘాతుకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ నిరసనలో పాల్గొన్న యువ జర్నలిస్టులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. "నిజం రాయాలా? లేక ప్రాణాలు కాపాడుకోవాలా?" అనే సందిగ్ధంలో ఉన్నామని వాపోయారు. తక్షణమే 'జర్నలిస్ట్ ప్రొటెక్షన్ యాక్ట్' అమలులోకి తీసుకురావాలని, జర్నలిస్టులపై దాడులు చేసేవారికి కఠిన శిక్షలు పడేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నేతలు పాల్గొని జగన్మోహన్ రెడ్డికి ఘన నివాళులు అర్పించారు.

# రహదారుల అభివృద్ధి



విశ్వంబర, పరిగి : పరిగి నుంచి వికారాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారి పనులను పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి పరిశీలించారు. రహదారి ఇరువైపుల మట్టి, కంకర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలాగే రహదారి మధ్యలో నిర్మిస్తున్న బ్రిడ్జ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని, నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... రహదారిపై గతంలో అనేక ప్రమాదాలు జరిగి పలువురు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పరిగి నుండి వికారాబాద్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు, అలాగే పరిగి నుండి షాద్నగర్ వరకు నాలుగు లైన్ల రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. లాల్ పహాడ్ నుండి చిట్టెంపల్లి వరకు డబుల్ రోడ్డు, గడిసింగాపూర్ నుండి రంగారెడ్డి పల్లి వరకు డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు.

# కుక్కల రక్తంతో వ్యాపారం పూర్తిగా అవాస్తవం

**పెట్స్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండర్ డాక్టర్ కె.వెంకట్ యాదవ్**



విశ్వంభర, బషీర్ బాగ్: ఇటీవల 'శునకాల రక్తంతో వ్యాపారం' అని మీడియాలో వస్తున్న వార్తలు పూర్తిగా నిరాధారమైనవని పెట్స్ కేర్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఫౌండర్ డాక్టర్ కె.వెంకట్ యాదవ్ స్పష్టం చేశారు. తమ హాస్పిటల్ అభివృద్ధి ఓర్వలేకనే కొందరు కావాలనే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను మధ్యతరగతి బిసి యాదవ కుటుంబంలో జన్మించి, చాలా కష్టపడి చదువుకొని ఈ స్థాయికి వచ్చానని అన్నారు. హాస్పిటల్ స్థాపించి సుమారు 15 సంవత్సరాలు కావస్తుందని, ఇప్పటివరకు లక్షల కుక్కలకు ట్రీట్ సర్జరీలు చేశానని చెప్పారు. పెట్ కేర్ హాస్పిటల్ ఒక ప్రీమియం వెటర్నరీ హాస్పిటల్ అని, దేశవ్యాప్తంగా నిపుణులైన వైద్యులు, టెక్నీషియన్లతో కూడిన బృందంతో పెట్స్ వైద్యం అందిస్తున్నామని తెలిపారు. తమ వద్ద గతంలో పనిచేసిన కొందరు వ్యక్తులు పక్కా పథకం ప్రకారం తమ హాస్పిటల్ అప్రతిష్టపాలు చేయాలనే లక్ష్యంతో తాము వీధి కుక్కల నుండి రక్తం సేకరించి విక్రయిస్తున్నామని జంతు హక్కుల ఉద్యమకర్త, మేనకా గాంధీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో ఆమె రాష్ట్ర ప్రభుత్వానికి విచారణ జరపాలంటూ లేఖ రాయడంతో ఇక్కడి పోలీసులు, జి.హెచ్.ఎం.సి యానిమల్ హస్బెండరీ డిపార్ట్మెంట్, పలువురు తమ హాస్పిటల్ తనిఖీ చేసి, రక్తం విక్రయిస్తున్నట్లు ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని స్పష్టం చేశారన్నారు. కానీ, మీడియాలో తప్పుడు ప్రచారం మాత్రం ఆపడం లేదని వాపోయారు. హాస్పిటల్ పై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై ఇప్పటికే పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని, డిఫమేషన్ సూట్ కూడా ఫైల్ చేస్తున్నామని తెలిపారు. అయిన కుక్కల రక్తం వేరే వాటికి ఎక్కించడానికి వీలుపడదని, వ్యాధుల బారిన పడిన కుక్కలకు అవసరమైతే బ్లడ్ క్యాంప్ నిర్వహించి, ఆరోగ్యంగా ఉన్న కుక్కల యజమానుల అంగీకారంతో వాటి రక్తం సేకరించి బ్లడ్ ఎక్కిస్తామని తెలిపారు. తన కుమారుడు క్రితిన్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ కూడా ప్రారంభించి కుక్కలకు పలు వైద్య సదుపాయాలు ఉచితంగా కల్పిస్తున్నామన్నారు. తనపై వస్తున్న ఆరోపణలను కోర్టు ద్వారా పరిష్కరించుకొని, క్లీన్ చీట్ పొందిన తర్వాత మళ్లీ మీడియా ముందుకు వచ్చి, తనపై తప్పుడు ప్రచారం చేసిన వాళ్ల పేర్లు బయట పెడుతానని వెంకట్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు.

# 4 లేబర్ కోడ్ల రద్దుకు పోరాటాలు




విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో మేడే సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ, ఏఐటియుసి ఆధ్వర్యంలో 100చోట్ల జెండాలు ఎగురవేసి 1500 మందితో బాణాసంచా పేల్చుతూ భారీ ర్యాలీ పట్టణంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిపిఐ జిల్లా కార్యదర్శి బి విజయసారథి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో మోడీ పతనం తప్పదన్నారు. కార్మికులు దేశ ప్రజలందరూ బిజెపి పై పోరాటానికి సిద్ధంగా అన్నారు . మతాల పేరిట కులాల పేరిట దేశాన్ని విభజించి పాలిస్తున్న మోడీకి తగిన శాస్తి తప్పదన్నారు వెంటనే నాలుగు లేబర్ కోట్లు రద్దు చేయాలన్నారు. దేశంలో మోడీ పతనం తగ్గిందని వచ్చే ఎన్నికల్లో సింగిల్ డిజిట్ కే ప్రధాని మోడీ పతనం తప్పదన్నారు. జిల్లా కేంద్రంలో కార్మికుల కోసం సిపిఐ ఏఐటిసి పోరాటాలు కొనసాగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారథి రెడ్డి, పెరుగు కుమార్, రేసపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న మామిండ్ల సాంబలక్ష్మి, కట్లోజుపాండురంగ చారి, వీరవెల్లి, రవి, నర్రా శ్రావణ్, వెలుగు శ్రావణ్ ఎండి ఫాతిమా, ఆబోతు అశోక్, వంకాయలపాటి చిరంజీవి, కేదాసు రమేష్, కూరాకుల పాల్, జలగం ప్రవీణ్, ఎండి మహమూద్, వంకాయలపాటి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నాయిని శంకుస్థాపన



విశ్వంభర, హనుమకొండ: హనుమకొండ నగర అభివృద్ధిలో భాగంగా వడ్డేపల్లి ప్రాంతంలో బండ్ సుందరీకరణ, అభివృద్ధి పనులకు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి , బల్దియా మేయర్ గుండు సుధారాణి, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సుమారు రూ.34 కోట్ల వ్యయంతో వడ్డేపల్లి ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అలాగే రూ.13.50 కోట్లతో మ్యూజికల్ లైటింగ్, ఫౌంటెన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయిన తరువాత వడ్డేపల్లి బండ్ ప్రాంతం నగరంలో ప్రముఖ ఆకర్షణగా మారుతుందని భావిస్తున్నారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, నగర ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. వడ్డేపల్లి బండ్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గతంలో ఈ ప్రాంత అభివృద్ధికి ప్రయత్నాలు జరిగినప్పటికీ అవి కార్యరూపం దాల్చకపోవడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. ఇప్పుడున్న ప్రభుత్వం కేటాయించిన నిధులతో వడ్డేపల్లి బండ్‌ను ప్రత్యేక ఆకర్షణగా మార్చనున్నామని స్పష్టం చేశారు. గతంలో స్మార్ట్ సిటీ నిధులను సమర్థంగా వినియోగించకపోవడం వల్ల కొన్ని ప్రాజెక్టులు నిలిచిపోయాయని ఆయన విమర్శించారు. అయితే గడిచిన రెండేళ్లుగా అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# సంపదకు మూలం శ్రమ.. శ్రమను గౌరవిద్దాం..

**మంత్రి కొండా సురేఖ**



విశ్వంభర, వరంగల్ : సంపదకు మూలం శ్రమయని.. శ్రమను అందరు గౌరవించాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ కూరగాయల మార్కెట్ అమాలి యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి జెండాను ఆవిష్కరించి కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం యూనియన్ గౌరవ అధ్యక్షులు బోగి సురేష్ అధ్యక్షతన జరిగిన సభలో కార్మికులను ఉద్దేశించి కొండా సురేఖ మాట్లాడుతూ సమాజంలో సంపదకు మూలమే శ్రమని శ్రమ లేనిది సంపద లేదని కావున సమాజాభివృద్ధిలో కార్మికుల శ్రమ ఎంతో కీలకమైందని కార్మికుల శ్రమను గుర్తించాలని, గౌరవించాలని కొనియాడారు. ఈ సందర్భంగా కూరగాయల మార్కెట్ హామాలి కార్మికులకు విశ్రాంతిభవనము మరియు రెగ్యులర్గా డాక్టర్ చెక్ అప్ గ్రేన్ మార్కెట్ నుంచి రోజు డాక్టర్లు వచ్చే విధంగా అలాగే ఇప్పటివరకు ప్రతినెలా ఇచ్చే 25 వేల తో పాటు అదనంగా ఇంకో 25 వేలు కలిపి మొత్తం 50 వేల రూపాయలు ప్రతినెల మందులకు మంజూరు చేస్తామని అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్కు మార్కెట్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు అలాగే కార్మికులకు ఎలాంటి బీమా పథకాలు లేకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు మరియు చనిపోయినప్పుడు వారి కుటుంబాలకు సపోర్టు లేకుండా ఇబ్బంది పడుతున్నారని ఈ క్రమంలో పోస్ట్ ఆఫీస్ నుంచి అసంఘటిత కార్మికులకు 549 రూపాయలతో ప్రమాద బీమా సౌకర్యం ఉందని, ప్రమాదవశాత్తు మరణిస్తే పది లక్షల రూపాయలు ఆర్థిక సహాయం అందుతుందని మార్కెట్ పరిధిలో పనిచేస్తున్న 1325 మంది అమాలి కార్మికులకు మొత్తం బీమా రూపాయలు కూడా మార్కెట్ భరిస్తుందని అందరి కార్మికులకు బీమా సౌకర్యాన్ని మార్కెట్ ఆఫీసు నుంచి చెల్లించి అందరికీ ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. అలాగే కార్మికులకు విశ్రాంతి తీసుకునేందుకు మరియు భోజనాలు చేయడానికి 60 లక్షల రూపాయలతో మున్సిపాలిటీ నుంచి కమ్యూనిటీ హాల్ ను సాంక్షన్ చేయించామని టెండర్ ప్రాసెస్ లో ఉందని త్వరలో ఆ కమ్యూనిటీ హాల్లో కూడా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు కార్మికులందరూ యూనిటీగా ఉంటూ మేడే స్ఫూర్తితో ఐక్యంగా తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కార్మికులకు ఎల్లవేళలా ప్రభుత్వం అలాగే మేము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సత్య శారద గారు అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సుమ, మార్కెట్ సెక్రటరీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గోపాల నవీన్ రాజ్, కార్పొరేటర్లు చింతాకుల అనిల్ సోమిశెట్టి ప్రవీణ్ పల్లం పద్మ రవి, ముసక మల్ల అరుణ సుధాకర్, భోగి సువర్ణ సురేష్, వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు జారతి శ్రీనివాస్, మున్నాభాయ్ జారతి రమేష్, నాయకులు మీసాల ప్రకాష్ కొత్తపల్లి శ్రీనివాస్, అత్తరుశాల వేణుగోపాల్ సంపత్ క్రాంతి సుధాకర్ రమేష్, వివేక్ సంఘర్పోయిన చందర్, వీరన్న, గౌరవ అధ్యక్షులు మర్రి శ్రీనివాస్ అధ్యక్షులు సాంబయ్య ప్రధాన కార్యదర్శి చీకటి కుమారస్వామి, కోశాధికారి కొత్తపెల్లి రవీందర్ కార్యదర్శులు సారయ్య, చంద్రయ్య రాపోలు ఎంకన్న కుమార్, రాజయ్య, రవి మహేష్, రాజు లతో పాటు కార్మికులు పెద్ద ఎత్తున, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వల్లే నగరాలు శుభ్రం



విశ్వంభర, అంబర్ పేట : పారిశుద్ధ్య కార్మికుల శ్రమ వల్లే నగరాలు శుభ్రంగా నిలుస్తున్నాయని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రావు పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ నందరాజ్ గౌడ్ 67వ జయంతి సందర్భంగా అంబర్‌పేటలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులర్పించారు. బాగ్ అంబర్‌పేటలోని స్తూపం వద్ద నందరాజ్ గౌడ్ కుమారుడు రోహిత్ రాజ్ గౌడ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులకు గొడుగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపుమేరకు సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గోవర్ధన్ రెడ్డి, ధనంజయ, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ పాండురంగయ్య, లలిత, ఎడెల్లి అజయ్ కుమార్, అచ్చిని రమేష్, నాగరాజ్ చారి , ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బేటీ బచావో బేటీ పడావో



విశ్వంభర, గుండాల : బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా "బేటీ జన్మోత్సవం" కార్యక్రమాన్ని నిర్వహిస్తూ, పుట్టిన ఆడ శిశువులకు ప్రోత్సాహకంగా బేబీ కిట్‌లను అందజేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళ సాధికారత కేంద్రం ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గుండాల మండలంలో ని వివిధ గ్రామాలలో అంబాల, పాచిల్ల, బ్రాహ్మణపల్లె, సీతారాంపురం, మరి పడేగ, కొమ్మాయి పల్లి, బండ కొత్తపల్లి, అంగన్‌వాడి కేంద్రంలో పుట్టిన ఆడ శిశువుకు 9 పిల్లల కు మోత్కుర్ ఇన్‌చార్జ్ సిడిపిఓ ఎస్.కె యక్‌పాషా బేగం హాజరై బేబీ కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆడపిల్లల పట్ల సమాజంలో సానుకూల దృక్పథం పెంపొందించడమే లక్ష్యమని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళ సాధికారత కేంద్రం నుండి కె.హర్ష , పి.నిఖిత, అలాగే సూపర్ వైజర్ ఎం డి షమీంబి, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# కార్మిక చట్టాలను కాపాడుకుందాం : దత్తు నాయక్



విశ్వంభర, మహేశ్వరం : అంతర్జాతీయ కార్మిక దినం మేడే ఉత్సవాలు మహేశ్వరం, తుక్కుగూడ, మంకల్ పరిశ్రమ ప్రాంతం, ఫ్యాబ్సిటీ ప్రాంతాలలో ఏఐటియుసి అనుబంధ యూనియన్ల ఆధ్వర్యంలో ఘనంగా మేడే నిర్వహించారు. ప్రపంచ కార్మికులారా ఏకంకండి పోరాడితే పోయేది ఏమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అని నినదిస్తూ సాగిన పోరాటాన్ని గుర్తుచేసుకొని సమ సమాజ నిర్మాణం కోసం కార్మిక వర్గం పోరాడాలి అని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దత్తు నాయక్ పిలుపునిచ్చారు, ఏఐటియుసి జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మ గళ్ళ రాజు, పి దేవేంద్ర గౌడ్ లు అధ్యక్షతన జరిగిన మేడే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి దత్తు నాయక్ హాజరై జెండా ఆవిష్కరించి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాడు అమెరికా దేశం చికాగో నగరంలో కార్మికులు చిందించిన రక్తంతో ఎరిపెక్కిన ఎర్రజెండాలు చేత పట్టుకొని ప్రపంచవ్యాపితంగా కార్మికులు ఏకమై పోరాడి పని గంటల చట్టాలను కనీస వేతనాలను ఇతర మౌలిక చట్టాలను సాధించారని ఆయన గుర్తు చేశారు. ఆనాటి పోరాడి సాధించుకున్న చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం నాలుగు కోడ్ ల ను తెచ్చి వాటిని నిర్వీర్యం చేశారని ఆయన విమర్శించారు. కార్మిక చట్టాలను సాధించుకోవడానికి నాలుగు లేబర్ కోడ్ ను రద్దు చేసేవరకు ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు, మేడే దినాన్ని పోరాటాల దినంగా మార్చి భవిష్యత్తు ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించడం జరిగింది, అదేవిధంగా వైట్ క్లిప్ యూనియన్, ఆర్ఎంపి యూనియన్, ట్రిప్రేవాలా, జెన్ టెక్నాలజీ, మిస్సెస్ఇండియా , కాంట్రాక్ట్ కార్మికుల సంఘం, ఆటో డ్రైవర్స్, డీసీఎం, ట్రాలీ యూనియన్స్, దేవేందర్ నగర్ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో మొత్తం 18 జండాలను ఏఐటిసి ఆధ్వర్యంలో ఎగిరేయడం జరిగింది, అదేవిధంగా సిపిఐ ఆధ్వర్యంలో మహేశ్వరం మండల్ కేంద్రంలో జెండా ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు పి దేవేంద్ర గౌడ్ కొమ్మ గళ్ళ రాజు, శ్రీశైలం బ్రహ్మచారి, కోటేష్, యాదయ్య, చంద్రశేఖర్, శ్రీరాములు, అనిల్, సాయి, భాస్కర్, రవి, జ్యోతి, సావిత్రి, కల్పన, పాల్గొన్నారు.

ప్రజా విశ్వంభర V3 NEWS

# కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

## టీజీఐఐసి చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



విశ్వంభర, సంగారెడ్డి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీల శాఖల ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఐసీ చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి హాజరై కార్మికులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దేశ అభివృద్ధికి కార్మికుల పాత్ర అమోఘమని అన్నారు. సమాజ నిర్మాణంలో కార్మికులు కీలక శక్తిగా నిలుస్తారని, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్మికుల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి భద్రత, న్యాయం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి కార్మికుడు గౌరవంతో జీవించేందుకు అవసరమైన అవకాశాలు కల్పించేందుకు కృషి కొనసాగుతుందని చెప్పారు. అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ, కార్మికులు తమ పనుల్లో భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పరిశ్రమలు, ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికుల రక్షణ కోసం తీసుకునే జాగ్రత్తలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ప్రమాదాలను నివారించడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, అవగాహనతో పనిచేస్తే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ, జిల్లాలో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రతి కార్మికుడికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం కార్యక్రమంలో కొందరు కార్మికులకు లేబర్ గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రభు గౌడ్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ రవీందర్ రెడ్డి, అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కార్మికులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విహెచ్‌కు శుభాకాంక్షలు



విశ్వంభర, అంబర్‌పేట : బీసీ వర్గాల సంక్షేమానికి అనుభవజ్ఞుడైన నాయకత్వం లభించిందని కాంగ్రెస్ నాయకుడు రోహిన్ రెడ్డి పేర్కొన్నారు. బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ ప్రభుత్వ సలహాదారుగా వి. హనుమంతరావు నియామకంపై శుభాకాంక్షలు తెలిపారు. అంబర్‌పేటలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. బీసీ వర్గాల అభివృద్ధికి చేసిన కృషి, అనుభవం దృష్ట్యా ఈ పదవి దక్కడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వి. హనుమంతరావు మాట్లాడుతూ, ఈ నెల 10న ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాదు పర్యటనకు ముందే ఓబీసీ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఓబీసీల హక్కులను పరిరక్షించే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ లక్ష్మణ్ యాదవ్, శంభుల శ్రీకాంత్ గౌడ్, రామ్మోహన్, గడ్డం శ్రీధర్, ప్రభాకర్, షేక్ జమీర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాల్లో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు



విశ్వంభర, నెల్లికుదురు: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతన్నలు రాత్రి వేళల్లో ఇబ్బంది పడవద్దని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద హైమాస్ట్ సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసినట్లు సర్పంచి డా. చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు. నెల్లికుదురు మండలం బ్రాహ్మణ కొత్తపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆ గ్రామ సర్పంచి డా. యాకాంతం గౌడ్ శుక్రవారం పలువురితో కలిసి హైమాస్ట్ లైటింగ్ స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు రాకముందే దూర దృష్టితో కొనుగోలు కేంద్రం స్థలం వద్ద పెరిగిన కంప చెట్లు, ముళ్ళ పొదలు, బండ రాళ్లు జెసిబి యంత్రంతో తొలగించి చదును చేశామన్నారు. యువతకు ఇదే స్థలంలో క్రీడా మైదానం సైతం ఏర్పాటు చేసి అందిస్తామని ప్రకటించారు. తాను సర్పంచ్ గా ఉన్నంతకాలం రైతులకు ఏ విధమైన ఇబ్బంది కలగకుండా తోడ్పాటు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బొల్లు మురళి, జెల్ల పరుశరాములు, పిడుగు అనంత, రైతులు యాకయ్య, లింగమూర్తి, యాదగిరి, వెంకన్న, సర్వన్, సమ్మిరెడ్డి, నరేందర్, పరశురాములు, అశోక్, రవి, యువకులు అజీమ్, ఉమేష్, ప్రశాంత్, నాగమురళి, తదితరులు పాల్గొన్నారు.

## శివాలయ నిర్మాణానికి రూ. 21 వేల విరాళం



విశ్వంభర, షాబాద్: షాబాద్ మండలం మన్మరి గ్రామంలో నిర్మిస్తున్న నూతన శివాలయ నిర్మాణానికి బొంతపల్లి వర్షిత విద్యాసాగర్ తన వంతు సహాయంగా రూ. 21,000లను విరాళంగా అందించారు. ఈ మొత్తాన్ని ఫోన్‌పే ద్వారా ఆలయ నిర్మాణ కమిటీకి చెల్లించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు , శివాలయ కమిటీ సభ్యులు ఆయన సేవాభావాన్ని అభినందిస్తూ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఇలాంటి దాతృత్వం ఆదర్శప్రాయమని వారు పేర్కొన్నారు. మన్మరి గ్రామంలో శివాలయ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, భక్తులు, దాతలు మరింతగా సహకరించాలని కమిటీ సభ్యులు విజయ్ కుమార్ రెడ్డి కోరారు.

## జిల్లా కేంద్రంలో ఘనంగా మే డే



విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బేతోల్ గ్రామంలో సిపిఎం పార్టీ అనుబంధ సంస్థ సిఐటియు , సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా డప్పు , వాయిద్యాల తో వివిధ కమ్యూనిస్టుల పార్టీల నాయకులు , కార్యకర్తలతో కలిసి జిల్లా పార్టీల కార్యాలయంలో మేడే జెండా ఎగరవేసి జిల్లా కేంద్రంలోని ప్రధాన వీదు ల గుండా మేడే ఉత్సవాలు జరిగాయి . మే డే ను ఉద్దేశించి పలు కమ్యూనిస్టు పార్టీల జిల్లా నాయకత్వం మాట్లాడుతూ మే డే అనేది అంతర్జాతీయ కార్మిక దినోత్సవం గా ప్రసిద్ధి చెందిందని, ఇది కార్మిక హక్కులు , పోరాటం లని స్మరించుకునే రోజు అని గుర్తు చేశారు . 1886వ సంవత్సరంలో అమెరికాలో ని చికాగో నగరంలో కార్మికులు ఎనిమిది గంటల పని దినం కోసం చేసిన ఉద్యమమని, హే మార్కెట్ సంఘటన వల్ల మే ఒకటిన్న కార్మిక దినోత్సవం నిలిచిందని వారు అన్నారు . అంతేకాకుండా 19వ శతాబ్దంలో కార్మికులు రోజుకు 12 నుంచి 16 గంటలు పాటు కఠినమైన పనిచేసేవారని గుర్తు చేశారు . ఈ మేడే ఉత్సవాల్లో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు, మండల వెంకన్న, హలవత లింగన్న , సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ , సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ అన్న , సిపిఐ ఎమ్మెల్ న్యూ డెమోక్రసీ పట్టణ కార్యదర్శి ధోశీ తోజు ఉపేంద్ర చారి , షేక్ యూసుఫ్ , ఖాదర్ బాబా , ఇంకా పార్టీ నాయకులు ,కార్యకర్తలు ,భారీ సంఖ్యలో పాల్గొన్నారు .

# ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



విశ్వంభర, సంగారెడ్డి : వట్టిపల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ వద్ద మేడే సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు జిల్లా నాయకులు ఎర్రోళ్ల మహేష్ హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చికాగో నగరంలో 8 గంటల పనిదినం కోసం ప్రాణత్యాగాలు చేసిన కార్మికుల పోరాట ఫలితమే మేడే అని అన్నారు. అదే స్ఫూర్తితో ప్రపంచ కార్మిక వర్గం ఎన్నో హక్కులను సాధించుకుందని తెలిపారు. అయితే ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకొచ్చిందని, వీటి ద్వారా యాజమాన్యాలకు అనుకూలంగా కార్మిక వ్యతిరేక విధానాలు అమలు చేసే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల ప్రజలకు, కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని, రాజ్యాంగాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజా, కార్మిక హక్కుల పరిరక్షణ కోసం మేడే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత బలమైన పోరాటాలు నిర్వహించేందుకు ప్రజలు, కార్మికులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు నరేందర్ గౌడ్, సంజీవులు, జనార్ధన్, దాసు, మహేష్, ప్రవీణ్, సాయిలు, బాలమణి, స్వప్, నీరజ, పూలమణి తదితరులు పాల్గొన్నారు.

## మహబూబాబాద్ డిఈఓగా సత్యనారాయణ



విశ్వంభర, మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నూతన విద్య అధికారిగా సత్యనారాయణ నేడు పదవి బాధ్యతను చేపట్టారు. జిల్లాలో ఉన్న సమస్యలు అన్నిటిని త్వరలో పరిష్కారం చేస్తానని, ఉపాధ్యాయులందరూ సకాలంలో విధులకు హాజరుకావాలని, ప్రభుత్వ వనరులను ఉపయోగించుకొని విద్యాబోధన చేపట్టాలని ఆయన అన్నారు.

## దేవరుప్పుల మండలంలో ఘనంగా మే డే



విశ్వంభర, జనగామ : దేవరుప్పుల మండలంలో మే డే వేడుకలను సీపీఎం జనగామ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్ పాల్గొనగా రామరాజు పల్లి గ్రామంలో కల్లెం బిక్షపతి, నీర్మాల గ్రామంలో పయ్యావుల బిక్షపతి, సింగరాజు పల్లి గ్రామంలో మండల సెక్రెటరీ ఇంటి వెంకట్ రెడ్డి, బంజర గ్రామంలో గడ్డం యాదగిరి, పెద్దమడూరు గ్రామంలో ఐలాపురం నరసమ్మ, చింత బావి తండాలో పురుషోత్తమలు, దేవరుప్పుల మండల కేంద్రంలో సిఐటియు మండల అధ్యక్షుడు సంగీ కరుణాకర్, దేవరుప్పుల గ్రామంలో నారాయణ, ధర్మాపురంలో జాటోత్ శీను నాయక్ లు జెండా ఆవిష్కరించి ఘనంగా జరుపుకున్నారు. ఆయా కార్యక్రమాలలో మండల, గ్రామాల నాయకులు వెంకన్న, దేవరుప్పుల కారోబార్ వెంకటరెడ్డి, ఉప్పలయ్య, కామారెడ్డి గూడెం కాసర్ల యాదిరెడ్డి, కొప్పుల ఉప్పలయ్య, దాసగారి సుమ, ఎండి హుస్సేన్, చొప్పరి యాదయ్య, రెండేళ్ల సత్తయ్య, ఎండి రంజాన్, గణేష్, అంగన్వాడి టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామపంచా వర్కర్లు పాల్గొన్నారు.

# సబ్ స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే మురళి నాయక్ భూమి పూజ




విశ్వంభర, మహబూబాబాద్: మండలం సోమలతండ గ్రామపంచాయతీలో 33/ 11 కెవి నూతన సబ్ స్టేషన్ కొరకు ఎమ్మెల్యే మురళి నాయక్ భూమి పూజ ఎమ్మెల్యే చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ సబ్ స్టేషన్ నిర్మాణం కొరకు రెండు కోట్ల రూపాయలు ఖర్చు అవుతుందని , వీలైనంతవరకి సబ్ స్టేషన్ ఆరు నెలల లోపు పూర్తిచేయాలని సంబంధిత అధికారులను కోరారు . అంతేగాకుండా గత పాలకులు రాష్ట్ర ప్రజలకు , మహబూబాబాద్ నియోజకవర్గ ప్రజలకు టిఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసింది శూన్యమని గుర్తు చేశారు . మన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో ఏర్పడిన అప్పటినుంచి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చుకుంటూ వస్తున్నామని ఆయన అన్నారు . గత పాలకులు చేసిన అవినీతి ఎక్కడ మన కాంగ్రెస్ ప్రభుత్వం బయటపే డుతుందని భయపడి ఇష్టం వచ్చినట్లుగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పైన బురద చల్లుతున్నారని , రానున్న అసెంబ్లీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ పూర్తి స్థాయిలో ఖాళీ అవుతుందని , ఆయన అన్నారు . ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా అధికారి , విద్యుత్ శాఖ డి ఈ లు , పర్వతగిరి ,సోమల తండా , లక్ష్మ తండా, గ్రామపంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు , సంబంధిత అధికారులు, గ్రామస్తులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు , మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు .

## అంగరంగ వైభవంగా గంగమ్మ కళ్యాణం



విశ్వంభర, నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం నర్సింగ్ పల్లి గ్రామంలో గంగమ్మ కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఘనంగా నిర్వహిస్తామని భజన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు గంగమ్మకు నిర్వహించామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోళ్ల బాబు కృష్ణ నరేష్ నర్సింగరావు. తంబాకు సాయిలు గ్రామ సర్పంచ్, స్వామి, ఉప సర్పంచ్ రఘు పి సుదర్శన్. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గరిష్ఠ వయోపరిమితి పెంచాలి



విశ్వంభర, హైదరాబాద్ : ప్రభుత్వ ఉద్యోగాల దరఖాస్తు కు గరిష్ఠ వయోపరిమితి 46 కు పెంచాలని జివో నెంబరు 30 ని కొనసాగించాలని శుక్రవారం ఉదయం గాంధీభవన్ లో టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ను కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోటూరి మానవతారాయ్ నేతృత్వంలో తెలంగాణ ఉద్యమకారుల జెఏసి నేత కొర్రా రవీంద్రనాయక్, సేవా నాయక్ వినతి పత్రాన్ని అందించారు.

## శిఖర ప్రతిష్ఠాపన చేసిన హంపీ పీఠాధిపతి



విశ్వంభర, నిజామాబాద్ : పౌర్ణమి సందర్భంగా శుక్రవారం రోజు ఇందూర్ నగరం కి వచ్చేసిన హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి నగరంలోని ఎల్లమ్మ గుట్ట గణేశ్ చౌక్ లో గల శ్రీ శుభం కరోతి కళ్యాణ గణపతి దేవాలయం నూతన శిఖర ప్రతిష్టాపన స్వామి వారి యొక్క చేతుల మీద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,లోక కళ్యాణం కోసం ఆలయంలో ప్రత్యేక పూజలతో పాటు అన్నప్రసాదాలు విస్తృతంగా నిర్వహించాలని ఆ విగ్నేశ్వర భగవంతుని ఇందూరు నగర ప్రజలకు ఆశీస్సులు లభిస్తాయి ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు రఘువీర్ గోపాల్ కార్యదర్శి శ్యాంసుందర్ అగర్వాల్ ఆలయ కమిటీ సభ్యుడు న్యాయవాదులు రాజ్కుమార్ సుబేదార్ జగన్మోహన్ గౌడ్ నీలకంఠ రావు , వసంత్ రావు రణవీర్ భూపాల్ ఆలయ పుజ్జరిల్లు కిశోర్ శివ్ కుమార్ దీపు ఇంత తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి రైతు ద్రోహి

## ఎమ్మెల్సీ రవీందర్ రావు



విశ్వంభర, మహబూబాబాద్ : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం వరి రైతుల పట్ల అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసలైన 'రైతు ద్రోహి' అని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శుక్రవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ముడుపుగల్ ఐకెపి సెంటర్‌ను సందర్శించిన ఆయన, యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ప్రభుత్వం సకాలంలో వడ్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియ పేరుతో రైతులను గందరగోళానికి గురిచేస్తూ కాలయాపన చేస్తున్నారు. తరుగు పేరుతో దోపిడీ: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో క్వింటాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తూ రైతుల పొట్ట కొడుతున్నారు. ఏసీ గదులకే పరిమితమైన పాలన: "రేవంత్ రెడ్డి.. నీవు నిజంగా రైతు బిడ్డవైతే కొనుగోలు కేంద్రాలకు వచ్చి రైతుల గోస చూడాలి. నీవు రావు, నీ మంత్రులు రారు. ఏసీ గదుల్లో కూర్చుని ప్రగల్భాలు పలకడం కాదు, దమ్ముంటే రైతుల దగ్గరకు వచ్చి మాట్లాడు" అని సవాల్ విసిరారు. కేవలం వరి మాత్రమే కాకుండా, మొక్కజొన్న, సన్‌ఫ్లవర్ పంటలను కూడా ప్రభుత్వం కొనుగోలు చేయడం లేదని, దీనివల్ల రైతులు పది రోజులుగా కల్లాల దగ్గరే నిద్ర కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించి, సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించేవాళ్లమని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వడ్లు పండించడం, కొనడం ఏదో కొత్త అన్నట్లుగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, లేనిపక్షంలో రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ తీవ్రస్థాయిలో పోరాడుతుందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## టీఆర్‌సీపీటీయూ మే డే వేడుకలు

విశ్వంభర, హైదరాబాదు : ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా హైదరాబాదు లో టీఆర్‌సీపీటీయూ ఆధ్వర్యంలో పలుచోట్ల జెండా ఆవిష్కరణ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు ఎం నరేష్, ప్రధాన కార్యదర్శి రాజు, రాష్ట్ర మహిళా విభాగం ఇంచార్జ్ లావణ్య ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కార్మిక హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. డ్రైవర్ కార్మికుల కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా డ్రైవర్లు ఐక్యంగా పోరాడాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లను అమలు చేయొద్దని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ఇందిరమ్మ ఇండ్లతో పేదలకు ఆత్మగౌరవం



విశ్వంభర, నెల్లికుదురు: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆత్మగౌరవం ఇనుమడింపజేసేందుకు ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇండ్లు ఎంతో ఉపయోగపడతాయని ఎమ్మెల్యే డా. భూక్య మురళి నాయక్ అన్నారు. నెల్లికుదురు మండలం శ్రీరామగిరి లో శుక్రవారం ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు గృహప్రవేశంలో మాజీ డిసిసి అధ్యక్షులు భరత్ చంద్ర రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇల్లు నిర్మించు కోవడానికి రూ. 5 లక్షలు ఇస్తున్నామన్నారు. పేదలైన దళితులు, గిరిజనులు, వికలాంగులు, భూమిలేని వ్యక్తులకు విడతల వారిగా ఇండ్లు కేటాయిస్తామన్నారు. మొదటి విడతలో ఇండ్లు రాని వారికి రెండో విడతలో చోటు కల్పిస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడు బడుగు బలహీన పేద వర్గాలకు అండదండగా ఉంటుందన్నారు.

# ఆధారాలతో సహా అన్నీ బయటపెడుతాం: హరీష్ రావు



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా హ్యామ్ మోడల్ రోడ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని ఆధారాలతో సహా తాము బయట పెట్టామని మాజీ మంత్రి హరీష్ రావు వెల్లడించారు. ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ లో 25 టెండర్ లను ఎక్సెస్ టెండర్లతో కొందరికి మాత్రమే కట్టబెట్టేందుకు సిద్ధమయ్యారని ఆనాడే చెప్పినట్లు తెలిపారు. తాము చెప్పిందే నిజమైందని, హ్యామ్ మోడల్ రోడ్ల టెండర్లో 25 శాతం ఎక్సెస్ తో టెండర్ వేశారని ఆరోపించారు. శుక్రవారం ఆయన ఈ అంశంపై మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. హ్యామ్ మోడల్ రోడ్లలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని అన్నారు. ఆర్ అండ్ బీ లో రూ. 11 వేల కోట్లకు టెండర్ పిలిస్తే ఎక్సెస్ తో కలిసి దాదాపుగా రూ.15 వేల కోట్ల వరకు, పంచాయతీరాజ్ లో రూ.6 వేల కోట్లతో టెండర్ పిలిస్తే దాదాపుగా రూ.7 నుంచి రూ.8 వేల కోట్ల వరకు అవుతోందన్నారు. ఎక్సెస్ టెండర్ వల్ల రూ. 5 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. హ్యామ్ మోడల్ రోడ్ల కోసం 60 శాతం బ్యాంకు నుంచి అప్పు తెచ్చి 30 ఇన్స్టాల్ మెంట్ లో 15 సంవత్సరాల పాటు వడ్డీతో సహా బ్యాంకుకు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. ఇలాంటి నిర్ణయాల వల్ల ప్రజల పై తీవ్రమైన భారంతో పాటుగా రాబోయే ప్రభుత్వాలపై ఊహించని భారం పడుతుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రత్యక్షంగా చేసే అప్పులతో పాటుగా, పరోక్షంగా అప్పులు చేస్తున్నాడని ఆరోపించారు. ఈ టెండర్ లలో 10 శాతం మొబిలైజేషన్ అడ్వాన్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని తెలిపారు. ప్రాణహిత చేవెళ్ల కోసం మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని తెచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. ఇది జలయజ్ఞం కాదు ధనయజ్ఞం అని ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రేవంత్ రెడ్డి పోరాడాడని గుర్తుచేశారు. అప్పుడు అలా మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు మొబిలైజేషన్ అడ్వాన్సుల విధానాన్ని తెచ్చాడని ఎద్దేవా చేశారు. 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి రాగానే మొబిలైజేషన్ అడ్వాన్సులు విధానాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. తమ హయంలో 5 శాతం కంటే ఎక్కువగా టెండర్ ఉంటే వెంటనే రీ కాల్ చేసేవాళ్ళమని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం 25 శాతం టెండర్ ఎక్సెస్ వేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. ఎక్సెస్ టెండర్ లను వెంటనే రద్దు చేయాలని, టెండర్లన్నీ రీ కాల్ చెయ్యాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ధనాన్ని కొల్లగొడుతోందని.. ఇదే విషయాన్ని అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆధారాలతో సహా మేము వివరించామన్నారు. రేవంత్ రెడ్డి ఇవ్వాళ ఉంటాడు, రేపు పోతాడని... ఎక్సెస్ టెండర్ల వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానా పై భారం పడుతుందన్నారు. ఈ టెండర్లలో ఒక కంపెనీకి 15 టెండర్ లు దక్కబోతున్నాయని... త్వరలోనే ఆధారాలతో సహా అన్ని విషయాలు బయటపెడుతామని హెచ్చరించారు. ఆర్ అండ్ బీ లో రిటైర్ అయిన చీఫ్ ఇంజనీరింగ్ వెంకటేశ్వరరావు, పంచాయితీ రాజ్ చీఫ్ ఇంజనీర్ జోగారెడ్డి పదవి కాలం పొడిగించి ఈ టెండర్ల ప్రక్రియ కొనసాగిస్తున్నారని... ప్రధానమైన ఇంజనీరింగ్ లో ముఖ్యమైన అధికారులను ఎక్స్ టెన్షన్ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అడ్వైజర్లు ఉండరని, ఎక్స్ టెన్షన్ ఉండదన్న సీఎం... అధికారంలోకి రాగానే ప్రధానమైన ఇంజనీరింగ్ శాఖలో అధికారులను ఎక్స్ టెన్షన్ ఇస్తున్నారని విమర్శించారు.

# మహిళలు మోసాలకు గురికావద్దు




విశ్వంభర, కమాన్ పూర్: మహిళలు మోసాలకు గురి కావొద్దు అని భరోసా కోఆర్డినేటర్ కౌన్సిలర్ కే అశ్విత అన్నారు. శుక్రవారం కమాన్ పూర్ మండలం గుండారం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మహిళలకు అవగాహన సదస్సును నిర్వహించారు. రామగుండం సి.పి అంబర్ కిషోర్ ఝా ఆదేశానుసారం కమాన్ పూర్ మండలం గుండారం గ్రామ పంచాయితీ కార్యాలయంలలో ప్రజా పాలనా- ప్రగతి ప్రణాళిక (90 రోజుల ప్రణాళిక) లో బాగంగా భరోసా టీం, అవగాహన కార్యక్రమంను నిర్వహించడం జరిగింది. రకరకాల పద్దతుల్లో మాయమాటలు చెప్పి అమ్మాయిలను, మహిళలను మోసాలు చేస్తున్న నేటి కాలంలో నేరాల అదుపులో ప్రజలు కీలకపాత్ర పోషించాలని, జాగ్రత్తతో మెలగడం వల్ల నేరాలను అదుపు చేయవచ్చని వారు పేర్కొన్నారు. లింగ వివక్షత చూపించకుండా పిల్లల పెంపకం వుండాలని, బాల్య వివాహం ల నిర్మూలన గురించి, సైబర్ నేరాలు, మానవ అక్రమ రావణ మరియు మహిళలపై అత్యాచారాలు, విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల నిర్మూలన గురించి ఎవరైనా మాదక ద్రవ్యాలు తీసుకున్నట్లు తెలిసిన వెంటనే పోలీసు వారికీ సమాచారమివ్వాలని, సైబర్ నేరాలు జరిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కి ఫిర్యాదు చేయాలి వివరించారు. మనకు తెలియని నెంబర్స్ నుండి మహిళలకు ఇబ్బందులు గురైనప్పుడు, ఎవరైనా మహిళల పై అనుచితంగా అసభ్యంగా ప్రవర్తించినట్లయితే, పని ప్రదేశంలో వేధింపులు జరిపినా ధైర్యంగా పోలీస్ వారికి సమాచార అందించాలని సూచించారు. భరోసా సెంటర్ మరియు విధులు గురించి, మహిళలకు మరియు పిల్లలకు భరోసా సెంటర్ కల్పిస్తున్న సదుపాయాలు గురించి, ఫోక్స చట్టం గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జంగిలి పోచాలు, ఉప సర్పంచ్ అంబిరి రాజేందర్, కౌన్సిలర్ కం కోఆర్డినేటర్ కె అశ్విత , తోపాటు వార్డు సభ్యులు బొడ్డు రవి, గాదెలతా, పిడుగు కవిత, వడ్లకొండ వసంత, పిడుగు ఎల్ఐసి సది, ఎండి ఆస్మా, కే స్వాతి వీ భారతి తదితరులు పాల్గొన్నారు.

# పేదలెవరూ వైద్యానికి ఇబ్బంది పడొద్దు: మంత్రి దామోదర



విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో పేదలెవరూ వైద్యం కోసం ఇబ్బంది పడకూడదనే లక్ష్యంతోనే గాంధీలో రూ. 40 కోట్లతో అత్యాధునిక ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌ను నేడు అందుబాటులోకి తెచ్చామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. గాంధీ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన అత్యాధునిక స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ను, మదర్ మిల్క్ బ్యాంక్ ను మంత్రి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం గాంధీ మెడికల్ కాలేజీ 68వ బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థుల స్నాతకోత్సవంలో పాల్గొని పట్టాలు అందజేశారు. ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్‌లో 6 మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, 25 పడకల ఐసీయూలు, ప్రత్యేక ఐసోలేషన్ వార్డులను మంత్రి ప్రారంభించారు. 18 నెలల చిన్నారికి లివర్ ట్రాన్స్‌ప్లాంట్ విజయవంతంగా పూర్తి చేసిన ఉస్మానియా గ్యాస్ట్రోఎంట్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ మధుసూదన్‌ను మంత్రి సన్మానించారు. గాంధీ ఆసుపత్రిలోని ఐవీఎఫ్ సెంటర్ ద్వారా చికిత్స పొంది, కవల పిల్లలకు జన్మనిచ్చిన దంపతులను మంత్రి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నిస్సహాయ స్థితిలో ఉన్న దంపతులకు ప్రభుత్వ ఆసుపత్రి అండగా నిలవడం సంతోషదాయకమని, రాష్ట్రంలోని మరిన్ని ఆసుపత్రులకు ఐవీఎఫ్ సేవలను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. 170 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన గాంధీ హాస్పిటల్ రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా ప్రాధాన్యం కలిగిన ఆసుపత్రిగా ఎదిగిందని... 1851లో చిన్న ఇన్ఫర్మరీగా ప్రారంభమైన ఈ ఆసుపత్రి, ప్రస్తుతం దేశంలోనే అతిపెద్ద టెర్టియరీ కేర్ సెంటర్లలో ఒకటిగా నిలిచిందని మంత్రి తెలిపారు. డెంగ్యూ, స్వైన్ ఫ్లూ, కోవిడ్ వంటి మహమ్మారుల సమయంలో గాంధీ హాస్పిటల్ ముందుండి సేవలందించిందని... కోవిడ్ సమయంలో లక్ష మంది పేషెంట్లకు చికిత్స అందించిన ఘనత గాంధీ సొంతమన్నారు. అరుదైన జబ్బుతో బాధపడుతున్న 18 నెలల చిన్నారికి.. రెండ్రోజుల క్రితమే ఉస్మానియా హాస్పిటల్‌లో సక్సెస్‌ఫుల్‌గా మన డాక్టర్లు లివర్ ట్రాన్స్‌ప్లాంట్ చేశారని... లక్షల రూపాయలు ఖర్చయ్యే ఈ శస్త్రచికిత్సను ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా చేయించామని మంత్రి తెలిపారు. ఇలాంటి అవయవమార్పిడి వైద్య సేవలను విస్తరించేందుకు గాంధీ హాస్పిటల్‌లో రూ.40 కోట్లతో అత్యాధునిక స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ ఏర్పాటు చేసుకుని, ఈరోజు ప్రారంభించుకునడం సంతోషంగా ఉందన్నారు. టిమ్స్ సనత్‌నగర్‌లో మరో ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ అందుబాటులోకి వస్తోందన్నారు. రాష్ట్రంలోని ఏడు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో ఆర్గాన్ రిట్రీవల్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గోషామహల్‌లో 2,000 పడకలతో 2,700 కోట్ల రూపాయల వ్యయంతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టామని... గాంధీ, ఉస్మానియా విద్యార్థుల కోసం 210 కోట్ల రూపాయలతో అత్యాధునిక హాస్టల్ భవనాలు నిర్మిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్, హెల్త్ వర్సిటీ వీసీ రమేశ్ రెడ్డి, డీఎంఈ నరేంద్ర కుమార్, గాంధీ ప్రిన్సిపాల్ డా.ఇందిర, సూపరింటెండెంట్ డా.వాణి, ఉస్మానియా జనరల్ హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో హెచ్ఓడీ డా. మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్లాండ్ ఫార్మా కంపెనీలో మేడే ఉత్సవాలు



విశ్వంభర, దుండిగల్: మే డే ఉత్సవాల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ డిపోచంపల్లి గ్లాండ్ ఫార్మా కంపెనీలో మేడే ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన మాజీ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మేడే సందర్భంగా జెండాను ఎగరవేయడం జరిగింది. కార్మికులకు బోనస్ లు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కోన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కార్మికులు ఎప్పుడు ఐక్యతతో వెలగాలని కష్టసుఖాలకు చేదోడుగా నిలవాలని తెలిపారు. గ్లాండ్ ఫార్మా కంపెనీ అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,నరేందర్ రెడ్డి శ్రీనివాస్ రమాదేవి కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లిలో ఘనంగా మేడే ఉత్సవాలు



విశ్వంభర, కూకట్ పల్లి: మే డే సందర్భంగా కూకట్పల్లి నియోజకవర్గం లో పలు కాలనీలలో ఐఎన్టియుసి సభ్యులతో కలిసి సుడిగాలి పర్యటన చేసిన కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్. తర్వాత జెండాను ఎగరవేయడం జరిగింది. మహిళలకు జిహెచ్ఎంసి కార్మికులకు వృద్ధులకు పండ్లను అందించడం జరిగింది. ప్రపంచ కార్మికుల ఐక్యత ఎల్లప్పుడూ నిలవాలని తరతరాలు వెలగాలని బండి రమేష్ అన్నారు.

శ్రామికులే దేశానికి వెన్నెముక

# కార్మికులారా.. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ రాబోతున్నారు: కేటీఆర్



విశ్వంభర, హైదరాబాద్: కొవిడ్ సమయంలో కార్మికులను కడుపులో పెట్టుకొని చూశామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ఇతర రాష్ట్రాల కార్మికుల కోసం కేసీఆర్ ఉచిత రైళ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మేడే వేడుకల్లో కేటీఆర్ మాట్లాడారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. " తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్ డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను కేంద్రం తగ్గించాలి. సఫాయిల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితుల య్యారు. మంత్రుల జీతాల్లో కోత వేసి ఇస్తామ నడానికి వాళ్లు వరద బాధితులా? రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారు" అని కేటీఆర్ అన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



విశ్వంభర, సూర్యాపేట: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా సూర్యాపేట కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్ లో శుక్రవారం మే డే వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఎస్. మానస తెలిపారు. జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. కార్మికుల కృషిని కొనియాడుతూ, వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్మికులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు, అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులకు, ఇండస్ట్రియల్ యజమానులకు, విద్యార్థులకు కలెక్టర్ షీల్డ్ లు అందజేశారు. కార్యక్రమంలో భాగంగా కార్మికుల హక్కులు, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించబడింది.

# సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉన్నాం



## ఉద్యోగ సంఘాలతో భట్టి భేటీ

విశ్వంభర, హైదరాబాద్: రాష్ట్రంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. ప్రజాభవన్‌లో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగుల విన్నపాలను విని.. వారి సమస్యలపై సానుకూల హామీ ఇచ్చారు.భేటీ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు ప్రధానంగా పీఆర్సీ, కరవు భత్యం, హెల్త్ కార్డ్స్ వంటి దీర్ఘకాలిక సమస్యలను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన.. ఈ అంశాలన్నింటినీ కేబినెట్ సబ్ కమిటీలో సమగ్రంగా చర్చించి త్వరలోనే ఉద్యోగులకు చెబుతామని వెల్లడించారు. ముఖ్యమంత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కారం పట్ల సానుకూల దృక్పథంతో ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.

# మొయినాబాద్‌లో ఘనంగా మే డే వేడుకలు



విశ్వంభర, మొయినాబాద్: అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా మొయినాబాద్‌లో ఘనంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ లేబర్ సెల్ ప్రధాన కార్యదర్శి భానూరి శివశంకర్ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా లేబర్ సెల్ గౌరవ అధ్యక్షురాలు, మహిళా అధ్యక్షురాలు పామేనా జ్యోతి బీమ్ భరత్ హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా చేవెళ్ల లేబర్ సెల్ అధ్యక్షులు సయ్యద్ వసీం, టీపీసీసీ సభ్యులు, తోలుకట్ట మాజీ సర్పంచ్ బొల్లిగిద్ద సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పామేనా జ్యోతి బీమ్ భరత్ మాట్లాడుతూ కార్మికులందరికీ మే డే శుభాకాంక్షలు తెలిపారు. జాతి నిర్మాణంలో కార్మికుల పాత్ర అపారమని, వారి చెమట చుక్కలతోనే దేశ ప్రగతి చక్రాలు నడుస్తాయని అన్నారు. మే డే చరిత్రను వివరిస్తూ, 19వ శతాబ్దంలో కార్మికులు రోజుకు 15--16 గంటలు పని చేస్తూ అనేక కష్టాలు అనుభవించారని తెలిపారు. "8 గంటల పని దినం" కోసం అమెరికాలోని చికాగో నగరంలోని హేమార్కెట్ వద్ద జరిగిన పోరాటంలో అనేక మంది కార్మికులు ప్రాణత్యాగం చేశారని గుర్తుచేశారు. వారి త్యాగాల ఫలితంగానే ప్రతి సంవత్సరం మే 1ను కార్మిక దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రపంచంలో ఏ నిర్మాణం అయినా, ఏ ఉత్పత్తి అయినా కార్మికుల కష్టంతోనే సాధ్యమవుతుందని తెలిపారు. రైతు శ్రమిస్తేనే అన్నం, కార్మికుడు పని చేస్తేనే వస్తువులు, నిర్మాణ కార్మికులు కష్టపడితేనే మనకు నివాసం లభిస్తుందని చెప్పారు. సమాజానికి కార్మికులు వెన్నెముకలాంటివారని, "శ్రమయేవ జయతే" అనే నినాదాన్ని ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. నేటి ఆధునిక కాలంలో కూడా కార్మికుల శ్రమకు విలువ తగ్గలేదని, వారికి కనీస వేతనం, ఆరోగ్య సదుపాయాలు, సామాజిక భద్రత కల్పించడం అత్యవసరమని అన్నారు. కార్మికుల సంక్షేమమే దేశ సంక్షేమమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మోహినాబాద్ లేబర్ సెల్ మండల అధ్యక్షులు కే. హరేందర్ గౌడ్, తోలుకట్ట గ్రామ అధ్యక్షులు వడ్ల రవీందర్ చారి, నాయకులు ఇంద్రసేన గౌడ్, శ్రీకాంత్, నాని తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ నేత రామకృష్ణకి మాతృ వియోగం



విశ్వంభర, కర్నూలు : సిపిఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ మాతృమూర్తి గౌరమ్మ (100) శుక్రవారం కన్నుమూశారు. కర్నూలు జిల్లా ఆలూరు మండలం మొలగవల్లి గ్రామానికి చెందిన గౌరమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మరణవార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన గౌరమ్మ, పెరవల్లయ్య దంపతులు గౌరమ్మ మరణం కుటుంబానికి మాత్రమే కాకుండా సిపిఐ శ్రేణులు, ప్రజా సంఘాల నాయకులకు కూడా విషాదాన్ని మిగిల్చింది. గ్రామస్తులు, రాజకీయ నాయకులు సంతాపం తెలియజేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## అక్కడ నివాసాలు కోల్పోయినవారికి

# డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు: రంగనాథ్



విశ్వంభర, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుందని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. చెరువుల పునరుద్ధరణలో నివాసాలు కోల్పోయిన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళు కట్టించాలని నిర్ణయించిందని వెల్లడించారు. మాదాపూర్ సున్నం చెరువు, ఉప్పల్ రామంతపూర్ చెరువు బాధితులతో సమావేశం సందర్భంగా రంగనాథ్ ఈ విషయాలు తెలిపారు. బాధితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. చెరువుల పరిధిలో గుడిసెలు ఉన్నాయని, వాటిలో ఎంత మంది నివసిస్తున్నారో వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇళ్లు కోల్పోయిన బాధిత కుటుంబాల వివరాలను రంగనాథ్ అడిగి తెలుసుకున్నారు. స్పష్టమైన ఆధారాలతో జాబితా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

# మేడారం ఆర్య వైశ్య ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశ్వంభర, హాలియా : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని సాగర్ రోడ్లో గల ఆర్యవైశ్య మండపంలో ఆర్యవైశ్య మేడారం బ్యాచ్ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం సందర్భంగా లస్సీ మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు బచ్చు సతీష్, బచ్చు వెంకన్న, పోలిశెట్టి మహేష్, పొట్టుముత్తు వెంకటేష్, హాకీ నాగరాజ్, ఊర వినోద్ , తెల్లప్రోలు ఉదయ్ కుకడపు సంతోష్ సముద్రాల అరవింద్ బచ్చు విశ్వనాథ్ బన్నీ రవీందర్ ఆర్యవైశ్య మండల అధ్యక్షులు పోలా సైదులు చిదల లింగయ్య ఊర వేణు పాల్గొన్నారు.

# హక్కుల సాధనకై ఉద్యమించాలి

విశ్వంభర, సూర్యాపేట: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే స్ఫూర్తితో కార్మికులు తమ హక్కుల సాధన కోసం వ్యవస్థ పై ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ధర్మబిక్షం భవనం నందు ఎఐటయుసి ప్రాంతీయ అధ్యక్షులు దంతాల రాంబాబు అధ్యక్షతన పార్టీ జెండా జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జెండా ప్రాంతీయ గౌరవ సలహాదారులు చామల అశోక్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాలు త్యాగాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను నేడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేతుల్లో కీలుబొమ్మగా మారిన ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని వాటి రక్షణ కోసం జరిగే పోరాటంలో కార్మికులంతా ఎర్రజెండా నీడలో ప్రభుత్వాలపై తెగించి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. సరిగ్గా 140 సంవత్సరాల క్రితం సాధించిన ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసే పన్నెండు గంటల పని విధానాన్ని తీసుకొచ్చే కుట్ర కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని దానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు.

# ఉచితవైద్యం శిబిరం

## 14 సంవత్సరాల పిల్లలకు ఉచిత టీకాలు

విశ్వంభర, నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం ముదక్ పల్లి ప్రాథమిక హెల్త్ సెంటర్లో 14 సంవత్సరాల పిల్లలు సుమారు 79 మందికి పరీక్షలు నిర్వహించి వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. డాక్టర్ జమిల్ , డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి విద్యార్థులకు 14 సంవత్సరాలలోపు ఉన్న విద్యార్థులందరికీ ఉచిత టీకాలు అందించడం జరిగిందని ఆమె అన్నారు. ప్రతి ఒక్కరు టీకాలు వేయించుకోవాలని డాక్టర్ పిలుపునిచ్చారు. 24 గంటలు అందుబాటులో ప్రాథమిక హెల్త్ సెంటర్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ ప్రణయ్ దీపిక ఏనం వనజ కన్జర్ అనసూయ పాల్గొన్నారు.

ప్రజా విశ్వంభర V3 NEWS

# పసుపు రైతులపై పశ్చిమాసియా యుద్ధ ప్రభావం

## - రోజురోజుకు పడిపోతున్న ధరలు

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
పశ్చిమాసియాలో యుద్ధం, రాష్ట్రంలో పసుపు రైతుల పాలిట శాపంగా మారింది. పసుపును బంగారంగా భావించి సాగు చేసిన కర్షకులకు గిట్టుబాటు ధర రాక ఇబ్బంది పడుతున్నారు. అరబ్ దేశాలకు వెళ్లాల్సిన వేల టన్నుల పసుపు నిల్వలు గోదాముల్లోనే మూలుగుతున్నాయి.గుంటూరు జిల్లా దుగ్గిరాల మార్కెట్ పసుపు కొనుగోళ్లు, ఎగుమతులకు కేంద్రంగా ఉంటోంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు ఇక్కడికి పసుపు పంటను తెచ్చి విక్రయిస్తుంటారు. కడప, కర్నూలు, గుంటూరు జిల్లాలోని కొల్లూరు, భట్టిప్రోలు ప్రాంతాల నుంచి రోజుకు వెయ్యి బస్తాల సరకు మార్కెట్ కు వస్తుంటుంది. సీజన్ మొదట్లో నాణ్యమైన పసుపు క్వింటాకు రూ.15 వేల వరకూ పలికింది. నెల రోజులుగా ధరలు తగ్గిపోతున్నాయి. క్వింటాకు రూ.4వేల వరకు నష్టం : మార్కెట్‌లో తాజా ధరలు చూస్తే బల్బ్ రకం పసుపు క్వింటాకు రూ.10వేల నుంచి 11,900 రూపాయల వరకూ పలికింది. ఫింగర్ రకం క్వింటాకు రూ.10,300 నుంచి రూ.12వేల వరకు ధర దక్కింది. రైతులు క్వింటాకు రూ.4వేల వరకూ నష్టపోతున్నారు. దుగ్గిరాల మార్కెట్‌లో పసుపు కొనుగోలు చేసే వ్యాపారులు ఇరాన్‌తో పాటు అరబ్ దేశాలకు ఎగుమతులు చేస్తుంటారు. యుద్ధం కారణంగా ఇరాన్‌కు ఎగుమతులు నిలిచి కొనుగోళ్లు తగ్గాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.యార్డులో లైసెన్స్‌డ్ వ్యాపారుల కొరత : దుగ్గిరాల మార్కెట్ యార్డులో లైసెన్స్‌డ్ వ్యాపారుల కొరత రైతుల పాలిట శాపంగా మారుతోంది. గతంలో ఎనిమిది మంది లైసెన్స్ కొనుగోలుదారులు ఉండేవారు. ఇప్పుడు ముగ్గురు మాత్రమే క్రియాశీలకంగా ఉన్నారు. మిగిలిన వారు యార్డుకు రావడం లేదు. యార్డుకు తెచ్చిన



సరకును చిన్నవ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారని రైతులు చెబుతున్నారు. గతేడాది పసుపు పంటకు మంచి ధర ఉందని యుద్ధం కారణంగా ఎగుమతులు నిలిచి ధరలపై ప్రభావం కనిపిస్తోందని దుగ్గిరాల మార్కెట్ యార్డ్ ఉన్నతశ్రేణి కార్యదర్శి సుబ్బారావు తెలిపారు. మరోవైపు క్వింటా పసుపు పండించడానికి సాగు నుంచి మొదలు పంట చేతికి వచ్చే వరకూ సుమారు రూ.8వేలు ఖర్చు అవుతోంది. ఎకరానికి 5 నుంచి 6 పుట్ల విత్తనం అవసరం. సేద్యాలు, కూలీలు, ఎరువులు, కౌలు, తవ్వకాలు ఇతర ఖర్చులు కలిపితే ఎకరానికి రూ.2 లక్షల నుంచి రూ. 2.30 లక్షల వరకూ పెట్టుబడి అవుతోంది. గతేడాదితో పోలిస్తే సాగు ఖర్చులు పెరిగినట్లు రైతులు చెబుతున్నారు.

# కార్మికులతో కలిసి మండుటెండలో 4 కిమీ రిక్షా తొక్కిన మంత్రి నిమ్మల

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
అంతర్జాతీయ కార్మిక దినోత్సవం రాష్ట్రంలో ఘనంగా జరిగింది. శ్రామికలోకం వేడుకల్లో మమేకమైంది. కార్మికులకు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి సహా మంత్రులు, ప్రజాప్రతినిధులు మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మిక హక్కులు కాపాడటానికి, వారి సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడించారు.రాష్ట్రవ్యాప్తంగా మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. వృత్తి ఏదైనా శ్రమించే ప్రతి మనిషికి సమాన గౌరవం ఇవ్వడం మన కర్తవ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అహర్నిశలూ శ్రమిస్తున్న శ్రామిక వర్గ హక్కులను గుర్తించే చారిత్రాత్మక దినోత్సవం ఇదని అభిప్రాయపడ్డారు. దేశ ఆర్థిక పురోగతికి వెన్నెముక అయిన వ్యవసాయం ముందుకు వెళుతున్నదంటే రైతుల, రైతు కూలీల శ్రమ శక్తే కారణమన్నారు. కార్మికులు, కర్షకులు కలిసి నడిస్తేనే దేశం ప్రగతి పథంలో ముందుకు వెళ్తుందని తెలిపారు. కార్మిక, కర్షక సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అనునిత్యం ప్రణాళికాబద్ధంగా ఆలోచిస్తు, ముందడుగు వేస్తుందన్నారు.దేశ ప్రగతిని ముందుకు నడిపించే రథచక్రాలు కార్మికులని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులు, ఉపాధి శ్రామికులు దేశ నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియడారు. కార్మికులు, శ్రామికుల భద్రత, సంక్షేమం కోసం ఎల్లవేళలా కట్టుబడి కృషి చేస్తామని తెలియజేస్తూ, ప్రతి కార్మికునికి, శ్రామికునికి హృదయపూర్వక మేడే శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధి హామీ శ్రామికులకు గౌరవం కల్పించే దిశగా, "కూలీలు" అనే పదాన్ని "శ్రామికులు"గా మార్పు చేయడం, వారి కుటుంబాలకు భరోసా కల్పించేలా పరిహార మొత్తాన్ని పెంచడం వంటి చర్యలను కూటమి ప్రభుత్వం చేపట్టిందని పవన్ తెలిపారు.కూటమి ప్రభుత్వం విజయవంతంగా చేపట్టిన మ్యాజిక్ డ్రెయిన్స్, ఫారంపాండ్స్ తదితర కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకువెళ్లేలా రూపొందించిన వీడియోను పవన్ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. పవన్?తో పాటు శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, సినీ నటులు నాని, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు వ్యక్తం చేసిన అభిప్రాయాలతో ఈ వీడియో రూపొందించటం విశేషం. సమాజ ప్రగతిలో ముఖ్యపాత్ర పోషిస్తున్న కార్మిక లోకానికి, శ్రమజీవులకు మంత్రి నారా లోకేశ్? మేడే శుభాకాంక్షలు తెలిపారు. శ్రమతోనే అభివృద్ధి సాధ్యమని తేల్చిచెప్పారు. శ్రామికుడు లేనిదే ప్రపంచం లేదని కార్మికుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం అహర్నిశలు కృషిచేస్తోందని స్పష్టం చేశారు. అనేక కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. కార్మికులు గౌరవంగా జీవించాలన్నదే ప్రజాప్రభుత్వ సంకల్పమని తెలిపారు.

**4 కిమీ రిక్షా తొక్కిన మంత్రి నిమ్మల..**
జగన్ ఐదేళ్ల పాలనలో అన్ని రంగాలతో పాటు కార్మిక రంగాన్ని విచ్ఛిన్నం చేశారని మంత్రి నిమ్మల రామనాయుడు ఆరోపించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో మంత్రి నిమ్మల రామనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా మేడే వేడుకలు జరిగాయి. మేడే సందర్భంగా మంత్రి నిమ్మల కార్మికులతో కలిసి రిక్షాల ర్యాలీలో పాల్గొన్నారు. కార్మికులతో కలిసి మండుటెండలో 4 కిలోమీటర్లు



మంత్రి నిమ్మల రిక్షా తొక్కారు. ప్రతి ఏటా మేడే రోజున కార్మికులతో కలసి ర్యాలీలో పాల్గొనడం ఎంతో సంతృప్తి, ఆనందాన్ని కలిగిస్తుందని మంత్రి నిమ్మల చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పురోగతిలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. దేశాభివృద్ధి రథ చక్రాలకు కార్మికులే చోదక శక్తి, కర్షకులే దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా శ్రమజీవులందరికీ 'మేడే' శుభాకాంక్షలు తెలిపారు. జాతి నిర్మాణంలో అహర్నిశలు శ్రమించే కార్మిక, కర్షక సోదరుల కష్టం వెలకట్టలేనిదని వారి శ్రమకు తగిన గౌరవం, సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా మన ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమం, రైతన్నల అభ్యున్నతే ధ్యేయంగా అడుగులు వేస్తూ ప్రతి శ్రమజీవి కళ్లలో ఆనందం చూసే వరకు విశ్రమించామని తేల్చిచెప్పారు.

**కార్మికుల శ్రమే ప్రధాన ఆధారం..**
కార్మికులకు మంత్రి వాసంశెట్టి సుభాష్ మేడే శుభాకాంక్షలు తెలిపారు. దేశ అభివృద్ధికి కార్మికుల శ్రమే ప్రధాన ఆధారం అని వ్యాఖ్యానించారు. సమాజ పురోగతికి కార్మికుల పాత్ర అపారమని స్పష్టం చేశారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్మికులు గర్వంగా మేడే జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అన్ని రంగాల కార్మికులకు ఆరోగ్యం, ఆనందం కలగాలని ఆకాంక్షించారు.అనకాపల్లిలో ప్రపంచ కార్మిక దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న చట్టాలను ప్రభుత్వాలు రద్దు చేయడం తగదన్నారు. కార్మిక వర్గం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ పిలుపునిచ్చింది. కర్నూలు జిల్లాలో మేడే దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కర్నూలులోని సీపీఎం కార్యాలయంలో సుందరయ్య విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఎంతో కష్టపడి కార్మిక చట్టాలను సాధిస్తే వాటిని నీరుగార్చే ప్రయత్నం జరుగుతుందని కార్మికులు గమనించాలని గుర్తు చేశారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ రద్దు.. 6వ తేదీకి తీర్పు వాయిదా

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
డ్రైవర్ వీధి సుబ్రమణ్యం హత్య కేసులో సాక్షులను చంపుతానని బెదిరించడం ద్వారా బెయిల్ నిబంధనలను వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబు ఉల్లంఘించినందున ఆయనకు ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని వేసిన పిటిషన్?పై న్యాయస్థానం తీర్పు వాయిదా వేసింది. తీర్పును ఈ నెల 6వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి తెలిపారు. డ్రైవర్ సుబ్ర మణ్యం హత్య అనంతరం 218 రోజులపాటు జైల్లో ఉన్న అనంతబాబుకు గతంలో సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చింది.ఇటీవల సాక్షులను బెదిరించినందున బెయిల్?ను రద్దు చేయాలని కోరుతూ పోలీసుల తరపున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాళ్ల సుబ్బారావు పిటిషన్ వేయగా ఇప్పటికే వాదనలు ముగిశాయి. దీనిపై ఈ రోజు తీర్పు వస్తుందని అంతా ఆశించారు. అయితే సుబ్ర మణ్యం హత్య కేసులో సాక్షులను బెదిరించిన కేసులో ప్రస్తుతం జైల్లో ఉన్న అనంతబాబు తనకు బెయిల్ ఇవ్వాలని న్యాయస్థానంలో పిటిషన్ వేశారు. అనంతబాబు బెయిల్ పిటిషన్‌పై రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టు జడ్జి ఈ రోజు వాదనలు విన్నారు. ఈ కేసులో బెయిల్ ఇవ్వవద్దని స్పెషల్ పీపీ ముప్పాళ్ల సుబ్బారావు వాదించారు.తనకు వ్యతిరేకంగా సాక్ష్యం చెబితే చంపి శవాలు దొరకకుండా చేస్తానం టూ సాక్షులను అనంతబాబు వాట్సప్ వీడియో కాల్ ద్వారా బెదిరించారని డబ్బిచ్చి ప్రలోభాలకు గురి చేశారని కోర్టుకు తెలిపారు. ఈ సమయంలో బెయిల్ ఇవ్వవద్దని న్యాయమూర్తిని పీపీ కోరారు. ఇదే సమయంలో జోక్యం చేసుకున్న అనంతబాబు తరపు న్యాయవాదులు సాక్షులను బెది రించిన కేసులో అనంతబాబు ప్రమేయం ఎక్కడా లేదని కోర్టుకు తెలిపారు. ఆధారాలు లేకుండా కేసు నమో దు చేశారని చెప్పుకొచ్చారు.మరోవైపు అనంత బాబును కస్టడీకిఇవ్వాలని కోరుతూ కాకినాడ కోర్టులో పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయని ఈ నెల 4వ తేదీన దీనిపై నిర్ణ యం ప్రకటిస్తామని అనంతబాబు తరపు న్యాయవాదులు



న్యాయమూర్తికి తెలిపారు. దీంతో ఇరువైపులా వాదనలను విన్న న్యాయమూర్తి తీర్పును ఈ నెల 6వ తేదీకి వాయిదా వేశారు. పోలీసులు, అనంతబాబు దాఖలు చేసిన పిటిషన్లపై తీర్పు ఈ నెల 6న తీర్పు వెలువరిస్తామని న్యాయస్థానం తెలిపింది.

# ఎమ్మెల్యేలూ జాగ్రత్త.. పనితీరుపై ప్రజలనే అడుగుతా: చంద్రబాబు

**విశ్వంభర, పమిడిముక్కల:** రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. " పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నా. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు. తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం" అని చంద్రబాబు అన్నారు.గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్- మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇప్పటివరకు పెంచలేదు. ఎన్నికలయ్యే వరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నా. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలను ట్రూడౌన్ చేశాం. గత ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచింది.ఇకపై ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే అడుగుతా. ఎమ్మెల్యే పనితీరు సరిగా లేకుంటే.. వారికి ఇంకొక ఛాన్స్ ఉండదు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఈఎస్‌ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. శ్రీసిటీ, తిరుపతి, అమరావతిలో ఈఎస్‌ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యం. నేర ప్రవృత్తి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు. వైకాపా అధినేతకు మానసిక సమస్య ఉంది. ఒకసారి అవకాశమిస్తే అందర్నీ మోసం, నాశనం చేశారు. ప్రజావేదికను నిర్మిస్తే.. రెండు గంటల్లో కూల్చేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. అమరావతిని శ్మశానం అని ప్రచారం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే..రైతులు బంగారం పండించేవారు. నీటి ఎద్దడి ఉండేది కాదు. గొడ్డలి పార్టీకి మద్దతిచ్చేవారు ఒకసారి ఆలోచించుకోండి. బాబాయి ని హత్య చేసి గుండెపోటు అన్నారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని 'సాక్షి'లో రాశారు. విపక్షంలో ఉండేది వైసీపీ కాదు.. గొడ్డలి పార్టీ" అని చంద్రబాబు అన్నారు.



# అమరావతిలో బసవతారకం ఆస్పత్రి.. నిర్మాణ పనులు ప్రారంభించిన బాలకృష్ణ

విశ్వంభర, అమరావతి: ఏపీ రాజధాని అమరావతిలో బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి నిర్మాణపనులను హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రారంభించారు. రూ.750 కోట్లతో తుళ్లూరు సమీపంలో ఆస్పత్రి నిర్మాణం చేపడుతున్నారు. దీనికోసం ఏపీ ప్రభుత్వం 21 ఎకరాల భూమిని కేటాయించింది. మొదటి దశలో 500 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టనున్నారు. ఈసందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు తీసుకొని పనులు ప్రారంభించినట్లు చెప్పారు. అమరావతిలో ఆస్పత్రి సేవల కోసం అందరూ ఎదురు చూస్తున్నట్లు చెప్పారు. "అంతర్జాతీయ ప్రమాణాలతో లేటెస్ట్ ఎక్విప్‌మెంట్‌తో ఇక్కడ ఆస్పత్రి ఏర్పాటుచేస్తున్నాం. హైదరాబాద్ బసవతారకం ఆస్పత్రి స్థాపించి 25 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో జూన్ 22న భారీ కార్యక్రమం ఏర్పాటుచేయబోతున్నాం. ఈ కార్యక్రమానికి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులను ఆహ్వానించనున్నాం" అని తెలిపారు.



## అవకాశాలున్న జిల్లాగా శ్రీకాకుళాన్ని మారుస్తాం
## కేంద్రమంత్రి రామ్మోహన్



**విశ్వంభర, పలాస:** వెనుకబడిన జిల్లాగా కాదు.. అవకాశాలున్న జిల్లాగా శ్రీకాకుళాన్ని మారుస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు. పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో ఆయన శుక్రవారం పర్యటించి పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోంపేట మండలం ఎర్రముక్కాంలో మత్స్య సాగరమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చరిత్రలో నిలిచిపోయేలా మత్స్య సాగరమాల రూపకల్పన చేసినట్లు చెప్పారు. మూలపేట పోర్టు అనుసంధానంగా అనేక పరిశ్రమలు తెస్తున్నామని చెప్పారు.

## పోలవరం ప్రాజెక్టుపై జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు సమీక్ష



**విశ్వంభర, అమరావతి:** పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావు సమీక్ష నిర్వహించారు. రాష్ట్రం నుంచి సీఎస్ సాయి ప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు. పోలవరం పునరావాస కార్యక్రమాలు పూర్తి చేయడంపైనా ఆయన సమీక్షిస్తున్నారు. ఎగువ రాష్ట్రాల అభ్యంతరాలు, వాటితో సమన్వయం వంటి అంశాలపై చర్చిస్తున్నట్లు సమాచారం. రెండో దశ భూసేకరణ, పునరావాస ప్యాకేజీ అమలుపైనా చర్చిస్తున్నట్లు తెలిసింది. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తులో 194.6 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే అంశంపై చర్చిస్తున్నారు. భద్రాచలం ముంపుపై వస్తున్న అభ్యంతరాలపైనా చర్చిస్తున్నట్లు సమాచారం.

## కూటమి ప్రభుత్వ సంస్కరణలతో అద్భుత ఫలితాలు

**విశ్వంభర, అమరావతి:** పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వ సంస్కరణలతో అద్భుత ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం గతేడాది కంటే 4 శాతం పెరిగిందని.. మంత్రి లోకేశ్ అమలు చేస్తోన్న సంస్కరణలు ప్రశంసనీయ మన్నారు. విద్యా శాఖలో తెస్తున్న సంస్కరణల వల్లే ఇది సాధ్యమైందని వివరించారు.



## విద్యుదాఘాతంతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మృతి

విశ్వంభర, సంతకవిటి: విజయనగరం జిల్లా సంతకవిటి మండలం మిర్తివలసలో విషాదం చోటు చేసుకుంది. తమ్ముడి వివాహం రోజే విద్యుదాఘాతంతో అన్న మృతి చెందాడు. మేడపై దుస్తులు ఆరేస్తుండగా పెళ్లి డెకరేషన్‌కు ఏర్పాటు చేసిన విద్యుత్‌వైర్లు తగిలి సతీశ్ (32) అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గుర్తించిన బంధువులు హుటాహుటిన శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిం చగా.. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు వెల్లడించారు. సతీశ్‌కు ఏడాది క్రితం వివాహ మైంది. ఆయన హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. కుమారుడి మృతితో ఒక్క సారి గా పెళ్లింట విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.



## పవనన్నా ఇది మనందరి విజయం : నారా లోకేశ్

**విశ్వంభర, ఏపీబ్యూరో:** పదోతరగతి పరీక్షలఫలితాలపై ఏపీమంత్రి నారా లోకేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. పదో తరగతి పరీక్షల ఫలితాలలో విద్యార్థులు సాధించిన విజయం అందరి సమిష్టి కృషి అని వ్యాఖ్యానించారు. ఈ విజయంపై అభినందనలు తెలిపిన డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ధన్యవాదాలు తెలిపారు లోకేష్. విద్యార్థులు, టీచర్లు, తల్లిదండ్రులు... ప్రభుత్వ కృషి వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యా యి అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ప్రోత్సాహం, అందరి సహకారంతో రాష్ట్ర విద్యాశాఖను దేశానికి రోల్ మోడల్ గా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ కూడా పెట్టారు నారా లోకేష్.



## ఏపీకి కేంద్రం గుడ్ న్యూస్.. పోలవరానికి రూ.3,300 కోట్లు

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
కేంద్ర ప్రభుత్వం ఏపీకి మరో గుడ్ న్యూస్‌తెలిపింది. పోలవరం ప్రాజెక్టు పనుల కోసం అదనంగా సుమారు రూ. 3,300 కోట్ల నిధులను మంజూరు చేయడానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇటీవల ఢిల్లీలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శితో రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతా ధికా రులు జరిపిన కీలక భేటీలో ఈ నిధుల మంజూరుపై సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే కేంద్రం ఈ ప్రాజెక్టు కోసం సుమారు రూ. 2,300 కోట్లను విడుదల చేసింది. తాజాగా విడుదల చేయనున్న నిధులతో ప్రాజెక్టు పనులకు కొత్త ఊపిరి పోయనుంది. ముఖ్యంగా 2026-27 కేంద్ర బడ్జెట్‌లో పోలవరం కోసం కేటాయించిన రూ. 3,320 కోట్లకు ఇది అదనపు బలం కానుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తూ, జూన్ 2027 నాటికి ప్రాజెక్టును సంపూర్ణంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ప్రధానంగా డయాఫ్రమ్ వాల్ నిర్మాణం, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ పనులు, అలాగే ప్రధాన డ్యామ్ పనులను వేగవంతం చేయడానికి ఈ నిధులను వెచ్చించనున్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు కావడంతో, దీని వ్యయాన్ని కేంద్రమే భరిస్తోంది. తాజా ఆర్థిక సహాయంతో గతంలో నిలిచిపోయిన పనులు పుంజుకోవడమే కాకుండా, నిర్వాసితుల పునరావాసం ప్రక్రియను కూడా వేగవంతం చేసే అవకాశం ఉంటుంది.



## వలస పక్షులను నమ్మొద్దు: జగన్‌పై మంత్రి సవిత సెటైర్లు

**విశ్వంభర, ఏపీ బ్యూరో:**
ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి.. వాళ్లకున్న నాలెడ్జ్‌తో రాష్ట్రాన్ని దిగజార్చారని వైఎస్ జగన్ పైనా, వైసీపీ నాయకులపైనా మంత్రి సవిత మండ పడ్డారు. నిజంగా వాళ్లకు నాలెడ్జే ఉంటే కళ్యాణదుర్గంలో తంతే పెనుకొండలో ఎందుకు పడ్డారని ఉషశ్రీ చరణ్ నుద్దేశించి ఆమె ఎద్దేశా చేశారు. బెంగుళూరు వయా కళ్యాణదుర్గంవయా పెనుకొండ వయా బెంగుళూరుకు సర్వీసులు చేసే వలస పక్షులను నమ్ముకోవొద్దని వైసీపీ నాయకులను మంత్రి సవిత సూచించారు. నియోజక వర్గ అభివృద్ధికి రేయింబవళ్లు కృషి చేస్తున్నానని, తనకు సహకరించాలని వైసీపీ నాయకుల కు పిలుపునిచ్చారు. చెప్పులు అందరికీ ఉంటాయని, తాము వేయించగలమని, కాని, తమ నాయకుడు క్రమశిక్షణతో మెలగాలని దిశా నిర్దేశం చేశారని మంత్రి సవిత తెలిపారు. అం దుకే, వాళ్లెంత రెచ్చగొడుతున్నా సంయమనంతో, సంస్కారంతో వ్యవహరిస్తున్నామన్నారు. నోరు ఉంది కదా అని ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేది లేదంటూ ఖబడ్దార్ అని మంత్రి సవిత హెచ్చరించారు.



# నిబద్ధత కలిగిన గొప్ప రాజకీయ నాయకురాలు

## మే 2 పద్మజా నాయుడు వర్ధంతి

పద్మజా నాయుడు స్వాతంత్ర్య సమర యోధురాలు, కవయిత్రి, సుదీర్ఘ కాలం పాటు గవర్నర్ గా పని చేసిన మహిళ. ఆమె హైదరాబాద్‌లో జరిగిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ సంయుక్త వ్యవస్థాపకురాలు. పురుషుల ఆధిపత్య ప్రజా రంగంలో, సామాజిక సేవకురాలిగా, రాజకీయ నాయకురాలిగా, పాలకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. పద్మజా నాయుడు 1900 నవంబర్ 17న హైదరాబాద్‌లో జన్మించారు. ఆమె (బెంగాలీ) తల్లి ప్రఖ్యాత కవి, భారత స్వాతంత్ర్య సమర యోధురాలు సరోజిని నాయుడు. ఆమె (తెలుగు) తండ్రి ముత్యాల గోవింద రాజులు నాయుడు వైద్యుడు. ఆమెకు జైసూర్య, లీలమణి, ఆదిత్య,రణధీర అనే నలుగురు తోబుట్టువులు. పద్మజా నాయుడు పెద్దగా చదువు కోలేదు. చిన్ననాడు చేరిన మహబూబియా బాలికల ఉన్నత పాఠశాలలో నాలుగేళ్ళు మాత్రమే చదివారు. బాల్యంలో తరుచుగా అనారోగ్యానికి గురికావడంతో ఆమె చదువు సరిగా సాగలేక పోయింది. ఆమె నేర్చుకున్న విద్య, సంస్కారం అంతా తన తల్లి నివాసమైన గోల్డెన్ థ్రెషోల్డ్‌కు వచ్చి పోయే వారి మధ్యే సాగి పోయింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ వర్క్స్ శాఖను ఏర్పాటు చేసి ఆమె పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపట్టారు. ప్రజారోగ్య పరిరక్షణకై ఆమె ఎంతో మంది ముస్లిం స్త్రీలను సభ్యులుగా చేర్చుకొని ప్లేగు రిలీఫ్ కమిటీని ఏర్పాటు చేశారు. పౌరుల స్వేచ్ఛ కొరకు, జాగిర్దారీ వ్యవస్థకు వ్యతిరేకంగా స్థాపించ బడిన స్వదేశీ లీగ్ అనే సంస్థకు అధ్యక్షురాలిగా పనిచేశారు. ఆ సంస్థ ఆధ్వర్యంలోనే, ఆమె తన సంపాదకత్వంలో 'వన్ వరల్డ్' అనే పత్రికను నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో సామ్యవాద సిద్ధాంతానికి ప్రభావితులైన కొందరు ఉస్మానియా విద్యార్థులు కామ్రేడ్స్ అసోసియేషన్ స్థాపించగా, సంస్థకు పద్మజా నాయుడు సహకారాన్ని అందించారు. 1935లో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు, రైతుల దుర్భర పరిస్థితులను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి ఏర్పడిన హైదరాబాద్ సహాయక సంఘానికి ఆమె అధ్యక్షురాలుగా వ్యవహరించారు. అనేక ప్రాంతాలు పర్యటించి, భాధితులకు తక్షణ సహాయం అందేలా ఏర్పాట్లు చేశారు. 1942 లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్ళారు. అప్పటికి మహిళలకు ప్రత్యేకమైన జైళ్ళు లేకపోవడం, పలుకుబడి కలిగిన కుటుంబానికి చెందిన వారు కావడం మూలాన ఆమెను హయత్ నగర్ లోని బేగం గారి దేవిడిలో సకల సౌకర్యాలు కలిగిన రాజభవనంలో నిర్బంధించారు. దానికి ఆమె సంతోషించక తనతో పాటు అరెస్ట్ అయిన తక్కిన మహిళలకు ఎందుకు ఆ వసతులు కల్పించలేదని ప్రశ్నించారు. చైనా యుద్ధ సమయంలో ఆమె తనకున్న విలువైన బంగారు ఆభరణాలను నేషనల్ డిఫెన్స్ ఫౌండేషన్ కు సమర్పించారు. భారతదేశం నుండి " క్రమబద్ధమైన బ్రిటీష్ ఉపసంహారణ" కోరుతూ మహాత్మా గాంధీ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమం లో పాల్గొన్నారు. ఖాదీ గురించి గాంధీ సందేశాన్ని విస్తృతంగా వ్యాప్తి చేసేందుకు, విదేశీ వస్తువులను బహిష్కరించడానికి కృషి సల్పారు. పద్మజా నాయుడు భారత రాజ్యాంగ సభకు 1950 లో ఎన్నికై రెండేళ్ళు ఆ పదవిలో కొనసాగారు. ఆ తరువాత ఆమె 1956 నుండి 1967 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పనిచేశారు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకు గా తల్లితో పాటు పనిచేసిన పద్మజ, 21 యేళ్ల వయసులోనే హైదరాబాదులో భారత జాతీయ కాంగ్రెస్ సహ వ్యవస్థాపకురాలు అయ్యారు. స్వాతంత్ర్యానంతరం పద్మజా నాయుడు పార్లమెంటుకు ఎన్నికైనారు. కానీ అనారోగ్యం వల్ల రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తరువాత పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పని చేశారు. అర్ధ శతాబ్దానికి పైగా ఉన్న ఆమె ప్రజా జీవితంలో, స్వచ్ఛంద సేవలో ఔత్సాహికురాలై, ఆమె మానవ సంక్షేమ నిర్దేశిత, అంతర్జాతీయ మానవతా సంస్థ రెడ్‌క్రాస్ సొసైటీ తో సంబంధం కలిగి ఉండేది. బంగ్లాదేశ్ శరణార్థుల సహాయచర్య లప్పుడు భారత రెడ్ క్రాస్ సంస్థ ఛైర్ పర్సన్ గాను పని చేసి, ప్రముఖ పాత్ర పోషించారు. పద్మజా



నాయుడుకు భారత్ సేవక్ సమాజ్, అఖిల భారత హస్తకళల బోర్డు, నెహ్రూ స్మారక నిధి వంటి సంస్థలతో అనుబంధం ఉండేది. పద్మజ తన కవితా సంకలనం "ది ఫెదర్ ఆఫ్ డాన్" పేరుతో 1961లో ప్రచురించారు. 1975లో పద్మజా నాయుడు స్మృత్యర్థం డార్జిలింగులోని జంతు ప్రదర్శన శాలను పద్మజా నాయుడు హిమాలయ జంతు ప్రదర్శన శాలగా మార్చగా, నాటి ప్రధానమంత్రి ఇందిరా గాంధీ ప్రారంభోత్సవంచేశారు. పద్మజా నాయుడు తన తల్లి (సరోజిని నాయుడు) నివాసం ది గోల్డెన్ థ్రెషోల్డ్‌ను 1970లలో హైదరాబాద్ విశ్వవిద్యాల యానికి (యుఒహెచ్) అప్పగించారు. భారతజాతికి అందించినవిశిష్ట సేవలకు గుర్తింపుగా ఆమెకు పద్మవిభూషణ్ పురస్కారం లభించింది. పద్మజా నాయుడు 1975 మే 2 న పరమపదించారు.

## బెంగాల్‌లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్

విశ్వంభర, నేషనల్ బ్యూరో:



పశ్చిమ బెంగాల్ లోని 15 పోలింగ్ కేంద్రాల్లో రీ-పోలింగ్ నిర్వహించనున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. డైమండ్ హార్బర్‌లోని 4, మగ్రాహట్ పశ్చిమ్‌లోని 11బూత్‌లలో శనివారం తిరిగి పోలింగ్ చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ బూత్‌లన్నీ దక్షిణ 24 పరగణాల జిల్లా పరిధిలోకి వస్తాయి. బుధవారం జరిగిన రెండో దశ పోలింగ్‌లో.. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పోటీ చేస్తున్న డైమండ్ హార్బర్ ప్రాంతంతో పాటు మగ్రాహట్ పశ్చిమ్‌లోని పలు బూత్‌లలో ఈవీఎం బటన్లను టేప్‌తో కప్పి ఉంచినట్లు భాజపా (దీజీూ) ఆరోపించింది. పలు పోలింగ్ బూత్‌లతో 'కమలం గుర్తు' కనిపించకుండా చేసి, ఓటేయకుండా అధికారులు అడ్డుకుంటున్నారని భాజపా ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఘటనపై దర్యాప్తు చేసిన ఈసీ ఆయా పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఫల్తా నియోజకవర్గంలోని మరో 30బూత్‌లలో కూడా మళ్లీ పోలింగ్ నిర్వహించే అవకాశం ఉన్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే దీనిపై ఈసీ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపును తోసిపుచ్చలేం.. ప్రభుత్వ వర్గాలు

విశ్వంభర, నేషనల్ బ్యూరో: పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఉంటుందని వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. విపక్షాలు కూడా ఇదే వాదన చేస్తున్న వేళ వాణిజ్య సిలిండర్ ధర భారీగా పెరిగింది. ఈ క్రమంలోనే సమీప భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును కొట్టిపారేయలేమని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా ముడిచమురు ధరలు భారీగా పెరిగినప్పటికీ, నాలుగేళ్లుగా రిటైల్ ధరలు సవరించకపోవడం వల్ల నష్టాలు పెరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో భవిష్యత్తులో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగే అవకాశాన్ని తోసిపుచ్చలేమని పేర్కొన్నాయి. హర్మూజ్ జలసంధి మార్గంలో నౌకల రాకపోకలపై ఆంక్షలు, అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు కొలిక్కి రాకపోవడంతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. ఇటీవల బ్యారెల్ ధర 126 డాలర్లకు చేరుకుంది. నాలుగేళ్లలో ఇదే గరిష్ఠం. ఆ తర్వాత కొంత తగ్గి ప్రస్తుతం 110 డాలర్లపైనే కొనసాగుతోంది.

# ఇప్పుడు మేమెవ్వరం?





ఆకుల అమరయ్య,
సీనియర్ జర్నలిస్టు, హైదరాబాద్.



మేడే జిందా హై.. జర్నలిస్ట్ భీ అ'మర్ రహే' హై!..మేడే.. ప్రపంచ కార్మిక హక్కుల దినోత్సవం. అక్కడక్కడా జెండా దిమ్మెలకున్న కొయ్యలకు అరుణపతాకాలు రెపరెపలాడుతున్నాయి. విజయవాడ ఓ వీధిలో మట్టికొట్టుకు పోయి పెచ్చులూడుతున్న ఓ పాత పత్రికా కార్యాలయం గోడ మీదున్న నినాదం... నన్ను ఒక్కసారిగా గతంలోకి తీసుకెళ్లింది..1986 జనవరి.. ఓరోజు మధ్యాహ్నం.. విశాఖపట్నం మద్దిలపాలెం ఆంధ్రభూమి కార్యాలయం. రిసెప్షన్ ముందున్న ఓ మహిళ ఒక్కొక్కర్నీ పైఅంతస్తుకు పంపిస్తున్నారు. ఇప్పుడు నా వంతు..విశాలమైన గది.. ఇద్దరో ముగ్గురో కూర్చొని ఉన్నారు. ఒకాయన తెలుసు. ఆర్వీ రామారావు, రెసిడెంట్ ఎడిటర్. రెండో ఆయన.. ఏదో రెడ్డి గారు, డెక్కన్ క్రానికల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్ (మాజీ పోలీసు అధికారి అనగా విన్నా)మూడో మనిషెవరో గుర్తులేదు...ఓ గొంతు: ('మీ' అన్నారో/'నీ' అన్నారో గుర్తులేదు) పేరు?(ఉద్యోగార్థినైన నేను చాలా ఒద్దికగా, అణకువగా)నమస్కారం సార్. నా పేరు అమరయ్యఇంకో గొంతు: ఏ ఊరు?నేను: ప్రకాశం జిల్లా అడవిపాలెం సర్.మళ్లీ ఎవరో: జర్నలిజంలోకి ఎందు కొస్తున్నావు?నేను: (మోర పైకెత్తి) సామాజిక సేవ, సమాజంపై ప్రేమతో..ఆర్వీ రామారావనుకుంటా:.. అబ్బా, ఏదైనా పార్టీలో చేరకపోయావా!నేను: ఉద్యోగం కావాలి కదా!నోరిప్పితే ఒట్టు..మళ్లీ అదే గొంతు: ఏమైనా పుస్తకాలు చదివే అలవాటుందా?'చిరస్మరణ' అని ఓ అనువాద నవల ఈమధ్య చదివా సర్.ఏం.. తెలుగు నవల్లు చదవ్వా? నా నుంచి మాట ల్లేవ్!కాసేపుమౌనం.. నేనురాసిన పరీక్ష ఆన్సర్ షీట్ అటుఇటు తిరగేసి.. సరే, వెళ్లు. బయట వెయిట్ చెయ్! ఓ గంట తర్వాత.. ఎప్పుడు జాయిన్ అవుతావు? వారంలోగా..! 8 నెలలు తిరిగాయి.'సర్, నేను మా ఊరికి వెళతా సర్..' 'ఏమైనా పిచ్చా.. వచ్చే మార్చికి జర్నలిస్టులకు పాలేకర్ వేజ్ బోర్డ్ రాబోతోంది. అప్పుడు నీ జీతం ఎంతవుతుందో తెల్సా.. 12, 13 వందలవుతుంది. నైట్ డ్యూటీ అలెవెన్స్, క్యాజువల్ లీవ్స్, సిక్ లీవ్స్, ఎరన్డ్ లీవ్స్, పీఎఫ్, ఇఎస్ఐ, సినీ రెవ్యూ రాస్తే మరో 50.."కాద్సార్, నే వెళ్తా..' 'మళ్లీ ఆలోచించుకో.. ఒకసారి పోతున్నావంటే ఒక ఛాన్స్ పోతున్నట్టు' అని ఆర్వీఆర్ గట్టిగానే చెప్పారు.

'ఉహూ...'పేపర్ మారా!! ఆంధ్రజ్యోతి. బెజవాడలో కొంత, తిరుపతిలో మరికొంత కాలం.. పాలేకర్ అవార్డ్ వచ్చింది. భూమిలో జీతాలు పెరిగాయి. నాకూ 1250 ఇచ్చారు ఆంధ్రజ్యోతిలో. కానీ, మోస పోయా. ట్రైనీ సబ్ గా ఆర్డరిచ్చి జీతం 1250 ఇచ్చారు. తిరుపతి వేశారు. దీంతో నా సీనియారిటీ గోవిందా.. పుట్టేవాళ్లకు అన్నను, పెరిగేవాళ్లకి తమ్ముణ్ణీ.. ఛీ..ఛీ.. నామీద నాకే కోపం.. బేరమాడుకోవడం కూడా చేతకాని తనం!

ఆంధ్రప్రభ. అందరూ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగమంటున్నారు కదా.. ప్రభలో చేరితే నో.. వెతకబోయిన తీగె కాలికి తగిలినట్టు 'ఆంధ్రప్రభ'చెన్నై జీఎం నుంచి పిలుపు. 'బాగా పన్జేస్తారట కదా.. నువ్వు నచ్చావు. ప్రభలో చేరం'డన్నారు. 'చేరతా గానీ, విజయవాడ ఇస్తారా' అన్నా.'ఓకే. ఇస్తాం గానీ, షరతులు వర్తిస్తాయి. మా నిబంధనల ప్రకారం మళ్లీ ట్రైనింగ్ లో చేరాలి. తర్వాత ప్రొబేషన్, ఆ పైన పర్మినెంట్! అయితే, నువ్వెక్కడో చేస్తున్నావు కనుక నేరుగా ప్రొబెషన్ ఇస్తాం. ఏడాది తర్వాత పరీక్ష రాయాలి. మళ్లీ మొదటికి! చలో విజయవాడ!!1989 నుంచి 2003 వరకు రామనాథ్ గోయెంకా సామ్రాజ్యం.. చట్టాలు, వేజ్ బోర్డులు, ఎరియర్స్, బదిలీలు.. అంతా చట్టప్రకారమే. బేరసారమే. వర్కింగ్ జర్నలిస్టుల చట్టం ఒకటుందని, అందులో జర్నలిస్టులు, నాన్ జర్నలిస్టులు, తలకో నిర్వచనం, పత్రికా సిబ్బందికి ఓ వేజ్ బోర్డు, దానికో కథ, ఖర్జానా ఉందని, ఐదేళ్లకో పదేళ్లకో దాన్ని వేయాలని, ఆ ప్రకారం జీతాలు, ప్రమోషన్లు ఉంటాయని తెలిసింది. ఇకనేముంది గోతాలకు గోతాలు జీతాలు వస్తాయనుకున్నా.. మేమూ చేశాం సమ్మె..పాలేకర్ తర్వాత బచావత్ వేజ్ బోర్డు.. దాని ప్రకారం వేతనాలు ఇవ్వాలి. 'ఎక్స్ ప్రెస్' యాజమాన్యం ఇవ్వ లేదు. మేం సమ్మెచేశాం. యాజమాన్యం మాతో ముచ్చట.. ఓ గ్రేడ్ తగ్గించుకుని ఇంగ్లీషు వాళ్ల కంటే ఓ క్లాస్ తక్కువ వేతనాలు ఖరారు. ఇంతలో 'టైమ్స్ ఆఫ్ ఇండియా' ఏపీలో రంగప్రవేశం... వస్తూనే కాంట్రాక్ట్ సిస్టం తీసుకొచ్చింది. మేము మూడు దాటి నాలుగంకెల్లోకి వస్తుంటే కాంట్రాక్ట్ లో వచ్చేవాళ్లు వస్తూనే ఐదారు అంకెల్లో వస్తున్నారు. సక్సెస్ ఫుల్ గా డివిజన్ వచ్చింది. మాలో మాకు తేడా వచ్చింది. అప్పటివరకు ఐక్యంగా ఉన్న వర్కింగ్, నాన్ వర్కింగ్ జర్నలిస్టులు వేరుకావడం మొదలైంది.

చట్టం కొందరికి చుట్టమైంది. కోర్టు వాళ్లకు వరమైంది. మావేజ్ బోర్డ్ వెనకబడింది. యాజమాన్యాలు మొండికేశాయి. బచావత్ తర్వాత మనీసానా వేతన సంఘం ఏర్పాటైంది. సిఫార్సులు ఇవ్వడానికే పుష్కరకాలం పట్టింది. యాజమాన్యాలు కోర్టులకెక్కాయి. ఓ 'దయాళువైన' పత్రికా యజమాని స్వయంగా రాజ్యసభలోనే- 'జర్నలిస్టులకు ఈ మాదిరి వేతనాలు ఇస్తే, ఇక మేము ఆస్తులు అమ్ముకోవడమో, లేక పత్రికలు మూసేస్కోవడమో' చేయాలన్నారు. కోర్టులు కూడా 'చూసీచూడనట్టు పోండని' కొన్నేళ్లు నానబెట్టి, మా నోటికాడ కూడు తీసేశాయి. మా చట్టం - దివిసీమ ఉప్పెనలో చిక్కుకున్న కొబ్బరిచెట్టు మాదిరి, తలతెగి వేలాడుతోంది. 'ఆంధ్రప్రభ' చేతులుమారింది. మాకుమా'ముత్తా'తలు గుర్తు కొచ్చారు. చట్టం సంగతి దేవుడెరుగు, ముందు పొట్టనిండితే అంతే చాలనుకున్న చాలామంది ఎక్కడికక్కడ గోడలెక్కాం. మమ్మల్ని బేరం పెట్టిన మారాజులు పోయినచోటే ఎదిగారు. బేరసారాలు, 'లౌక్యం' తెలియనివాళ్లు మూత పడి మళ్లీ తెరుచుకున్న 'ఆంధ్రజ్యోతి'వైపు కొందరు, మరికొన్నింటి వైపు మరికొందరం... అన్నీ మూసేసుకుని పొట్టబోసుకున్నాం. 2007 .. 'సాక్షి' అవతరించింది. జస్టిస్ జి.ఆర్. మజీథియా వేజ్ బోర్డు వచ్చింది. పాత వాటికే దిక్కులేక కొత్తదాన్ని పట్టించుకునే దెవరు? చెట్టుకొకరు పుట్టకొకరమయ్యాం. మా చట్టం ప్రకారం వర్కింగ్ జర్నలిస్టులది మేధో శ్రమ. 6 గంటలు పనిచేస్తే చాలు. అప్పటికే మాకు'రాజుని మించిన రాజభక్తి' వచ్చింది. ఇలా అలవాటుపడేలా చేయడంలో యాజమాన్యాలు ఆరితేరాయి. చూస్తుండం గానేరాజ్యాలు,రాజ్యాంగాలు మారిపోతున్నాయి. యజమానికి ఇష్టమైతే ఉద్యోగం, కష్టమైతే ఊస్టింగ్. చచ్చినా బతికినా వాళ్లకు ఒకటే. ఒకప్పుడు 'ఉద్యోగ భద్రత.. చేసిన పనికి వేతనం.. వేజ్ బోర్డు సిఫార్సుల అమలు' వంటి నినాదాలు (గోడమీది) చేసిన మేము... మాకు అక్రిడిటేషన్ కార్డు, బస్సు పాస్, ఇళ్ల స్థలం ఇస్తే చాలనే దాకా వచ్చాం. రాజ్యాంగం ముందు ఐఎఎస్ అయినా, ఐపిఎస్ అయినా, నల్లకోటు జడ్జీలైనా ఒకటే అనే మహా న్యాయ కోవిదుడైన సుప్రీంకోర్టు జడ్జ్ గారు జర్నలిస్టులైనా ఒకటే అని తీర్పు ఇవ్వడంతో నోటికాడికి వచ్చిన కూడు నేలపాలైంది. ఇంతలో మాన్యవర్ నరేంద్ర మోడీ సర్కారు మాకున్న ఏకైక దిక్కు, మా చట్టం 'వర్కింగ్ జర్నలిస్ట్స్ అండ్ మిస్లేనియస్ యాక్ట్ -1955'ని రద్దుచేసింది. ఇది వాడకంలో లేదన్న పేరిట 4 లేబర్ కోడ్స్ లో కలిసిపోయింది. జర్నలిస్టు అంటే మా పితామహులు మానికొండ చలపతిరావు లాంటివాళ్లు ఇచ్చిన నిర్వచనం ఇప్పుడు లేదు. కార్మికులమా, మేధావులమా? సమ్మె మాటెత్తి బతకగలమా? మా గ్రామీణ విలేఖరికి సెంటీమీటర్ల లెక్కనైనా ఇవ్వాల్సిన 3,4 రూపాయలైనా ఇస్తారా? అని అడగ్గలమా?2025 వర్కింగ్ జర్నలిస్టుల పాలిట దారుణమైన సంవత్సరం. పని గంటల్లేవు. పనికి తగ్గ వేతనాల్లేవ్. నిర్వచనాల్లేవ్. ఉద్యోగ భద్రత లేదు. కనీసం అపాయింట్‌మెంట్ లెటర్లు అడిగే సాహసమూ లేదు. చివరకు చట్టమే లేదు!ఇప్పుడు మేము ఎవ్వరం?.. ఎవ్వరికీ తెలియదు.అందుకే.., మేడే వర్ధిల్లాలి!నాలుగు లేబర్ కోడ్స్ నశించాలి!

(నేను ఇది రాస్తున్న సమయానికి చిత్తూరు జిల్లా వి.కోట మండలం ధన్నాపురంలో విలేకరి వారణాసి జగన్మోహన్‌రెడ్డి ఓరాడీషీటర్ చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. కన్నీటి నివాళి జగన్)

## ఆపరేషన్ సిందూర్‌కు ఏడాది.. మరోసారి మీడియా ముందుకు ఆ ఇద్దరు..

విశ్వంభర, నేషనల్ బ్యూరో:

పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా గతేడాది మే7న భారత ప్రభుత్వం 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన సంగతి తెలిసిందే. ఆనాటి ఆపరేషన్ విషయాలను వెల్లడించి.. దేశ ప్రజల దృష్టిని ఆకర్షించిన అధికారిణులు మరోసారి మీడియా ముందుకు రానున్నారు. మే7తో ఆపరేషన్ నిర్వహించి ఏడాది కావస్తుండడంతో అదే తేదీన కర్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మీడియా ముందుకు రానున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు అధికార వర్గాలు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ ఇద్దరు అధికారిణులతో పాటు ఈ మీడియా సమావేశంలో నేవీ కమాండర్ ప్రేరణా దేవస్థలి, మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఈ బ్రీఫింగ్‌లో ఆపరేషన్ సిందూర్ మెరుపు దాడులకు సంబంధించిన వివరాలు, ప్రాముఖ్యత, దాని వెనుక జరిగిన ప్రణాళిక వంటి విషయాల గురించి వారు మాట్లాడే అవకాశం ఉంది. దేశ రక్షణలో పెరుగుతున్న మహిళా అధికారుల పాత్రను దేశ ప్రజలకు తెలియజేయడం కూడా ఈ కార్యక్రమం వెనుక ఉన్న మరో ఉద్దేశంగా తెలుస్తోంది. గుజరాత్‌కు చెందిన సోఫియా .. బయోకెమిస్ట్రీలో పోస్టు



గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1990ల్లో సైన్యంలో చేరారు. ఆర్మీ సిగ్నల్ కోర్‌కు చెందిన సీజన్డ్ ఆఫీసర్. మూడు దశాబ్దాల ప్రయాణంలో ఆమె రాజీలేని వైఖరి ప్రదర్శించారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ఇంజినీరింగ్ విద్యను పూర్తిచేసి, భారత వైమానిక దళంలోని హెలికాప్టర్ పైలట్‌గా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. డిసెంబర్ 18, 2019న ఫ్లయింగ్ బ్రాంచ్‌లో శాశ్వత కమిషన్ హోదా పొందారు.

## 'అసెంబ్లీకి సీఎం తాగొచ్చారు'- విపక్షాల సంచనల ఆరోపణలు



విశ్వంభర, నేషనల్ బ్యూరో:

మేడేను పురస్కరించుకొని పంజాబ్?లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశం రాజకీయ దుమారాన్ని రేపింది. ఈ సమావేశం ఆశించిన లక్ష్యం పక్కకు పోయి, ముఖ్యమంత్రి భగవంత్ మాన్ వ్యక్తిగత ప్రవర్తన అంశం చర్చనీయాంశమైంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మద్యం సేవించి అసెంబ్లీకి వచ్చారని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సభలో పెను దుమారం రేగింది. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. అందరికీ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఇదే సమయంలో భగవంత్ మాన్ ప్రసంగించేటప్పుడు మద్యం మత్తులో తూగుతున్నట్లు, మాట తుల్లినట్లు కనిపించే వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవడం మరింత సంచలనంగా మారింది."ఈ రోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్? మద్యం సేవించి కనిపించారు. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన సీఎం భగవంత్ ప్రవర్తన శాసనసభ గౌరవాన్ని దిగజార్చింది. సభలో అనుచితంగా ప్రవర్తించినందుకు గానూ ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమ్?ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను కోరుతున్నాం. అలాగే, సీఎం భగవంత్? మాన్‌కు మద్యం పరీక్షలు నిర్వహించాలని స్పీకర్ సంధ్వాన్?ను డిమాండ్ చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాం. అవసరమైతే మద్యం పరీక్షలకు మేం కూడా సిద్ధం" అని కాంగ్రెస్? నాయకుడు సుఖ్?పాల్ సింగ్? ఖైరా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అలాగే, అసెంబ్లీ ప్రతి పక్ష నాయకుడు ప్రతాప్ సింగ్ బజ్వా కూడా ఈ విషయంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి మద్యం మత్తులో అసెంబ్లీకి వస్తే తామేం చేయాలని, రాష్ట్ర అధిపతి పూర్తిగా మత్తులో ఉన్నప్పుడు సమావేశాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి ఇలాంటి పరిస్థితిలో ఉండటం బాధాకరమని వ్యాఖ్యానించారు. సభలో ఉన్న అందరికీ పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. మరోవైపు, శిరోమణి దళ్? కూడా భగవంత్? మాన్?పై తీవ్ర ఆరోపణలు చేసింది. కార్మిక దినోత్సవం రోజునే సీఎం మద్యం సేవించి అసెంబ్లీ సమావేశాలకు రావడం సిగ్గుచేటని పేర్కొంది. పంజాబ్ ప్రజల ముందు నిజం బయట పడేందుకు సీఎంకు వెంటనే డోప్ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది. ఇదిలా ఉండగా, రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ కూడా భగవంత్ మాన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం భగవంత్ తరచూ మద్యం సేవించే ప్రభుత్వ కార్యక్రమాలు,బహిరంగ, అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారని ఆరోపించారు. పంజాబ్ వంటి సున్నితమైన సరిహద్దు రాష్ట్రానికి సీఎంగా ఉన్న వ్యక్తి ఎప్పుడూ మద్యం మత్తులో ఉండటం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. మద్యం మత్తులోనే ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయని ఆమె అన్నారు. అయితే, ఎన్నికల ముందు భగవంత్? మాన్?, తాను ఇకపై మద్యం సేవించబోనని తన తల్లిపై ప్రమాణం చేశారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకోలేదని కూడా మాలీవాల్ విమర్శించారు. సీఎంకు మద్యం పరీక్షలు నిర్వహించాలని, అందులో ఆయన మద్యం సేవించినట్లు తేలితే సీఎం పదవి నుంచి దిగిపోవాలని ఆమె డిమాండ్ చేశారు. కాగా, ఈ వివాదంపై కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) అధికారికంగా స్పీకర్‌కు లేఖ రాసింది. సీఎం భగవంత్ మాన్‌తో పాటు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేలందరికి ఆల్కో-మీటర్, డోప్ టెస్టులు నిర్వహించాలని అందులో కోరింది. పారదర్శక విధానంలో పరీక్షలు జరగాలని, ఒక గంటలోపే ప్రక్రియ ప్రారంభించాలని సూచించింది. అలాగే పరీక్షలు నిష్పక్షపాతంగా జరిగేందుకు చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ వైద్య బృందాన్ని నియమించాలని కాంగ్రెస్ కోరింది. అధికార, ప్రతిపక్ష సభ్యులందరికీ సమానంగా పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది.

## అమెరికాకు 100 బిలియన్ డాలర్ల నష్టం

విశ్వంభర,నేషనల్ బ్యూరో:



ఇరాన్‌తో చేస్తున్న యుద్ధం కారణంగా తమ దేశానికి 25 బిలియన్ డాలర్లు (సుమారు రూ 2.30లక్షల కోట్లు) ఖర్చయినట్లు ఇటీవల అమెరికా ప్రకటించిన సంగతి తెలిసిందే. దీన్ని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఖండించారు. యుద్ధం ఖర్చును అమెరికా తక్కువ చేసి చూపిస్తోందన్నారు. ఇప్పటికే అమెరికాకు 100 బిలియన్ డాలర్ల (సుమారు రూ. 9లక్షల కోట్లు) మేర నష్టం వాటిల్లిందని అన్నారు."ఖర్చుపై పెంటగాన్ అబద్ధాలు చెబుతోంది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు కారణంగా అమెరికాకు భారీగా నష్టం వాటిల్లింది. ఈ యుద్ధ ప్రభావం అమెరికా పన్ను చెల్లింపుదారులపై పరోక్షంగా చాలా ఉంది. ప్రతి అమెరికా కుటుంబంపైనా ఆర్థిక భారం పడుతోంది" అని అరాగ్చీ పేర్కొన్నారు.

## ఇరాన్‌లో పేలుడు.. 14 మంది ఐఆర్‌జీసీ సైనికులు మృతి

విశ్వంభర, టెహ్రాన్:



ఇరాన్‌లో జరిగిన పేలుడు ఘటనలో ఆ దేశ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్‌జీసీ)కు చెందిన 14 మంది మృతిచెందారు. ఈ మేరకు ఇరాన్ మీడియా వెల్లడించింది. జంజాన్ సమీపంలో ఈ పేలుడు సంభవించినట్లు తెలిపింది. యుద్ధ సమయంలో శత్రు దేశాలు జారవిడిచిన క్లస్టర్ బాంబులు, ఎయిర్‌మైన్లు ఈ ఘటనకు కారణమైనట్లు పేర్కొంది.













Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com